
: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

గుంటూరు
17-10-2025 శుక్రవారం
సంపుటి: 31 సంచిక: 256
పేజీలు: 12 వెల: 6.50


గురువారం శ్రీశైల మల్లన్న దేవస్థానంలో ధ్వజస్తంభం వద్ద మొక్కుతున్న ప్రధాని మోడీ

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్


గురువారం కర్నూలులో జరిగిన 'సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, అసంఖ్యాకంగా పాల్గొన్న ప్రజలు

## గూగుల్‌తో ప్రపంచమంతా ఎపివైపు చూస్తోంది..

### చంద్రబాబు, పవన్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి

### లోకేష్ సారథ్యంలో పండుగలా జిఎస్టీ సంస్కరణల ప్రచారం

### కర్నూలులో 'సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభలో ప్రధాని మోడీ

### రూ. 13,429 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని

**కర్నూలు, అక్టోబర్ 16 ప్రభాతవార్త బ్యూరో:** వికసిత్ ఎపితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జిఎస్టి సంస్కరణలకు సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఎపి కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఎపి యువత ఎంతో చైతన్య కలిగిన వారని.. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఎపి అభివృద్ధి పథంలో వెళ్తోందని.. కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గురువారం నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ జిఎస్టి బచత్ ఉత్సవ్‌పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ ముప్వెన్నల

>>2

### డబుల్ ఇంజిన్ సర్కార్‌తో

## రాష్ట్రానికి డబుల్ బెనిఫిట్

### సూపర్ సిక్స్ పథకాలతో వడివడిగా అభివృద్ధి: సిఎం చంద్రబాబు

**కర్నూలు, అక్టోబర్ 16, ప్రభాతవార్త :** కేంద్రంలో మరియు రాష్ట్రంలో ఎన్డీఎ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు రెట్టింపు ప్రయోజనాలు లభిస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్నూలులో జరిగిన సూపర్ జిఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. 'ఒకే దేశం-ఒకే పన్ను-ఒకే మార్కెట్' విధానంతో అమలులోకి వచ్చిన జిఎస్టీ 2.0 ద్వారా 99 శాతం వస్తువులు సున్నా, 5 శాతం శ్లాబ్‌ల పరిధిలో ఉన్నాయని తెలిపారు. జిఎస్టీ పన్ను తగ్గింపుతో నిత్యావసరాల

>>2



## కర్మయోగి మోడీ: డిసిఎం పవన్

**కర్నూలు, అక్టోబరు 16, ప్రభాత వార్త :** స్వార్థం లేని ప్రజా సేవకుడు నరేంద్ర మోడీ అని పవన్ కల్యాణ్ ప్రధానిని కొనియాడారు సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో డి.సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దేశ సేవే పరమావధిగా ప్రజలకు సేవ చేస్తున్న ప్రధాని మోడీ నిజమైన కర్మయోగి అని పేర్కొన్నారు. ఆయన కేవలం ప్రభుత్వాన్ని నడిపే నేతగానే కాకుండా, భవిష్యత్ రెండు మూడు తరాల ప్రజలకు దిశానిర్దేశం చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆత్మనిర్భర్ భారత్ ద్వారా దేశాన్ని ప్రపంచ పటంలో గౌరవప్రదమైన స్థానంలో నిలబెట్టారని తెలిపారు. గూగుల్ వంటి అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు దేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావడం మోడీ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. జిఎస్టీ 2.0 సంస్కరణలతో పేదలు, సామాన్యులకు భారీగా ప్రయోజనం కలుగుతోందని, జీవిత, ఆరోగ్య భీమా సహా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం వల్ల ప్రజలు ఆదా చేసుకోగలుగుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కనీసం 15 సంవత్సరాలపాటు కొనసాగాలని, పెట్టుబడులు మరియు పరిశ్రమల నమ్మకాన్ని దెబ్బతీయకుండా స్థిరమైన ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు కూటమి సంకల్పబద్ధంగా పని చేస్తుందని పవన్ స్పష్టం చేశారు.



### జిఎస్‌టి సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు

## రూ. 8వేల కోట్ల లబ్ధి

### ఎపికి అన్నివిధాలా ప్రధాని మోడీ సహకారం

2లో

డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు: మంత్రి లోకేష్



17-10pg2exHMNWJQE 2_17-10pg2exHMNWJQE.qxd 10/16/2025 11:51 PM Page 1





గురువారం కర్నూలు సభలో ప్రధాని మోడీని సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉన్నారు

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రధాని మోడీ

## 'సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ నుంచి వర్చువల్ గా ఐదు పనులకు శంకుస్థాపనలు, 8 ప్రాజెక్టుల ప్రారంభోత్సవం

## రెండు ప్రాజెక్టులు జాతికి అంకితం

**కర్నూలు, అక్టోబర్ 16, ప్రభాతవార్త :** సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ వేదిక నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మొత్తం రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి రూ.9,449 కోట్ల విలువైన ఐదు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయగా, రూ.1,704 కోట్ల విలువైన ఎనిమిది ప్రాజెక్టులను ప్రారంభించారు. అదనంగా రూ.2,276 కోట్ల విలువైన రెండు ప్రధాన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు: విద్యుత్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ - రూ.2,886 కోట్లు, ఓర్వకల్లు-కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ - రూ.4,922 కోట్లు, కొత్త వలస-విజయనగరం మధ్య 4వ లైన్ - రూ.493 కోట్లు, పెందుర్తి-సింహాచలం నార్త్ రైల్వే ఫ్లైఓవర్ లైన్ - రూ.184 కోట్లు, సబ్బవరం-షీలానగర్ జాతీయ రహదారి - రూ.964 కోట్లు. **ప్రారంభించిన ప్రాజెక్టులు:** రేణిగుంట-కడప-మదనపల్లె రోడ్డు - రూ.82 కోట్లు, కడప-నెల్లూరు-చునియంపల్లి రోడ్లు - రూ.286 కోట్లు, కనిగిరి బైపాస్ రోడ్డు - రూ.70 కోట్లు, గుడివాడ-నూజెండ్ల వద్ద నాలుగు లేన్ల రోడ్ ఓవర్ బ్రిడ్జ్ - రూ.98 కోట్లు, కల్యాణదుర్గం-రాయదుర్గం-మొలకలమూరు రోడ్డు - రూ.13 కోట్లు, పీలేరు-కలసూర్ నాలుగు లేన్ల రోడ్డు - రూ.593 కోట్లు, నిమ్మకూరు తీనిలిలో నైట్ విజన్ గ్లాసుల ఉత్పత్తి కేంద్రం - రూ.362 కోట్లు, చిత్తూరు ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్ - రూ.200 కోట్లు. **జాతికి అంకితం చేసిన ప్రాజెక్టులు:** కొత్తవలస-కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులు - రూ.546 కోట్లు, శ్రీకాకుళం-అంగుల్ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ - రూ.1,730 కోట్లు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, రవాణా, శక్తి రంగాల అభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్

>> జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు.

బహిరంగ సభలో జిఎస్‌టి సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ..."ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఎపిలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఎపిలో ప్రగతి వేగంగా జరుగుతోంది. ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయి. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఎపిలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఎపిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సిఇఒ నాతో చెప్పారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుంది. విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది. ఈ విషయంలో సిఎం చంద్రబాబు విజన్‌ను అభినందిస్తున్నాను. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్‌లో ఎపి కీలకంగా మారింది." అని ప్రధాని అన్నారు.

**ఆంధ్రప్రదేశ్ ప్రగతిని కాంగ్రెస్ నాశనం చేసింది**

కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని నాశనం చేశాయి. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఎపి ప్రగతి ద్వారాలు తెరుచుకుని వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. దేశ ప్రగతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చాలా కీలకం. రాయలసీమ అభివృద్ధితోనే ఎపి అభివృద్ధి ఉంది. కర్నూలులో ప్రారంభించిన ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంత ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఎపి వేగవంతమైన అభివృద్ధి కోసం కొప్పర్తి ఒర్వకల్ పారిశ్రామిక నోడ్‌ల ద్వారా వచ్చే పెట్టుబడులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాయలసీమలోని ప్రతి జిల్లాలోనూ ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి. ఆత్మనిర్భర్ భారత్‌కు సరికొత్త శక్తిగా ఎపి తయారవుతోంది. కృష్ణా జిల్లా నిమ్మకూరులో రక్షణ రంగానికి చెందిన నైట్ విజన్ గాగుల్స్, క్షి పణుల సెన్సార్లు, డ్రోన్ గార్డులను తయారు చేసే సంస్థ ఏర్పాటు కావడం ముదావహం. రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు కూడా చేసేందుకు ఆస్కారం ఇస్తుంది. ఆపరేషన్ సింధూర్‌లో దేశంలో తయారైన ఉత్పత్తుల బలం ఏమిటో చూశాం. కర్నూలును భారత్ డ్రోన్ హబ్ తయారు చేయాలని ఎపి ప్రభుత్వం నిర్ణయించటం సంతోషం. ఆపరేషన్ సింధూర్ ద్వారా డ్రోన్ల పనితీరు ఏమిటో తెలియచెప్పింది. డ్రోన్ల తయారీ ద్వారా కర్నూలు భారత్‌కు ఓ గర్వకారణంగా నిలుస్తుంది." అని ప్రధాన మంత్రి చెప్పారు.

**ప్రారంభించిన ప్రాజెక్టులు ప్రగతికి మార్గాలు**

ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటి బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయి. ఈ ప్రాజెక్టులతో కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరం. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించాం. తద్వారా దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్లాక్ అవుట్ లాంటి విద్యుత్ సంక్షోభాలు వచ్చాయి. తలసరి విద్యుత్ వినియోగం 1000 యూనిట్ల కంటే తక్కువే ఉంది. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా లేని పరిస్థితి. ఇప్పుడు క్లీన్ ఎనర్జీ నుంచి మన అవసరాలకు తగినంత ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం. 1400 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఇప్పుడు దేశంలో ఉంది. తగినంత విద్యుత్ దేశ ప్రజలకు లభ్యం అవుతోంది. శ్రీకాకుళం నుంచి ఆంగుల్ వరకూ గ్యాస్ పైప్ లైన్‌ను జాతికి అంకితం చేశాం. 20 వేల సిలెండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాటిలింగ్ ప్లాంట్‌ను చిత్తూరులో ప్రారంభించాం. మల్టీమోడల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెంచుతున్నాం. సబ్బవరం నుంచి షీలా నగర్ వరకూ కొత్త హైవేతో కనెక్టివిటీ పెరిగింది. రైల్వే రంగంలో కొత్త యుగం ప్రారంభమైంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రాజెక్టులను ప్రారంభించుకున్నాం. స్వాతంత్రం సాధించి వందేళ్ల పూర్తైన 2047 నాటికి దేశం వికసిత్ భారత్‌గా తయారవుతుంది. వికసిత్ భారత్ 2047 సాధన సంకల్పానికి స్వర్ణాంధ్ర లక్ష్యం మరింత బలం అందిస్తుంది." అని మోడీ వెల్లడించారు.

**ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం**

పౌరులకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనేది ఎన్డీయే ప్రభుత్వ నినాదం. ఈజ్ ఆఫ్ లివింగ్ అనే అధ్యాయం దేశంలో ప్రారంభమైంది. ప్రజల జీవితాలను సులభతరం చేసే సంకల్పంతో ఎన్డీయే పని చేస్తోంది. 12 లక్షల ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికి పన్ను లేకుండా చేశాం. వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. సరిగ్గా నవరాత్రి ముందు జిఎస్‌టి సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చాం. ప్రజలపై పన్నుల భారం తొలగించాం. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జిఎస్‌టి పొదుపు ఉత్సవాన్ని పండుగలా చేసుకున్నారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పేరిట కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం. ఈ జిఎస్‌టి సంస్కరణల వల్ల రూ.8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషం. కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉంది... అప్పుడే అది సఫలమైనట్టు. 21వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది." అని ప్రధాని చెప్పారు.

**శ్రీశైల దర్శనం ఆనందాన్నిచ్చింది**

ఢిల్లీ నుంచి నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి ఎపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సహా... వివిధ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి సిఎం, డిప్యూటీ సిఎంలతో కలిసి శ్రీశైల దేవస్థానానికి హెలీకాప్టరులో వెళ్లారు. దేవస్థానంలో కొలువైన శ్రీశైల భ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి వార్లను ప్రధాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రం విశేషాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రధానికి వేదశీర్వాచనాలిచ్చి... తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని ప్రధాని సహా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సందర్శించారు. అక్కడున్న శిల్పాలను, చిత్రపటాల్లోని విశేషాలను ప్రధానికి నిర్వాహకులు వివరించారు. అనంతరం భ్రమరాంబిక గెస్ట్ హౌసులో ప్రధాని భోజన విరామం తీసుకున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్ ద్వారా కర్నూలులో సూపర్ సేవింగ్స్ సూపర్ జిఎస్‌టి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన స్కూలు విద్యార్థులు అందించిన చిత్రపటాన్ని ప్రధాని అందుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో కొలువైన అహోబిలం నర్సింహస్వామి, మహా నందీశ్వరుడు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ప్రాశస్త్యాన్ని ప్రధాని తన ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొలి జ్యోతిర్లింగం ఉన్న సోమనాథ్ ఆలయం ఉన్న గుజరాత్‌లో తాను జన్మించానని.. విశ్వనాధుడి భూమి వారణాసిలో సేవచేసే అవకాశం దక్కిందని అన్నారు. రెండో జ్యోతిర్లింగం శ్రీశైల మల్లిఖార్జున స్వామిదని.. ఇప్పుడు శ్రీశైలం వచ్చి మల్లిఖార్జున స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా దర్శించానని ఛత్రపతి శివాజీ, అల్లమ్మ ప్రభు, అక్కమహాదేవి లాంటి శివభక్తులకు ప్రణామాలు తెలిపారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి లాంటి ధీరులకు నమస్కారం చేస్తున్నానని ప్రధాని అన్నారు. ఈ సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిఎస్‌టి సంస్కరణలతో రాష్ట్ర ప్రజలకు రూ. 8వేల కోట్ల లబ్ధి

## కర్నూలు సభలో మంత్రి నారా లోకేష్



గురువారం కర్నూలు ఎయిర్‌పోర్టులో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న మంత్రి లోకేష్

**కర్నూలు, అక్టోబరు 16 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ అన్నా, ఇక్కడి ప్రజలు అన్నా ప్రధాని మోడీకి అపారమైన ప్రేమ. 16నెలల్లో నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చారు, మనం అడిగిన అన్ని కోరికలు తీరుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నంబర్ 1 కావాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం. గుజరాత్‌లో ప్రభుత్వ కొనసాగింపు వల్లే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ వేడుకల్లో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు చెక్ పోస్టు సమీపంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ... స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ కొనసాగింపు అనేది ముఖ్యం. ప్రధాని నరేంద్ర మోడీ వరుసగా మూడుసార్లు ప్రధాని కావడం వల్లే ప్రపంచంలో 10నుంచి 4వ అతి పెద్ద ఎకానమీగా అభివృద్ధి చెందింది. సంక్షేమం -అభివృద్ధి ప్రజా ప్రభుత్వానికి జోడెద్దుల బండి లాంటివి, కూటమి ప్రభుత్వాన్ని కొనసాగిస్తే ఎపి అన్ని రంగాల్లో నంబర్ 1 కావడం గ్యారంటీ. పవర్ ఫుల్ పీపుల్ మేక్స్ పవర్ ఫ్లేసెస్. సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉంది. అలాంటి సూపర్ పండుగను 140 కోట్ల ప్రజలకు అందించారు మన ప్రధాని నమో. పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించారు. జీఎస్టీ తగ్గడంతో ప్రజలు పండగ చేసుకుంటున్నారు. పేద ప్రజల చిరునవ్వే మన నమోకి పండగ. జిఎస్‌టి తగ్గించాలని ప్రధాని నిర్ణయం తీసుకున్నతరువాత ఫైనాన్స్ మంత్రి కేశవ్‌వచ్చి దాదాపు 8 వేల కోట్లు నష్టపోతామని ముఖ్యమంత్రి చంద్రబాబుకి చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వా లేదు ... పేద ప్రజలకు 8 వేలకోట్ల లాభం జరుగుతుంది కదా అని సిఎం అన్నారు. నమో ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే, దానికి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.

కేంద్రంలో మన నమో ... రాష్ట్రంలో మన సిబిఎన్... ఇది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదు డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్. ప్రధాని సహాయంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నాం. పోలవరం పనులు వేగవంతం అయ్యాయి. అమరావతి పనులు వేగంగా జరగడానికి, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్నారు. నమో సహకారం వల్లే భారత్‌లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. గూగుల్, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోంది.నమో అంటే విక్టరీ. ఆయన ఏ కార్యక్రమం ప్రారంభించినా విజయమే. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు. మన దేశ ప్రభుత్వాలు యూఎన్ దగ్గరకో, ఇతర దేశాల దగ్గరకో వెళ్లి సాయం కోరేవారు. మన నమో రూటే సెపరేటు. పెహల్గావ్‌లో నమో కొట్టిన దెబ్బకి పాకిస్థాన్ దిమ్మ తిరిగిపోయింది. అమెరికా ట్యాక్సులు పెంచితే పెద్ద పెద్ద దేశాలు కూడా వణికిపోయాయి. నమో ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. నమోకి దేశ ప్రజలు అంటే నమ్మకం.. మనకి నమో అంటే నమ్మకం. ఆనమ్మకమే దేశాన్ని,రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# రాష్ట్రానికి డబుల్ బెనిఫిట్

>> వస్తువుల ధరలు తగ్గి పేద, మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఉపశమనం కలిగిందని చెప్పారు. రైతులు, విద్యార్థులు, చిరువ్యాపారులు తదితర వర్గాలం దరికీ లబ్ధి చేకూరేలా సంస్కరణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జిఎస్టీ నెక్స్ట్‌జెన్ సంస్కరణలతో ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.15 వేల వరకు ఆదా అవుతోందని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రానికి 'డబుల్ బెనిఫిట్' లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో పాటు సూపర్ జిఎస్టీతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'సూపర్ సేవింగ్స్' అందాయని పేర్కొన్నారు. మెగా డిఎస్సీ, పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, తల్లికివందనం, దీపం-2.0,పెన్షన్ పంపిణీ వంటి పథకాల ద్వారా రాష్ట్రం సంక్షేమ దిశగా దూసుకెళ్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సూచించిన "'స్వదేశీ' మంత్రం భారత ఆర్థికవ్యవస్థకు బ్రహ్మాస్త్రంగా మారిందని, 'గర్వ్ సే కహో, యే స్వదేశీ హై' నినాదాన్ని ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తిగా స్వీకరించిందని తెలిపారు. ప్రధానిమోడీ 25 యేళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఆయనను ప్రశంసిస్తూ,'21వ శతాబ్దపు నేత నరేంద్ర మోడీ దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తున్నారు" అని సిఎం పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ద్వారా భారత సైనిక సత్తాను ప్రపంచానికి చాటారని చెప్పారు. స్వదేశీ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని చంద్రబాబు అన్నారు. సెమి కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకు స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. కేంద్రం సహకారంతో అమరావతిని నిలబెట్టామని, పోలవరాన్ని గాడిన పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామని, విశాఖలో గూగుల్ ఎఐ డేటా హబ్‌తో పాటు సెమికండక్టర్ యూనిట్, క్వాంటంవ్యాలీ వంటి ప్రాజెక్టులు ఏర్పడుతున్నాయని తెలిపారు. రాయలసీమలో హైకోర్టు బెంచ్ త్వరలో ఏర్పాటు కానుందని, ప్రాంతం జలకళ సంతరించుకున్నదని, స్టీల్, స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్ పరిశ్రమలు రాయలసీమలో అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, హైవే, రక్షణ రంగాలకు చెందిన రూ.13,430 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసినట్లు తెలిపారు. అలాగే రూ.4,922 కోట్ల విలువైన కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్స్‌కు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. దేశ ప్రగతికి ప్రధాని మోడీకి మరింత శక్తి లభించాలని శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున స్వామిని ప్రార్థిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. వికసిత భారత లక్ష్యం సాకారం కావాలని ఆకాంక్షిస్తూ, రాబోయే బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# వారం - వర్జ్యం

17-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ఏకాదశి ఉ.11.14
మఖ మ.2.00
వర్జ్యం : రా.10.35-12.17
దు.ఉ.9.56-10.43, 2)మ.12.17-మ.1.04
శుభసమయం : ఉ.8.20-9.00
రాహుకాలం - ఉ.10.30-12.00

# వార్తాఫలం

**మేషం:** ఇంటి యందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు.

**వృషభం:** నూతన విద్యావకాశాలు లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారంలో అభివృద్ధి సాధిస్తారు.

**మిథునం:** ఇంటిలో ఒకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. ప్రయాణాలు.

**కర్కాటకం :** ఏపనిని చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి.

**సింహం:** దీర్ఘకాలిక ఋణాలు తీరి కొంత ఊపిరిపీల్చుకుంటారు.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** వ్యాపారాలలో స్వల్ప మార్పు చోటు చేసుకుంటాయి.

**వృశ్చికం:** క్రయ, విక్రయాలలో అనుకున్నంతగా లాభాలు పొందలేక పోవచ్చు.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి అందిన సమాచారం కొంత ఆందోళనకు గురిచేస్తుంది.

**మకరం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగ యత్నాలు సాగిస్తారు.

**కుంభం:** నూతన ఒప్పందాలు చేసుకుంటారు. బంధువులను కలుస్తారు.

**మీనం :** వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నవంబరు 2 నుంచి సిఎం చంద్రబాబు లండన్ పర్యటన

**విజయవాడ,అక్టోబరు 16,పభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మరో విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. వచ్చే నెల ఆయన లండన్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులు అధికారికంగా ధృవీకరించారు. నవంబర్ 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు లండన్‌కు బయల్దేరుతారు. ఈ పర్యటన మూడు రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న సానుకూల వాతావరణాన్ని, ప్రభుత్వ విధానాలను, అందుబాటులో ఉన్న అవకాశాలను వారికి వివరించనున్నారు. వచ్చే నెల విశాఖపట్నంలో జరగబోయే సిఐఐ పారిశ్రామిక సదస్సు ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో, సదస్సుకు ముందే కీలకమైన పారిశ్రామికవేత్తలను కలిసి ఏపీకి ఆహ్వానించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. తన లండన్ పర్యటనలో భాగంగా అక్కడి పారిశ్రామిక దిగ్గజాలను విశాఖ సదస్సుకు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఈ ముందస్తు పర్యటన సీఐఐ సదస్సు విజయవంతం కావడానికి, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడానికి దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# రాష్ట్రానికి కేంద్రం మరో నజరానా రూ.21,800 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు ఆమోదం!

**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం నుంచి మరో శుభవార్త చెప్పింది. ఏకంగా రూ.21,800 కోట్ల గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది.కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కింద రూ.21,800 కోట్ల భారీ విద్యుత్ లైన్ల వ్యవస్థ ఏర్పాటు చేయబడనుంది. అనంతపురంనుంచి నెల్లూరు జిల్లా రామాయపట్నం వరకు ఈ లైన్లు విస్తరించనున్నాయి. దీని ద్వారా రాయలసీమలో ఉత్పత్తి అయ్యే సోలార్, విండ్ వంటి పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తరలించవచ్చు. ఇది రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3' కింద కేంద్రానికి ప్రతిపాదించింది. మొత్తం రూ.28,000 కోట్ల అంచనాతో ప్రాజెక్టు సమర్పించగా, సిఇఆర్‌సి పరిశీలించి రూ.21,800 కోట్లకే ఆమోదంతెలిపింది. ఇందులో కేంద్రం 30శాతం గ్రాంట్ (సుమారు రూ.6,540 కోట్లు) కింద అందించనుంది. మిగిలిన వ్యయం అయిన రూ.15 వేల కోట్లను ఏపీ ట్రాన్స్‌కో భరించనుంది. ఈ పనులు 2026-27లో ప్రారంభమై రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధమవుతోంది.

ఈ ప్రాజెక్టు కింద సుమారు 350 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ పంపిణీ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 72,000 మెగావాట్ల సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో అధిక భాగం రాయలసీమ ప్రాంతంలోనే ఉండటంతో, అక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఉత్తరాంధ్రకు తరలించడం ప్రధాన లక్ష్యంగా ఉంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లైన్లను ఉపయోగిస్తే అధిక ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని, ట్రాన్స్‌కో స్వంత నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-1' కింద అనంతపురం జిల్లాలో ట్రాన్స్‌కో నెట్‌వర్క్ అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఆ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి, జిఇసి-3 కింద కొత్త లైన్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇది పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచడమే కాకుండా, విద్యుత్ సరఫరా ఖర్చులను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. రాష్ట్రంలోని కొత్త పరిశ్రమలు, ముఖ్యంగా రాయలసీమలో ఏర్పడే ఫ్యాక్టరీలు మరియు పరిశ్రమలు ఈ ప్రాజెక్టు ద్వారా పెద్ద స్థాయిలో లబ్ధి పొందుతాయి. ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఎపిలో పర్యటించిన సందర్భంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఇక రామాయపట్నం నుంచి కాకినాడ, విశాఖపట్నం వరకు ఈ నెట్‌వర్క్ విస్తరణ కొనసాగుతుంది. దీని ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా మరింత సులభతరం అవుతుంది. విశాఖలోని గూగుల్ డేటా సెంటర్, కర్నూలు జిల్లా రిలయన్స్ ఫుడ్ పార్క్, తిరుపతిలోని ఎలక్ట్రానిక్ కంపెనీలు ఈ కొత్త లైన్ ద్వారా విద్యుత్ పొందనున్నాయి.

# మల్లన్న సన్నిధిలో ప్రధాని మోడీ

## శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

### 8 వేల మంది శివసేవకులతో ఘన స్వాగతం

### ప్రధాని వెంట ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి



శ్రీశైల మల్లన్న ఆలయంలో ప్రధాని మోడీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చక స్వాములు

**నంద్యాల, అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీశైలం చేరుకున్న ఆయన భ్రమరాంబ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ నుండి బయలుదేరిన ప్రధాని నంది మండపం సర్కిల్ ద్వారా దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వైపు ముందుకు సాగారు. మార్గమంతా సుమారు 8,000 మంది శివసేవకులు కాషాయ వస్త్రధారణలో 'హరహర మహాదేవ' నినాదాలతో ప్రధానమంత్రికి ఘన స్వాగతం పలికారు. దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రధానమంత్రి, సిఎం, చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్‌లకు విభూతి, కుంకుమ ధరింపజేసి ఆలయ అంతర్భాగానికి ఆహ్వానించారు. మొదట ధ్వజస్తంభ నమస్కారం, శివ సంకల్పం అనంతరం రత్నగర్భ గణపతి పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పార్చనలు నిర్వహించి దర్శనం చేశారు. తరువాత నందీశ్వర దర్శనం చేసి అర్చకులచే తీర్థప్రసాదం స్వీకరించారు. తదుపరి మల్లికాగుండం వద్ద గర్భాలయ శిఖర దర్శనం అనంతరం శ్రీ భ్రమరాంబ అమ్మవారి ఆలయానికి చేరిన ప్రధానమంత్రి శ్రీ చక్రమునకు కుంకుమార్చన, షోడశోపచార పూజలు నిర్వహించి అమ్మవారి హారతి స్వీకరించారు. వేదాశీర్వచన మండపంలో వేదపండితులు చతుర్వేద ఆశీర్వచన నిర్వహించి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మవార్ల చిత్రపటాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రధానికి అందజేశారు. అనంతరం ప్రధాని మోడీ శ్రీశైలంలో గల శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ప్రధానితో పాటు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆలయ దర్శనంలో పాల్గొన్నారు.

17-10Pg3 GNT 3 GNT_17-10Pg3 GNT.qxd 10/17/2025 12:29 AM Page 1



# పార్వతీపురం వైద్య కళాశాల నిర్మాణం జరుగుతున్నట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- నర్సీపట్నం పర్యటనలో జగన్ వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సవాల్

- లేకుంటే ముక్కు నేలకు రుద్ది జగన్ క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్



**ప్రభాతవార్త విశాఖపట్నం:** నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించి తన సహజ లక్షణమైన అసత్యాలను వల్లెవేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మాజీ సీఎం జగన్‌రెడ్డి విఫలమైన కృషి చేశారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. నర్సీపట్నం పర్యటన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆక్షేపణ తెలిపారు. భూసేకరణే జరగలేదు...నిర్మాణ పనులెక్క? పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నట్లు, అందుకు సంబంధించిన ఫోటోలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుందని మాజీ సిఎం వ్యాఖ్యానించడాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ కాలేజీకి సంబంధించి అధికారంలో నుండి వైదొలగే దాకా జగన్‌రెడ్డి కనీసం భూసేకరణ కూడా చేయలేదని...ఈ వాస్తవాన్ని విస్మరించి ఆ కాలేజీ నిర్మాణంలో ఉన్నట్లు పట్టపగలు, బహిరంగంగా అబద్ధాలు చెప్పడం జగన్ కే సాధ్యమని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. నేను రాజీనామాకు సిద్ధం....నీవు క్షమాపణలు చెప్పగలవా? పార్వతీపురం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించి వాస్తవాల్ని వెలుగులోకి తేవడానికి మాజీ సిఎం తనకు ఇష్టమైన వారితో నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఆ కమిటీ వాస్తవాల్ని పరిశీలించి భూసేకరణ జరిగి, నిర్మాణ పనులు జరుగుతున్నాయని నిర్ధారిస్తే...తాను వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని, లేకుంటే జగన్‌రెడ్డి తన ముక్కును నేలకు రుద్ది క్షమాపణలు తెలపాలని మంత్రి సూచించారు. ఈ సవాల్ ను స్వీకరించే నిజాయితీ, ధైర్యముంటే జగన్‌రెడ్డి వెంటనే స్పందించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనపై ఆయన స్పందించకుంటే పార్వతీపురం కళాశాల విషయంలో జగన్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించడానికి పూనుకున్నారని భావించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. పిపిపి విధానంలో కొన్ని వైద్య కళాశాలల నిర్మాణంపై మాజీ సిఎం జగన్‌రెడ్డి పూర్తిగా అసత్యాల పునాదులపై ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అనుసరిస్తున్న కుట్ర పూరిత ధోరణికి పార్వతీపురం కాలేజీ నిర్మాణం గురించి ఆయన వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రజలందరినీ కొంత కాలం, కొంత మందిని పూర్తికాలం మోసగించవచ్చు కానీ....అందరినీ ఎల్లకాలం యామార్చలేమన్న విషయాన్ని జగన్‌రెడ్డి ఇప్పటికైనా గుర్తించాలని మంత్రి అన్నారు. నీవెంత ఖర్చు పెట్టావు.... జగన్‌రెడ్డీమొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ వ్యయం రూ.8,480 కోట్లలో...తాను అధికారంలోనుంచి వైదొలగేనాటికి రూ.3,000 కోట్లు ఖర్చు చేశానని,

కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.1,000 కోట్లు ఖర్చు చేసి మొత్తం నిర్మాణ పనులను పూర్తి చేయలేదా అని జగన్ ప్రశ్నించడంలోని అనౌచిత్యాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎత్తిచూపారు.

## విజయవాడలో భారీగా స్టెరాయిడ్స్ స్వాధీనం

**విజయవాడ,అక్టోబరు15,ప్రభాతవార్తప్రతినిధి:**నగరంలో భారీగా స్టెరాయిడ్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఎనీడైమ్ ఫిట్నెస్ సెంటర్‌లో స్టెరాయిడ్స్ తో రసూల్ అనే యువకుడు పట్టుబడ్డాడు. జిమ్‌కి వచ్చే యువతకు స్టెరాయిడ్స్ సప్లై చేస్తున్నట్లు పోలీసులు గతుర్తించారు. ఈగల్,టాస్క్‌ఫోర్స్ బృందాలు సంయుక్తంగా దాడులు చేశాయి. నగరం లోని పలు జిమ్‌లకు కూడ రసూల్ స్టెరాయిడ్స్ సప్లై చేస్తున్నట్లు గుర్తించారు. సమీర్ అనే హెల్త్ సప్లిమెంట్స్ అమ్మే వ్యక్తితో కలిసి స్టెరాయిడ్స్ అమ్ముతున్నట్లు గుర్తించారు.

పరారీలో సమీర్ స్నేహితుడు సునీల్‌కోసం పోలీసులు గాలిస్తున్నారు. సునీల్,రసూల్ కలిసి స్టెరాయిడ్స్ అమ్మకాలు చేస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు.

## అభివృద్ధిని చూడలేక పోతున్న వైసిపి: తెదేపా విమర్శ

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): చేతగాని పాలనతో గత ఐదేళ్ళు ప్రజలను నయవంచన చేసిన ఘనత వైసీపీ పాలకులదని పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్ ఎద్దేవా చేశారు.గురువారం స్థానిక రామలింగేశ్వరపేట లోని టీడీపీ కార్యాలయంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మహమ్మద్ ఖుద్దూస్ మాట్లాడుతూ ప్రపంచ దిగ్గజ కంపెనీ గూగుల్



సంస్థ విశాఖ రావడాన్ని వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోవడం వారి గుణాన్ని తేటతెల్లం చేస్తుందని చదువుకున్న విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం వారి జీవితాల్లో వెలుగులు నిండడం వైసీపీకి ఏమాత్రం ఇష్టం లేకుండా పోయిందని,జగన్ రెడ్డి తన ఐదేళ్ళ పాలనలో ఒక్క ఫీజు రీయింబర్స్మెంట్,విదేశీ విద్య ఇవ్వకపోగా యువతను గంజాయి,మద్యపానం వంటి వ్యసనాలకు బానిసలుగా చేసిన ఘన చరిత్ర కలిగిన వాడని,అంటూ రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ పై సుమోటో కేసు నమోదు చేయాలని పోలీసు డిపార్ట్మెంట్ ఈ విధంగా అడుగులు ముందుకు వేయాలని అంటూ, నారా లోకేష్ ను ప్రశ్నించే అంత పెద్దస్థాయి భరత్ ది కాదన్నారు.జిల్లా పార్టీ అధికార ప్రతినిధి జొన్నాదుల మహేష్ మాట్లాడుతూ, వైసీపీ అహంకారపాలనతో గాడి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ,జిల్లాకొక పరిశ్రమని తీసుకొచ్చే విధంగా కృషి చేస్తుంటే ఓర్చుకోలేక ప్రజలు పదకొండుసీట్లు ఇచ్చినా ఇంకా ఏదో బురద జల్లుదామని చేస్తున్న ప్రయత్నాలు ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు.బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ఫణిదపు దుర్గ మాట్లాడుతూ, గూగుల్ సంస్థ ద్వారా రాష్ట్రంలో యువతకు ప్రత్యక్షంగా పరోక్షంగా రెండు లక్షల ఉద్యోగాలు రానున్నాయని, అవేగాక మరిన్ని పరిశ్రమలు తెచ్చే విధందా సీఎం చంద్రబాబు,యువనేత విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని,ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం డబుల్ ఇంజన్ ప్రభుత్వం సమపాళ్ళలో పని చేస్తుందని, భావితరాలకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా, బంగారు బాట వేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని, వైసీపీ కుట్ర రాజకీయాలను,కుతంత్రాలను రాష్ట్ర యువత నమ్మొద్దని హితవు పలికారు.ఈ సమావేశంలో పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు,అక్కిశెట్టి వెంకటేశ్వరరావు,రాష్ట్ర ఐటీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్,దొప్పలపూడి శ్యామ్,పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుభాని,రబ్బానీ,ఎన్టీఆర్ జగన్, పెసర్లంక శ్రీను,చైతన్య,నాగూర్,శ్రావణ్,శ్రీను,శ్రీరాం సుభాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి:మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.గురువారం



పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలోమున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడుతో పాటు ఇంజినీరింగ్, రెవెన్యూ, హెల్త్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. పట్టణంలో పెండింగ్ ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లకు పెండింగ్ ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు.అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై క్యాంప్ కార్యాలయం వద్దకు వచ్చి మంత్రికి అర్జీలు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, త్వరలోనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని,అర్జీదారులకు ఆయన హామీ ఇచ్చారు.

## రైల్వేస్టేషన్లో భారీగా గంజాయి స్వాధీనం

తెనాలి టౌన్ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): తెనాలి రైల్వే స్టేషన్లో గురువారం భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు.రైల్వే ఎస్సై జి.వెంకటాద్రి కథనం మేరకు టాటా నగర్ నుండి ఎర్నాకులం వెళ్లే రైలులో,బోగి నెంబర్ ఎస్3 లో గంజాయి తరలిస్తున్న సమాచారం అందుకున్న జిఆర్పి ఎస్ఐ వెంకటాద్రి,తాసిల్దార్ గోపాలకృష్ణ సమక్షంలో ట్రైన్లో తనిఖీలు నిర్వహించగా, ఒక బ్యాగులో సుమారు నాలుగు కిలోలు పైగా గంజాయిని గుర్తించి సీజ్ చేశారు. అయితే ఈ గంజాయి తరలిస్తున్న వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు.అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటాద్రి తెలిపారు.ఈ సందర్భంగా రైల్వే ఎస్సై జి వెంకటాద్రి మాట్లాడుతూ,రైళ్లలో దొంగ చాటుగా గంజాయి,నిషేధిత వస్తువులుగాని మాదక ద్రవ్యాలు కానీ సరఫరా చేయటం లేదాఎవరికైనా వ్యక్తులకు సహకరించటం గాని చేయటం చట్టరీత్యా నేరమని, మరియు జైలు శిక్ష కూడా అనుభవించవలసి ఉంటుందని,అంతేకాకుండా రైలు ప్రయాణాల్లో ఎవరైనా అనుమానాస్పదం వ్యక్తులు కనబడిన,అనుమానాస్పదం అనిపించిన రైల్వే పోలీసులకి తెలియపరచవలసిందిగా ఎస్సై వెంకటాద్రి సూచించారు.

## పారిశుద్ధ్యం మరింత మెరుగవ్వాలి: కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): పారిశుద్ధ్య నిర్వహణ మరింతగా మెరుగు పరచాలని పారిశుద్ధ్య కార్మికులు సమయానికి హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు కార్మికులకి సూచించారు.గురువారం ఉదయం పట్టణంలోని 5,6డివిజన్ల పరిధిలో కమిషనర్ పర్యటించారు.

## బ్రాహ్మణులకు అన్ని విధాలా అండగా ఉంటాం:మంత్రి నాదెండ్ల.

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): బ్రాహ్మణులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని కూటమి ప్రభుత్వ హయాంలో వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో తెనాలి పట్టణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదాశీర్వచనం సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్గా నియమితులైన, పట్టణానికి చెందిన సీనియర్ జనసేన పార్టీ నాయకులు, తెనాలి పట్టణ బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి, మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకర శాస్త్రికి,మంత్రి నాదెండ్ల మనోహర్ కి 108 మంది వేద పండితులచే వేదశీర్వచనం చేశారు.

# లిక్కరు స్కామ్‌లో నిందితులకు 24 వరకు రిమాండ్



**విజయవాడ,అక్టోబరు 16,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు స్కామ్‌లో నిందితులకు ఈనెల 24 వరకు రిమాండ్ పొడిగిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులకు నేటితో రిమాండ్ గడువు ముగియనుండటంతో నిందితులను కోర్టులో హాజరుపరిచింది. విచారణ జరిపిన న్యాయస్థానం నిందితులకు రిమాండ్ పొడిగించింది. ఈ కేసులో మొత్తం ఇప్పటివరకూ 12 మంది అరెస్ట్ కాగా ఐదుగురు బెయిల్‌పై విడుదలయ్యారు. ఏడుగురు నిందితులు విజయవాడ, గుంటూరు జిల్లా జైళ్లలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ పొందిన నలుగురు నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, దిలీప్ కోర్టుకు హాజరుకాలేదు. వీరికి సంబంధించి వారి తరఫు న్యాయవాదులు ఆబ్‌సెంట్ పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కుంభకోణం రిమాండ్ ఖైదీలను కోర్టుకు తరలించారు. మద్యం కుంభకోణం కేసులో రాజ్ కేసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, బూనేటి చాణక్య,

సజ్జల శ్రీధర్ రెడ్డిలు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. జ్యుడీషియల్ రిమాండ్ గడువు నేటితో ముగియడంతో విజయవాడ జిల్లా నుంచి ఐదుగురు నిందితులను కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. మరో ఇద్దరు నిందితులు నవీన్ కృష్ణ ,

బాలాజీ కుమార్ యాదవ్ గుంటూరు జైలు నుంచి అధికారులు కోర్టుకు తరలించారు.

## టిడిపి నేతలు నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా నడిపిస్తున్నారు : మాజీ మంత్రి జోగి రమేష్



**విజయవాడ,అక్టోబరు 16,పభాతవార్త ప్రతినిధి:**టిడిపి నేతల నకిలీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారని...ఆ మకిలిని తనకు అంటగట్టాలని చూస్తున్నారని మాజీ మంత్రి జోగి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం విజయవాడ లోని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఫేక్ న్యూస్‌తో రోజుకో అబద్ధం ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్దంగా ఉన్నానని వెల్లడించారు. ఇబ్రహీంపట్నంలో పట్టినంత మాత్రాన జనార్ధన్‌రావుతో తనకు సంబంధం ఉన్నట్లేనా అని ప్రశ్నించారు. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు.జనార్ధన్‌రావు వెనుక టిడిపి ఉందని ఆరోపించారు. నకిలీ మద్యం కేసు ప్రధాన నిందితుడు జనార్ధన్‌రావుతో తనకు సంబంధాలు ఉన్నట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్దమని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్ సిఎం చంద్రబాబునాయుడికి సవాల్ విసిరారు. ఈ విషయంలో చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన విసం తనకు లేదని...అయితే తీవ్ర ఆరోపణల నేపథ్యంలో లై డిటెక్టర్ పరీక్షలకు తకూడ తాను సిద్ధమని అన్నారాయన.బుధవారం తాడేపల్లి లోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...నారా వారి సారాను చంద్రబాబు ఏరులై పారిస్తున్నారు. టీడీపి నేతలు నకిలీ మద్యాన్ని కటీర పరిశ్రమలా నడిపిస్తున్నారు. టీడీపీ నేత జనార్ధన్‌రావుతో నేనను ఎలాంటి ఛాటింగ్ చేయలేదు.

## శిల్పకారులను గుర్తించక పోవటం శోచనీయం

తెనాలి టౌన్ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): రాజధాని అమరావతిలో ప్రతిష్ఠించనున్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ నమూనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలిస్తున్నట్లు, కొన్ని పత్రికల్లో వచ్చినవార్త చూసి(వార్త దినపత్రిక కాదు)తమ సంస్థ నమూనాలు తయారు చేయమని కబురు రాకపోవడం పట్ల,పట్టణానికి చెందిన ప్రముఖశిల్పి,సూర్యశిల్పాల అధినేత,కళాకారుడు కాటూరి వెంకటేశ్వరరావు ఆవేదన చెందారు.ఇటీవల నీరుకొండలో ప్రతిష్ఠించనున్న భారీ ఎన్టీఆర్ కాంస్యవిగ్రహ నమూనాలు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



పరిశీలించినట్లుకొన్ని పత్రికల్లో చూడడం జరిగిందని,ఆ నమూనాలు తయారు చేసేందుకు రమ్మని మా సంస్థకు ఏ శాఖ నుండి కబురు అందలేదని కాటూరి తెలిపారు.ఆ వార్త చూసిన తరువాత, రాష్ట్రంలో పేరు ఉన్న పలు కాంస్య విగ్రహతయారీ శిల్పకారులను సంప్రదించగా, వారికి కూడా కబురు అందలేదని చెప్పారు,శిల్పకారులకు నమూనాలు తయారు చేసేందుకు కబురు పంపించాల్సిన బాధ్యత ఏ సంస్థకు అప్పచెప్పారో గాని, శిల్పకారులకు అందరికీ చెప్పకుండా పక్షపాతంతోనో లేక స్వలాభం కోసమో ఏదో ఒకరిద్దరికి మాత్రమే విగ్రహ నమూనాలు తీసుకున్నట్లు కబురు పంపినట్లు భావించాల్సి వస్తుందని,కళాతజ్ఞ కాటూరి వెంకటేశ్వరరావు తమ ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పబోయే భారీ విగ్రహాల కొరకు నమూనాలు తయారు చేయమని రాష్ట్రంలోని శిల్పకారులందరికీ కబురు అందితే శిల్పకారులు పోటీ తత్వంతో నమూనాలు గొప్పగా తయారుచేసుకునేందుకు ప్రయత్నిస్తారని,ఏదో ఒకరు లేక ఇద్దరకు మాత్రమే కబురు అందితే శిల్పకారులకు నష్టమని వాపోయారు. ఏడు తరాలుగా శిల్పకళ రంగంలో ఉంటూ, గత 35 సంవత్సరాలుగా కాంస్య విగ్రహాలు తయారీలో ఉండి, వందలాది కాంస్య విగ్రహాలు తయారుచేసి,ఎంతోమంది ప్రముఖుల చేత సన్మానాలు, ప్రశంసలు పొంది,తెనాలిలో కాటూరి ఆర్ట్ గ్యాలరీ ని స్థాపించి,విగ్రహాలను ఇతర దేశాలకు పంపుతున్న తమ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి ప్రతిష్టించే వి.గి.శి, పొట్టి శ్రీరాములు విగ్రహ నమూనాలు తయారు చేసుకురమ్మని కబురు అందకపోవటం పట్ల స్పందిస్తూ,ఈవిషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు.దీనిపై ముఖ్యమంత్రి స్పందించి మళ్లీ శిల్పకారులు అందరికీ నమూనాలు తయారుచేసుకురమ్మంటే బాగుంటుందన్నారు.

## ఉచిత వైద్యసహాయం పొందండి: రోటరీక్లబ్

తెనాలి మున్సిపాలిటీ అక్టోబర్ 16 (ప్రభాతవార్త):ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ వారి సహకారముతో,రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం వారిచే నిర్వహించబోయే ఉచిత వైద్యశిబిరాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని రోటరీక్లబ్ అఫ్ తెనాలి వైకుంఠపురం ప్రతినిధులు తెలిపారు.గురువారం క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,అక్టోబర్19 ఆదివారం



బుర్రిపాలెంరోడ్ లోని బీసీ కాలనీ లోగల రంగస్థల కళాకారుల భవనం నందు ఉచిత వెరికోస్ వీన్స్ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని,వైద్య శిబిరానికి వెరికోస్ వీన్స్ సమస్య ఉన్న ప్రతిఒక్కరూ వచ్చి పరీక్షి ంచుకుని వెళ్ళవలెనని, ఈ వైద్య శిబిరంలో ఐదువేల రూపాయలు పరీక్షలు ఉచితంగా చేయటం జరుగుతుందని,కావున ప్రజలందరూ ఈ అవకాశం ఉపయోగించుకోవాల్సిందిగా క్లబ్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్,కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు గరికిపాటి సుబ్బారావు,రోటరీ డిస్టిక్ 3150 అమరావతి రీసన్ క్యాన్సల్ ఎవర్నెస్ చైర్మన్ కన్నెగంటి మురళీకృష్ణ, క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకట నారాయణ,పావులూరి రాంబాబు,ఈదర శ్రీనివాసరావు,జగదీశ్వరమ్మ మల్లాది అర్జున్,కళాకారుల సంఘం తరఫున చెరుకుపల్లి సింగారావు,దేవరపల్లి భవాని, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

## సమాధులకి స్థలం కేటాయించండి: నాదెండ్లకు కమిటీ సభ్యుల వినతి

తెనాలి టౌన్ అక్టోబర్ 16 (ప్రభాతవార్త): సమాధుల తోట స్థలం కోసం దశాబ్దకాలంగా పోరాటం చేస్తున్నామని,సమాధులతోట స్థల సాధన కమిటీ నిర్వాహకులు గురువారం, స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌరసఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి విజ్ఞప్తి చేశారు.పట్టణంలోని ఐతానగర్ ప్రాంత ప్రజలు దశాబ్ద కాలంగా సమాధుల తోట స్థలంలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,ఇళ్లలో



ఎవరైనా దురదృష్టవశాత్తు మరణించినా, సమాధి చేయటానికి ఒక్క అడుగు భూమి కూడా లేనిదుస్థితి నెలకొందని,ఈ అత్యవసర సమస్యపై స్థానిక ప్రజలు మరియు చర్చి పెద్దలు ఎన్నోసార్లు అధికారులను కోరినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని,ఈనేపథ్యంలో, సమాధుల తోట స్థల సాధన కమిటీ నిర్వాహకులు గత సెప్టెంబర్ 22న గ్రీవెన్స్ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కి, మున్సిపల్ కమిషనర్ కి, మరియు తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించినా, ఇంతవరకు ప్రభుత్వం స్పందించలేదని,దీనిపై కమిటీ సభ్యులు లింగరావు సెంటర్ వద్ద ఐదు రోజుల పాటు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా పదివేల పాంప్లెట్లు పంపిణీ చేసి,ప్రజలకు సమాధుల తోట అవసరతను తెలియజేయడం, అలాగే ఐతానగర్ పరిధిలోని అన్ని చర్చి సేవకులు మరియు పెద్దలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం జరిగిందని,ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు ఐదువేల మంది ప్రజల సంతకాలు సేకరించబడ్డాయని,అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ ని కమిటీ సభ్యులు కలసి వినతిపత్రం మరియు సంతకాల పుస్తకాన్ని అందజేశారు. నాదెండ్ల మాట్లాడుతూ"సమాధుల తోట స్థలం అవసరత వాస్తవమని మాకు తెలుసు. ఈ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాము" అని హామీ ఇచ్చారు.అయితే కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఇప్పటికే పది సంవత్సరాలుగా హామీలు మాత్రమే వినిపిస్తున్నాయి. ఈసారి స్థలం కేటాయింపు జరిగే వరకు మా పోరాటం ఆగదు. మా స్వరం వినిపించక తప్పదు" అని స్పష్టం చేశారు సమాధుల తోట స్థల సాధన కమిటీ సభ్యులు, స్థానిక చర్చి సేవకులు, పెద్దలు, మరియు అనేక మంది విశ్వాసులు పాల్గొన్నారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.03ఇఇ/డిడి/రేపల్లె/2025-26 తేది: 13.10.2025
పనిపేరు: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెరికలపూడి గ్రామ పరిధిలో దంతలూరు కోడు మీడియం డ్రెయిన్ పై కి.మీ. 12.100 నుండి కి.మీ 12.400 వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణం పని చేపట్టుట. పని విలువ : రూ. 36.62 లక్షలు. టెండర్ షెడ్యూల్స్ లభ్యమగు తేది: 20.10.2025, ఉ.11.00గం.ల నుండి 03.11.2025, మ.2.00గం.ల వరకు. వివరాలు : https://tender.apeprocurement.gov.in ఫోన్: 9440205468.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, డ్రైనేజీ డివిజన్, రేపల్లె.
DIPR.NO. 17785/CL/ADVT/1/1/2022-23 తేది: 16.10.2025



pnb Housing Finance Limited Ghar Ki Baat
నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 కె.జి. మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్లు: 011-23357171, 23357172, 23705414, వెబ్.: www.pnbhousing.com
బ్రాంచి కార్యాలయం : జిబి ప్రైమ్ 31-4-363, 1వ అంతస్తు, అరండల్‌పేట్, 4వ లేన్, గుంటూరు - 522002 , విజయవాడ కార్యాలయం: # 39-3-1, 2వ అంతస్తు, అంజనేయులు జ్యూయలర్స్ పైన ఎం.జి. రోడ్, విజయవాడ-520010
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్ III యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన
[illegible]

| రుణ అకౌంట్ నంబరు | రుణగ్రహీత & సహ-రుణగ్రహీత(లు) పేరు/చిరునామా | హామీదారు(లు) పేరు/చిరునామా | తనఖా పెట్టబడిన ఆస్తి(లు) | డిమాండు నోటీసు తేదీ | డిమాండు నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తం |
|---|---|---|---|---|---|
| HOU/GNTR/0721/895224 & NHL/GNTR/0721/898266 B.O.: గుంటూరు | శ్రీ బాల భాస్కర్ ప్రసాద్ పోతరాజు F/o అనిల్ కుమార్ పోతురాజు (లేట్), D.No.3 29 103A, కృష్ణ నగర్, బాలాజీ టెంపుల్ దగ్గర, 1వ లేన్, పట్టాభిపురం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006. శ్రీమతి ఉషా రాణి పోతరాజు M/o అనిల్ కుమార్ పోతురాజు (లేట్) D.No.3 29 103A, కృష్ణ నగర్, బాలాజీ టెంపుల్ దగ్గర, 1వ లేన్, పట్టాభిపురం గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006. ఇద్దరూ ఇక్కడ అందుబాటులో ఉన్నారు: ఫ్లాట్ నెం.202, రెండవ అంతస్తు, డి నం.24/1, లాల్‌పురం రోడ్, డోర్ నెం.25- 24-102 దగ్గర, లక్ష్మీ నివాసం అపార్ట్‌మెంట్, ఆర్-అగ్రహారం, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్-522001. ఇద్దరూ ఇక్కడ అందుబాటులో ఉన్నారు: ఫ్లాట్ నం.202, రెండవ అంతస్తు, డి నం. 24/1, లాల్‌పురం రోడ్, డోర్ నెం. 25-24-102 దగ్గర, లక్ష్మీ నివాసం అపార్ట్‌మెంట్, ఆర్-అగ్రహారం, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్-522001. M/s. శ్వేత ఇంజనీరింగ్ మరియు సివిల్ కన్సల్టెంట్స్ ప్రతినిధి దీని ఏకైక యజమాని శ్రీ పోతురాజు అనిల్ కుమార్ (లేట్) D.No. 3 29 103A కృష్ణ నగర్, బాలాజీ టెంపుల్ దగ్గర, 1వ లేన్, పట్టాభిపురం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522006. (దరఖాస్తుదారుగా మరియుచట్టపర వారసులుగా రుణగ్రహీత అనిల్ కుమార్ పోతురాజు (లేట్) | NA | షెడ్యూల్-A, గుంటూరు, గుంటూరు ఉప-జిల్లా, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియా, R. అగ్రహారం గ్రామం, తాలుక్ పట్టా నం.1053, పైమై నం.355, ఇ.నం.24/1, 2226.4 చ.గజాల కొలత భూమి కలిపి, దక్షిణ దిశలో, 1020 చ.గ., 282 చ.గజాల కొలత భూమిలో, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్‌చే వారికి గిఫ్ట్‌గా ఇవ్వబడినది, 738 చ.గ కొలత గల మిగిలిన భూమి, ఎవైతే మా హక్కు మరియు 25-24-102 ఇ.నం. అతి దగ్గర, "లక్ష్మీ నివాసం" పేరు గల అపార్ట్‌మెంట్ యొక్క సరిహద్దులు. తూర్పు: లాలుపురం రోడ్, దక్షిణం: బిళ్ల రామానుజులుగారి ఆస్తి, పడమర: వంగిశర్ల సదాశివరావు ఇతరులకు అమ్మిన ఆస్తి ఉత్తరం: బిళ్ల రామాంజనేయులు ఆస్తి. పైన పేర్కొన్న సరిహద్దులలో 738 చ.గ. లేదా 617.11 చ.మీ. ఏరియా. షెడ్యూల్-B, సదరు 738 చ.గ. లేదా 617.11 చ.మీ ఫ్లాట్ మరియు అవిభాజ్య అనిర్దేశిత 38 చ.గ. లేదా 31.77 చ.మీ. సదరు ఫ్లాట్‌లోని ఫ్లాట్ మరియు సదరు మొత్తం ఏరియా, ఫ్లాట్ నం.202కి సరిహద్దు. అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు పై "లక్ష్మీ నివాసం" పేరిట భవనం సదరు ఫ్లాట్‌పై నిర్మించబడింది. తూర్పు: కామన్ కారిడార్, దక్షిణం: ఫ్లాట్ నం.201, పడమర: బహిరంగం, ఉత్తరం: ఫ్లాట్ నం.203, 825 చ.అ. కొలత రెండవ అంతస్తుపై 202 నం.గల సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ (కామన్ ఏరియా కలిపి) ఈ హద్దులలో, రూఫ్, కలప, కిటికీలు, డోర్లు, గేట్లు మరియు అన్ని ఇతర సదరు ఫ్లాట్‌కు సంబంధించిన అనుబంధాలు. సదరు ఫ్లాట్ విద్యుత్ డిపాజిట్ హక్కు కలిపి, మునిసిపల్ అసెస్‌మెంట్ నం.1021194290 మరియు SC No. 111320011598 అన్ని అనుసంధాలు మరియు జాయింట్ ఈజ్‌మెంట్ హక్కులు కలిపి, మెట్లవరస, లిఫ్ట్, జనరేటర్, బోరింగ్, మోటార్, కామన్ ఏరియా, డ్రైనేజ్ వసతులు సదరు ఫ్లాట్‌కు అటాచ్ అయినవి, స్టిల్ట్ ఫ్లోర్‌పై కార్ పార్కింగ్ సౌకర్యాలు కలిపి. | 06-10-2025 | రూ. 23,64,944.09/- (రూపాయలు ఇరవై మూడు లక్షల అరవై నాలుగు వేల తొమ్మిది వందల నలభై నాలుగు మరియు తొమ్మిది పైసలు మాత్రమే) 03-10-2025 నాటికి |
| HOU/VJWD/0517/391286, B.O.: విజయవాడ | శ్రీమతి అరుణ కుమారి యాజలి D/o. శివన్నారాయణ యాజలి డి.నం.4-3-39/1, 1వ లైన్, రామన్నపేట, [illegible] | NA | షెడ్యూల్-A, డి.నం.లు 579లో ఉన్న 18360 చ.గ. (లేదా) 15351.34 చ.మీ. ఖాళీ స్థల విస్తీర్ణం, పూర్తి విస్తీర్ణం ఎక.7-60 సెంట్లు, డి.నం.578, 568/1, 567-A [illegible] | 06-10-2025 | రూ. 39,83,452.29/- [illegible] 30-09-2025 నాటికి |
| NHL/GNTR/0419/683072, B.O.: గుంటూరు | [illegible] | NA | [illegible] | 06-10-2025 | రూ.47,52,736.03/- [illegible] 03-10-2025 నాటికి |
| HOU/GNTR/1224/1337733, B.O.: గుంటూరు | [illegible] | NA | [illegible] | 06-10-2025 | రూ.85,06,568.00/- [illegible] 06-10-2025 నాటికి |
| HOU/VJWD/0718/556101, B.O.: విజయవాడ | [illegible] | NA | [illegible] | 06-10-2025 | రూ.62,77,027.42/- [illegible] 30-09-2025 నాటికి |

ప్రదేశం : గుంటూరు, తేది: 16.10.2025 సం/- అధీకృత అధికారి, (M/s PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

వార్త

కృషిపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. దానంతట అది ఏదీ మన దగ్గరకు రాదు.

-ఫ్రాంక్లిన్

# చట్టం అందరికి సమానమేనా?


'దొ రతనంబునందు దొంగతనంబునందు భాగ్యవంతునికి ఏదైనా బాధలేదు' అన్నారు పెద్దలు. ఏ సందర్భంలో ఏ అనుభవంతో ఎవరిని ఉద్దేశించి ఈ లోకోక్తి పుట్టిందో కానీ ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే వారు చెప్పింది అక్షరాలా నిజమేనని పిస్తున్నది. కానీ మన రాజ్యాంగ నిర్మాతలు ఇవేమీ దృష్టిలో పెట్టుకోకుండా కుల, మత,వర్గ,లింగ బేధాలు లేకుండా అందరికి సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. అవి నిష్పక్షపాతంగా అమలు చేస్తారని భావించారు. కానీ దురదృష్టవశాత్తు అమలు చేయాల్సి న కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో లేక దక్షిణ ప్రలోభంలో పడి చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారు. ఫలితంగా వందలాది కరుడుగట్టిన నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోగలుగుతున్నారు. అన్నింటికంటే మించి ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వైట్‌కాలర్ నేరస్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బయటపడగలుగుతున్నారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసి పటిష్టమైన రికార్డులు తయారు చేసి అవసరమైన సాక్ష్యాలను సేకరించి న్యాయస్థానాల ముందు నిలబెట్టి రుజువు చేయడంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. కొన్నిసార్లు పరిస్థితుల ప్రభావం వల్ల దర్యాప్తు సక్రమంగా జరగకపోతే మరికొన్ని సందర్భాల్లో ఆశ్చర్యకరంగా అధికారులే స్వయంగా కేసులు వీగిపోయే విధంగా రికార్డులు తయారు చేస్తున్నారు. అందుకు వారికి ఉన్న కారణాలు వారికి ఉన్నాయి. ఇంకొన్ని సందర్భాల్లో అధికారులుసకల అవస్థలు పడి కోర్టుల ముందు రుజువులు సర్వం సిద్ధం చేసినప్పుడు కొందరు పాలకులే ఏకంగా కేసులకు మోకాలొడ్డుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సమర్థవంతంగా దర్యాప్తులు చేసే అధికారుల్లో నిస్పృహ నిరాశా పెంచుతున్నారు. దీనికితోడు ఏనాడో తయారు చేసిన చట్టాలు నిబంధనల్లో ఉన్న లొసుగులను నేరస్తులు ఉపయోగించుకోగలుగుతున్నారు. అందుకే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఆనాటి బ్రిటిష్ ప్రభువులు తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలను కాలాగుణంగా సవరించాలనే పోలీసుల వాదన కూడా సమంజసమే. ఇటీవల మూడు చట్టాలను కూడా కేంద్రప్రభుత్వం సవరించింది. అయితే ఉన్న నిబంధనలను, చట్టాలను ఏమేరకు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నారనేదే ప్రశ్న. ధనిక, పేదతేడా లేకుండా ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ముఖ్యం. ఏ అండా లేని నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సి న అవసరం లేదు. కిందిస్థాయి పోలీసు ఉద్యోగుల్లో ప్రవర్తనలో మార్పులు తీసుకువచ్చేందుకు గత రెండు, మూడు దశాబ్దాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంతమేరకు ఫలితాలు కన్పిస్తున్నా ఆశించిన స్థాయిలో ఇవి జరగడంలేదనే చెప్పొచ్చు. ఇందుకు కిందిస్థాయి అధికారులను నియమించేకంటే ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల్లో కొందరు రాజకీయ నాయకులు ఒత్తిడికి తలొగ్గడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయనే ఆరోపణలను తోసిపుచ్చలేం. ప్రధానంగా పోలీసుల్లో కొందరు ఉన్నతాధికారులు రాజకీయనేతలతో మమేకం కావడం వల్లనే కిందిస్థాయి ఉద్యోగులు పెదవి విప్పలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా కానీ, తెలుగురాష్ట్రాల్లో కానీ ఈ బోగస్ ఫైనాన్స్ కంపెనీలు పెట్టి కోట్లాదిమంది అమాయకుల కష్టార్జితాన్ని కోట్లల్లో కొల్లగొట్టి బోర్డులు తిప్పేస్తే జీవితకాలంపాటు సంపాదించుకున్న డబ్బుపోగొట్టుకొని న్యాయం చేసేవారు లేక బాధితుల వేదనఅరణ్యరోదనగా మారుతున్నది. కొందరు బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. ఇలా మోసపోయిన వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. తెలుగురాష్ట్రాల్లో గత దశాబ్దంలో పరిశీలిస్తే అధికారికంగా, అనధి కారికంగా లెక్కలు చూసినా దాదాపు ఇరవై వేలకోట్లకుపైగా బోగస్ ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజలను మోసం చేసి దోచుకున్నట్లు అంచనా. ఇందులో కొన్నింటిలో రికవరీ ఏదో కొద్దిశాతం ఉన్నా ఇలా నిలువునా ప్రజలను మోసం చేసిన దగాకోర్లపై నిర్దిష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మరొకపక్క మోసపోయిన వారు బాధితుల సంఘాలంటూ ఏర్పడినిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, తదితర ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంకొకపక్క ఏదోరకంగా డబ్బుసంపాదించగలిగితే తమనుఎవరు ఏమీ చేయలేరనే భావన మోసగాళ్లల్లో పెరిగిపోతున్నది. ఈ విషయంలో కొందరు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లితే న్యాయం సంగతి ఎలాఉన్నా అసలుకేసులు నమోదు చేసుకోవడానికి అధికారులు ఇష్టపడడంలేదు. మమ్మల్ని అడిగి ఇచ్చారా? ఇచ్చేటప్పుడు తెలివిలేదా? లాభం వస్తే మా వద్దకు వచ్చేవారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించి మళ్లీ పోలీసు స్టేషన్‌కు రాకుండా చేసి పంపుతున్నారు. అంతేకాదు ఇది సివిల్ తగాదా అని జోక్యం చేసుకోవడానికి వీలులేదని, న్యాయస్థానాలకు వెళ్లి వసూలు చేసుకోమని సలహాలు ఇస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఫిర్యాదులన్నీ నమోదు చేస్తే పోలీసులు వేరే పనిచేయలేరనే వాదనను తోసిపుచ్చలేం. పెరిగిన నేరాలతో పాటు పోలీసులకు బాధ్యత కూడా విపరీతంగా పెరిగిపోయిందనడంలో సందేహంలేదు. అయితే ఇలాంటిమోసాలు పెద్దఎత్తున జరగడం ప్రభుత్వ ప్రతిష్టను, పోలీసువ్యవస్థపై ప్రజలకు ఉన్న గౌరవాలను తగ్గిస్తున్నది. పాలకుల పట్ల వ్యతిరేకతను ఏర్పరుస్తున్నది. పాలకులు ఆ కోణంలో ఆలోచించాలి. ఈ దగా, భారీ మోసాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్దకం మెదడును నిస్తేజం చేస్తుంది.



దావిన్సి

విద్య లేకుండా ఊహలున్నవాడు, కాళ్లు లేకుండా రెక్కలున్న పక్షితో సమానం.



మహాత్మా గాంధీ

# సామాన్యులకు అధికార ఫలాలు దక్కేదెన్నడు?

**సమాజంలో కీలకంగా సేవలందించే నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), రజక, మహేంద్ర (మేదర) వంటి వందకుపైగా బీసీ కులా లకు చెందిన వారు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటి వరకు చట్టసభలలో ప్రవేశించలేకపోయారు. కనీసం వీరికి నామినేటెడ్ పదవులలో కూడా వీరికి తగిన స్థానం లభించడం లేదు. కీలకమైన నామినేటెడ్ పోస్టుల పంపిణీ కూడా ఏ కులానికి చెందినవారు అధికారంలో వుంటే ఆ కులానికి చెందినవారికే దక్కుతున్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ రాష్ట్రంలోని కనకదుర్గ గుడి, శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రధాన దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి దక్కాయి. కాకపోతే భార్యకు భోజనం పెట్టి సమాజాసేవ చేస్తున్నా మని చెప్పిన చందంగా ఇతర కులాలవారికి వంద రూపా యలు నిధులు కూడా లేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు చెందిన వారిని ఆయా కార్పొరేషన్లకు అధ్యక్షులను, డైరక్టర్లను నియమిస్తున్నారు.**



అన్నవరపు బ్రహ్మయ్య

ప్రా చీన కాలం సంగతి ఎలా ఉన్నా స్వాతంత్ర్యం వచ్చిన 76 ఏళ్ల తర్వాత కూడా కులాలపై మాట్లాడవలసిరావడం బాధాకరం. 5జి నుంచి 6జికి పరుగులు పెడుతున్న రోజులలో మనుషులు ఏ మాత్రం శాస్త్రీయతలేని కులం కౌగిలి నుంచి బయటకు రాలేకపోవడడానికి కారణం ఏమిటో ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఎదుటి మనిషికే చెప్పేటందుకు నీతులు వున్నాయి అని ఒక సినిమా కవి అన్నట్టుగా ప్రస్తుతం ఎవరివారు కులం పోవాలని చెప్తున్నారు, కానీ తాము ఆచరించటం లేదు. అందుకు ఊదాహరణ ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అనంతపురం శాసన సభ్యులు, సినీనటుడు బాలకృష్ణ చేసిన ప్రసంగం నేపథ్యంలో ప్రధానంగా సోషల్ మీడియా వేదికగా మూడు కులాల మధ్య జరుగుతున్న కుమ్ములాట. రాష్ట్రంలో కులాలంటే ఆ మూడు(రెడ్డి, కమ్మ, కాపు) కులాలే కులాలని, ఇతర కులాలేవి లేనట్టుగా, ఏ రాజకీయం చేయాలన్న తాముమాత్రమే చేయగలమనే అధిపత్య ధోరణి వారిలో కనిపిస్తోంది. సినీ నటుడు, శాసన సభ్యుడు బాలకృష్ణ అసెంబ్లీలో మెగాస్టార్ చిరంజీవిని అవమాన పర్చారంటూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ సోషల్ మీడియానే కాకుండా కాపు సామాజికవర్గానికి చెందిన నేతలు, కొంత మంది జనసేన పార్టీ కార్యకర్తలు తీవ్రంగా స్పందించారు. వాస్తవానికి కమ్మ, కాపు, సామాజికవర్గాల మధ్య రాజకీయంగా పోటీతత్వం ఎన్నోఏళ్లుగా కొనసాగుతోంది. అయినప్పటికీ గత ఎన్నికల్లో అనుకోని రీతిలో చంద్రబాబు, పవన్ కళ్యాన్ మధ్య బంధం ఏర్పడం, పవన్ కళ్యాన్ మధ్యవర్తిత్వంతో తెలుగుదేశంపార్టీ, బిజెపిల మధ్య పొత్తు కుదిరింది. పర్యావసానంగా తెలుగుదేశం, జనసేన, బిజెపిల మధ్య పొత్తుకుదిరి కూటమిగా ఏర్పడం వల్ల తిరుగులేని మెజారిటీని సాధించారన్నది వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నేతల భావన. ఈ నేపథ్యంలోనే పొత్తును దెబ్బతీయడానికి ఆ పార్టీ నేతలు ఏ చిన్న అవకాశాన్ని కూడా వదిలి పెట్టడంలేదు. అయితే రాజకీయంగా తలపండిన తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, బాలకృష్ణ కారణంగా తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల మధ్య బాలెన్స్ దెబ్బతినకుండా వుండేందుకు కృషిచేస్తున్నారు. ఆ కృషిలో భాగంగానే ఇటీవల చంద్రబాబు జనసేన నేత పవన్ కళ్యాన్ ఇంటికి వెళ్లారని అర్థం అవుతోంది. అయితే ఈ సందర్భంగా జనసేన నేత పవన్ కళ్యాన్ పరిణితితో వ్యవహారించారని చెప్పవచ్చు. ప్రతి రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కులం కూడు పెట్టదని, కుల నిర్మూలన జరగాలని అంటారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలైతే అధికారంలోకి రావాలంటే కేవలం ఒక కులంవారు ఓటు వేస్తే చాలదని, మిగిలిన కులాలకు చెందినవారు ఓట్ల మీదనే ఆధారపడాలని సన్నాయి నొక్కులు నొక్కుతారు. వాస్తవంలో కూడా రాష్ట్రంలో ఈ మూడు కులాల సంఖ్య నామమాత్రమే. గత ప్రభుత్వంలో అనధికారికంగా నిర్వహించిన సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్ మొత్తం జనాభాలో రెడ్డి సామాజిక వర్గం 5శాతం కానీ, వారికి దక్కిన శాసన సభస్థానాలు 32. కమ్మ సామాజిక వర్గం 3.5 శాతం, కానీ వారికి దక్కిన శాసనసభ స్థానాలు 35. కాపుల సామాజికవర్గం 10శాతం, కానీ వారికి దక్కిన శాసన సభస్థానాలు 18. బీసీ సామాజిక వర్గాల జనాభా 45శాతం, కానీ వారికి దక్కిన సీట్లు కేవలం 40 స్థానాలు, అసెంబ్లీలోని మొత్తం175 స్థానాలలో జనాభా నిష్పత్తి ప్రకారం 5 శాతం వున్న రెడ్డి సామాజికవర్గానికి 8స్థానాలు మాత్రమే దక్కాలి, కానీ 35మంది శాసన సభ్యులు వున్నా



రు. మొత్తం జనాభాలో 3శాతం వున్న కమ్మ సామాజిక వర్గానికి 5 స్థానాలు మాత్రమే దక్కాలి, కానీ 32 మంది శాసన సభ్యులు వున్నారు. ఇదే సమయంలో మొత్తం జనాభాలో45శాతం వున్న బీసీ సామాజిక వర్గాలకు 80 స్థానాలు దక్కాలి, కానీ కేవలం 40 మంది శాసన సభ్యులు మాత్రమే వున్నారు. సమాజంలో కీలకంగా సేవలందించే నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), రజక, మహేంద్ర (మేదర) వంటి వందకుపైగా బీసీ కులాలకు చెందిన వారు స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా నేటి వరకు చట్టసభలలో ప్రవేశించలేకపోయారు. కనీసం వీరికి నామినేటెడ్ పదవులలో కూడా వీరికి తగిన స్థానం లభించడం లేదు. కీలకమైన నామినేటెడ్ పోస్టుల పంపిణీ కూడా ఏ కులానికి చెందినవారు అధికారంలో వుంటే ఆ కులానికి చెందినవారికే దక్కుతున్నాయి. అందుకు ఒక చిన్న ఉదాహరణ రాష్ట్రంలోని కనకదుర్గ గుడి, శ్రీశైలం, కాణిపాకం, అన్నవరం వంటి ప్రధాన దేవాలయాల ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవులన్నీ ఒకే సామాజికవర్గానికి దక్కాయి. కాకపోతే భార్యకు భోజనం పెట్టి సమాజాసేవ చేస్తున్నామని చెప్పిన చందంగా ఇతర కులాలవారికి వంద రూపాయలు నిధులు కూడా లేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆయా కులాలకు చెందిన వారిని ఆయా కార్పొరేషన్లకు అధ్యక్షులను, డైరక్టర్లను నియమిస్తున్నారు. కొంతమంది ఈ మూడు కులాలవారి గురించి మాట్లాడే సమయంలో పాలక వర్గాలని, అధిపత్య కులాలని ప్రస్తావిస్తారు. అసలు పాలక లేదా ఆధిపత్య కులాలుగా మారడానికి అర్హత ఏమిటి? నిజానికి ఈ మూడు కులాలకంటే ముందు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన రాజాజీ, ప్రకాశం పంతులు, బూర్గుల రామకృష్ణయ్య పంతులు, పి.వి. నరసింహారావు వంటి వారు ముఖ్యమంత్రులుగా పనిచేసినా వారు పాలక వర్గంగా చెలామణి కాలేదు. బ్రాహ్మణ ముఖ్యమంత్రులకు, ఈ మూడు కులాల నాయకులకు మధ్య వున్న తేడాడబ్బు. దీనిని బట్టి పాలక లేదా అధిపత్య కులాలుగా మారడానికి డబ్బే ప్రధాన అర్హత అనిపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, నాయకుల సామర్థ్యాన్ని బట్టి రాజకీయాలు నడిచేవి. కానీ ప్రస్తుతం డబ్బు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఎంఎల్ఎ టిక్కెట్ కావాలంటే ఎన్నికోట్లు ఖర్చుపెట్టగలవు? పార్టీకి ఎన్నికోట్లు చందా ఇవ్వగలవు అని ప్రశ్నిస్తున్నారు. ఈ కారణంగానే రాజకీయాలు, ఎన్నికలు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారాయి అని చెప్పడం కంటే మార్చారు అని చెప్పాల్సి వుంటుంది. శాసన సభ్యునిగా లేదా పార్లమెంటు సభ్యునిగా సామాన్యులెవ్వరూ పోటీచేసే అవకాశం లేకుండా పోయింది. ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టిన ఖర్చుకు కొన్ని వందల రెట్లు అదనంగా సంపాదించడమే రాజకీయాలకు అర్హతగా మారింది. గతంలో తహశీల్దారు, సబ్ కలెక్టరు/ఆర్డిఒ కార్యాలయాలు అర్జిదారులతో కిటకిటలాడేవి. కానీ ప్రస్తుతం శాసన సభ్యుల, పార్లమెంటు సభ్యుల కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. గతంలో కంట్రాక్టు పనులు, వ్యాపారాలు, పరిశ్రమలకు లైసెన్సులు పొందం వంటి సమయాలలో మాత్రమే శాసన సభ్యుల ప్రమేయం వుండేది. కానీ ప్రస్తుతం ఇంటి ప్లాన్ ఆమోదం నుంచి రోడ్డు పక్కన బడ్డీ షాపు పెట్టుకోవడం వంటి చిన్నచిన్న వ్యవహారాలకు కూడా శాసన సభ్యుల అనుమతి కావాల్సి వస్తోంది. ఇక నియోజకవర్గంలో ఏ ఉద్యోగి అయినా, అధికారి అయినా పనిచేయాలన్నా, బదిలీ కావాలన్నా శాసన సభ్యుని అనుమతి కావాల్సిందే. చివరికి ఉన్నతాధికారులు కూడా తమ కింద ఉద్యోగులను బదిలీ చేయడానికి స్థానిక శాసన సభ్యుల లేఖలు జతచేయాలని కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో ఏదైన నిర్ణయం చేయాలంటే ముఖ్యమంత్రి కనీసం కేబినెట్ సమావేశంలో ఏర్పాటు చేయాల్సి వుంటుంది. శాసన సభ్యులకు తన నియోజకవర్గంలో ఎవరి అనుమతి అవసరం లేదు. తాను అనుకుంటే ఏదైన చేయగలడు. ఈ మూడు సామాజిక వర్గాల నేతలు అధికారం కోసం పరస్పరం విమర్శలు చేసుకొంటూనే మరోవైపు వైవాహిక సంబంధాలను కలుపుకుంటున్నారు. అధికార రాజకీయాలకోసం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్న నాయకుల ఆధిపత్య ధోరణిని ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు గమనిస్తున్నారు. ఉందిలే మంచి కాలం ముందు ముందునా..అందరూ సుఖపడాలి నంద నందనా అనిమహాకవి శ్రీశ్రీఅన్నట్టుగా ప్రజాచైతన్యంతో భవిష్యత్తులోఅందరికి అధికార ఫలాలు అందేరోజులు వస్తాయని ఆశిద్దాం. ●

# ప్రజలకు ప్రాణసంకటంగా మారిన కల్తీ మద్యం!

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈ మధ్యకాలంలో రాష్ట్రవ్యాప్తంగా కూడా విచ్చలవిడిగా కల్తీ మద్యం ఏరులై పారుతూ ప్రజలప్రాణాలతో ఆటలాడుకుంటున్న విషయం మనందరికీ విధితమే. కేవలం స్పిరిట్, రసాయనాలతో తయారుచేసి, పాపులర్ బ్రాండ్‌లను తలపించేలా బాటిళ్లపై నకిలీలేబుల్స్ అతికించి మరీ యధేచ్ఛగా సరఫరా చేస్తూ కల్తీమద్యం తయారీదారులు ఈ మందు ప్రియులను బురిడీ కొట్టిస్తూ తమ వ్యాపారాన్ని మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లేటట్లు చేసుకుంటున్నారు అనే మాట అక్షర సత్యం. అయితే ఇది కల్తీ మద్యం అని తెలియని అమాయక ప్రజలు వీటిని సేవించి తమ ఆరోగ్యాన్ని చేజేతులారా పాడుచేసుకుంటున్నారు. ముఖ్యంగా కల్తీ మద్యం సేవనం మూలాన వీటిని తీసుకున్న ప్రజలకు అవయవ వైకల్యం ప్రాప్తించడం, వారికి వినికిడి సమస్యలు తలేత్తడం, దృష్టిలోపం ఏర్పడటం, వారి మూత్రపిండాలు దారుణంగా దెబ్బతిని, చివరకు వారి కాలేయాలు సైతం వైఫల్యానికి గురిఅయ్యి, వారి ప్రాణాలకే ముప్పు ఏర్పడే దయనీయ పరిస్థితులు సైతం వారికి సంప్రాప్తించడం ఎంతైనా ఈసమాజానికి సంబంధించి అత్యంత ఆందోళన రేకేత్తించే విషయం. అయితే ఇంత జరుగుతున్న ఎందుకనో రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ కల్తీమద్యం తయారీకి అడ్డుకట్ట వేయడంలో మాత్రం ఘోర వైఫల్యం చెందుతూనే వున్నారు. అంతేకాదు ఈకల్తీ మద్యం కేసు నిగ్గు తెల్చేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ కేసును సి.బి.ఐ వారికి అప్పగించాలని కూడా వైస్సార్సీపీ గట్టిగా డిమాండ్ చేశారు. ఏదిఏమైనా ఈ కల్తీ మద్యంలో మీథాయిల్, సీసం, ఇతర విష రసాయనాలు కలవడం మూలాన వీటిని సేవించిన మద్యం ప్రియులు తీవ్ర అనారోగ్యాల బారినపడి ఇటు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు, అటు వారి కుటుంబాలను సైతం వారు ఈ మద్యం వ్యసనం మూలాన అధోగతిపాలు చేయడంతో పాటు వారిని రోడ్డు మీద పడేలాచేస్తున్నారు అనేమాట అక్షర సత్యం. ఇక మన రాష్ట్ర ప్రభుత్వం వారైతే 'ఆదాయమే ఏకైక పరమావదిగా భావిస్తూ ప్రజలు ఏమైపోతే మాకేంటి' అనే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం మూలాన మందు ప్రియుల జీవితాలు రోజురోజుకు నరకప్రాయంగా మారిపోతున్నాయి అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. ఏమైనా మన ప్రజలు ఇప్పటికయినా విచక్షణ జ్ఞానంతో వ్యవహరించి 'ఈ కల్తీ మద్యం వద్దు, తమకు తమప్రాణాలే ముద్దు' అనే నీతి నానుడికి పెద్దపీట వేసి, అంతిమంగా తమ కుటుంబాల బాగోగులు, శ్రేయస్సే తమకు ప్రధానమని తక్షణమే భావించి వారి ఆరోగ్యాలను సర్వనాశనం చేసే, గుల్ల గావించే ఈ మద్యం అనే పాడు, చెడు అలవాటుకు వీలైనంత త్వరగా గుడ్ బై చెప్పగలిగితే వారంతా ఎలాంటి ఇబ్బందుల పాలు కాకుండా వారు, వారిని నమ్ముకున్న వారి కుటుంబాలుసైతం అత్యంత సుఖ, సంతోషాలతో నిండు నూరేళ్ల జీవించగలుగుతారు అనడంలో ఎలాంటి సందేహంలేదు. కాబట్టి ఒక్కసారి ఆలోచించుకోండి మీకు మీ ఆరోగ్యం, మీ కుటుంబ బాగుదల ముఖ్యమా ఈ మద్యం అనే దురలవాటు ముఖ్యమా? ఇక నిర్ణయం తీసుకోవడం మీ వంతు. అంటే మీరు మద్యం అనే చెడుఅలవాటుకు మంగళం పాడిమంచి మార్గంలో వెళ్లడమా లేకచెడుమార్గంలో పయనింపచేసుకోవడమా? అన్నింటికి తుది నిర్ణయంమాత్రం ముమ్మాటికీ మీదే. ●

# పేదరిక నిర్మూలనకు ఏవీ చర్యలు?

డి. జయరాం

దా రిద్రం అనేది కేవలం తగినంత డబ్బు లేకపోవడాన్ని సూచించదు. ఇది ఆరోగ్య సంరక్షణ, విద్య, శుభ్రమైన నీరు, నిర్ణయాత్మక స్వేచ్ఛ వంటి ప్రాథమిక మానవ హక్కులు, అవకాశాలకు దూరంగా ఉండటాన్ని సూచిస్తుంది. ఆర్థికవేత్త అమర్త్యసేన్ అభిప్రాయం ప్రకారం పేదరికం అనేది 'సామర్థ్యాల కొరత'. ఇది సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలు తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకోకుండా నిరోధించే ఒక సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక రుగ్మత. దారిద్ర్యాన్ని స్థూలంగా నిరపేక్ష పేదరికం అంటే కనీస జీవనాధార అవసరాలు తీరనిస్థితి. సాపేక్ష పేదరికం అంటే సమాజం లోని సగటు స్థాయికంటే తక్కువ ఆదాయంగా వర్గీకరించవచ్చు. నేడు, ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు వంటి అంశాలను కొలిచే బహుముఖ పేదరిక సూచిక ద్వారా సమస్య లోతును సమగ్రంగా అంచనా వేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేదరిక నిర్మూలనకు కృషి జరుగుతున్నప్పటికీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 2030నాటికి అత్యంత పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యం కోవిడ్19మహమ్మారి, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల కారణంగా సవాలుగా మారింది. ప్రపంచబ్యాంకు దారిద్యరేఖను రోజుకు 2.15 డాలర్ల కొనుగోలు శక్తికంటే తక్కువ ఆదాయంగా నిర్ణయించింది. ప్రపంచ నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 110 కోట్లకు పైగా ప్రజలు నేటికీ ఆరోగ్య, విద్య, జీవన ప్రమాణాలకు సంబంధించిన బహుముఖ లోపాలను ఎదుర్కొంటున్నారు. మన దేశం గత దశాబ్దంలో పేదరిక నిర్మూలనలో అద్భుతమైన పురోగతిని సాధించింది. ప్రపంచ బ్యాంకు అంచనాల విశ్లేషణ ప్రకారం, 2011-12 నుండి 2022-23 మధ్య కాలంలో మనదేశంలో అత్యంత పేదరికం 27.1 శాతం నుండి 5.3 శాతానికి గణనీయంగా తగ్గింది. ఈ చారిత్రక కాలంలో సుమారు 27కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పేదరికం తగ్గడం ప్రభుత్వ మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల ప్రభావవంతమైన అమలును సూచిస్తుంది. నీతిఆయోగ్ జాతీయ బహుమితీయ పేదరిక సూచిక నివేదిక కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ విద్యుత్, వంట ఇంధనం, పారిశుధ్యం, గృహ వసతి వంటి అంశాలలో మెరుగుదల కారణంగా కోట్లాది మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని స్పష్టం చేసింది. పేదరికం అనేది అనేక వ్యవస్థాపరమైన అంశాల కలయిక. దారిద్ర్యానికి ప్రధాన కారణాలలో ఒకటి సంపద, ఆదాయ అసమాన పంపిణీ. ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ, దాని ఫలాలు సమాజంలోని సంపన్న వర్గాలకు మాత్రమే చేరడం వలన అసమానతలు పెరుగుతున్నాయి. ఈ అసమానతలు నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరతతో మరింత తీవ్రమవుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై అధికంగా



ఆధారపడటం, పట్టణాల్లో అసంఘటిత రంగంలో తక్కువ వేతనాలు, సామాజిక భద్రత లేని ఉద్యోగాలు పేదరిక వలయాన్ని కొనసాగిస్తున్నాయి. అంతేకాకుండా నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ లేకపోవడం దారిద్ర్యానికి వ్యవస్థాపరమైన మూలాలుగా నిలుస్తాయి. నిరక్షరాస్యత, అసంపూర్ణ విద్య వలన శ్రామికులు అధిక వేతన ఉద్యోగాలు పొందలేరు. అదే సమయంలో, పేద కుటుంబాలు అనారోగ్యం పాలైనప్పుడు, చికిత్సకోసం అధికంగా అప్పు చేయవలసి వస్తుంది. ఇది వారిని మరింత అప్పుఊబిలోకి నెట్టివేస్తుంది. వీటితోపాటు, అధిక జనాభా పెరుగుదల, సామాజిక, లింగ వివక్ష, ప్రభుత్వసంక్షేమ పథకాల అమలులో అవినీతి, లీకేజీలు కూడా పేదరికాన్ని సుస్థిరంచేస్తాయి. పేదరిక నిర్మూలన ప్రక్రియలో అనేక నిర్మాణాత్మక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది 'పేదరిక వలయం'ను ఛేదించడం. ఈ వలయంలో, తక్కువ ఆదాయం, పేలవమైన ఆరోగ్యం, తక్కువ విద్య తరాల నుండి కొనసాగుతూ, కుటుంబం ఎప్పటికీ మెరుగుపడకుండా నిరోధించబడతాయి. రెండవ ప్రధాన సవాలు వాతావరణ మార్పుల ప్రభావం. అకాల వర్షాలు, కరువులు వంటి ప్రకృతి వైపరీత్యాలు వ్యవసాయాధారిత పేదవారి జీవనోపాధిని నాశనం చేసి, వారిని తిరిగి అత్యంత పేదరికంలోకి నెట్టేస్తాయి. మూడవది, సాంకేతిక పరిజ్ఞాన వేగవంతమైన మార్పు వలన నైపుణ్యం లేని శ్రామికులు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరచుకోలేని పేదలు పోటీ ప్రపంచంలో వెనుకబడిపోతారు. నాలుగవ సవాలు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పెరుగుతున్న వలసలు కారణంగా పట్టణ మురికివాడల్లో పేదరికం, వనరుల కొరత కేంద్రీకృతం కావడం. ఈ సవాళ్లు పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన ఏకపక్ష విధానాల అమలును సంక్లిష్టం చేస్తాయి. మొదటిగా ప్రతి పౌరుడికి నాణ్యమైన సార్వత్రిక విద్యఆరోగ్యం అందించడం అత్యవసరం. ఎందుకంటే ఇవి పేదరిక వలయాన్ని ఛేదించే అంశాలలో ప్రధానమైనది. రెండవది వ్యవసాయేతర రంగాలలో, ముఖ్యంగా తయారీ, సేవారంగంలో ఉత్పాదక స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మద్దతుఇవ్వడం ద్వారా ఉద్యోగాలుసృష్టించవచ్చు. ఈలక్ష్యాల కోసం కేంద్రప్రభుత్వం అనేక విధానాలను అమలు చేస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పేదలకు కనీసవేతన ఉపాధి హక్కును కల్పిస్తుంది. దీన్ దయాళ్ అంత్యోదయ యోజన స్వయం సహాయక బృందాలద్వారా ఆర్థికసహాయం అందించి గ్రామీణ పేదలకు స్థిరమైన జీవనోపాధిని సృష్టిస్తుంది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ద్వారా ఆర్థికచేరికను సాధించి, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా పథకాల ప్రయోజనాలను లీకేజీలు లేకుండా నేరుగా బదిలీ చేయడం జరుగుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ఉజ్వలయోజన వంటి పథకాలు గృహవసతి, శుభ్రమైన ఇంధనాన్ని అందించి బహుముఖ పేదరికాన్ని తగ్గించడంలో ముఖ్యపాత్ర వహిస్తు న్నాయి. పేదరికం అనేది కేవలం ఒక ఆర్థికసూచిక మాత్రమేకాదు. అన్యాయం, అసమానతలకు అద్దంపట్టే మానవీయ సంక్షోభం. భారతదేశం ఇటీవల సాధించిన పేదరిక తగ్గింపు విజయాలు, లక్షిత విధానాలు, సాంకేతికత ఆధారిత పాలన శక్తిని స్పష్టంగా నిరూపిస్తున్నాయి. ఈపురోగతిని నిలకడగా కొనసాగించడం, మిగిలిన పేదరికాన్ని నిర్మూలించడం, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ అసమానతలను తగ్గించడం ద్వారానే మనదేశం నిజమైన ఆర్థికసామాజిక న్యాయాన్ని సాధించి, అభివృద్ధి చెందిన దేశంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలుగుతుంది. ●

# ప్రజావాక్కు



## వెండి ధర బంగారాన్ని మించిపోనుందా!

ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం వెండి ధరలు వినియోగదారులనువ్యాపారులను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో కిలో వెండి ధర సుమారు లక్ష రూపాయలు వుండగా, రాబోయే దీపావళి సమయానికి ఏకంగా 2,0,6000 రూపాయల మార్కును చేరుకుంది. అంటే కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే వెండి విలువ దాదాపు90శాతంపెరిగింది. సామాన్యప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు, బంగారం తర్వాత తమ సంపదను కాపాడుకోవడానికి, పెంచుకోవడానికిఎంచుకోవాల్సి న ఉత్తమ మార్గాలలో వెండికూడా ఒకటిగా ఇప్పుడు నిరూపితమవుతోంది. పెద్దపెద్ద సంస్థలుభవిష్యత్ అవసరాల కోసం పెద్దమొత్తంలో వెండినికొనుగోలు చేసినిల్వ చేసుకుంటున్నాయి. ఈ కారణాల వల్ల, వాస్తవ సరఫరా తగ్గి, ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లు కథనాలు వస్తున్నాయి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## చెత్త చెదారంతో కొత్తగూడెం పట్టణం

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం అయిన కొత్త గూడెం జిల్లా దుమ్ము ధూళితో అపరిశుభ్రంగా ఉంది. బస్‌స్టాండ్ చుట్టూ ప్రధాన వీధుల గుండా ప్లాస్టిక్ కవర్స్ దుమ్ముతో నిండి వుండి అపరిశుభ్రంగా వుంది. నిత్యం కొత్త గూడెంకి ఎంతోమంది వివిధపనుల నిమిత్తం వస్తుంటారు బొగ్గుగనులు వుండడం చుట్టూ పక్కన వున్న ఇల్లందు భద్రాచలం ఖమ్మంల నుండి జన సంచారం వుండడం వల్ల కొత్తగూడెం వ్యాపార కేంద్రంగా వుంది. కొత్త వారు వివిధ పనుల నిమిత్తం వస్తే రోడ్స్ మీద ఉన్న చెత్త చెదారంతో ఇబ్బంది పడుతూ వున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కొత్త గూడెం పట్టణానికి క్లీన్ సిటీగా మార్చాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## బాధ్యత విస్మరించరాదు

తల్లిదండ్రులు మనకు జన్మనిచ్చి, పసితనంలో మనల్ని ప్రేమతో పెంచి, చదువులు నేర్పించి మన భవిష్యత్తును నిర్మించారు. మన జీవితంలో వారు మొదటి గురువులు, నిజమైన దేవుళ్లు. చిన్నప్పుడు వారు నిద్ర మానుకుని మన కోసం కష్టపడ్డారు. మన భవిష్యత్తుకోసం తమ సుఖాలను త్యాగం చేశారు. అలాంటి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని నిర్లక్ష్యం చేయడం పెద్దపాపం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## చెత్త చెదారంతో కొత్తగూడెం పట్టణం

భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రం అయిన కొత్త గూడెం జిల్లా దుమ్ము ధూళితోఅపరిశుభ్రంగాఉంది. బస్‌స్టాండ్ చుట్టూ ప్రధాన వీధుల గుండా ప్లాస్టిక్ కవర్స్‌దుమ్ముతో నిండి వుండి అపరిశుభ్రంగా వుంది. నిత్యం కొత్త గూడెంకి ఎంతో మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు బొగ్గు గనులు వుండడం చుట్టూ పక్కన వున్న ఇల్లందు భద్రాచలం ఖమ్మంల నుండి జన సంచారం వుండడం వల్ల కొత్త గూడెం వ్యాపార కేంద్రంగా వుంది. కొత్త వారు వివిధ పనుల నిమిత్తం వస్తే రోడ్స్ మీద ఉన్న చెత్త చెదారంతో ఇబ్బంది పడుతూ వున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నాయి. అన్ని విద్యార్హతలు ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వపాఠశాలల్లో ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో సైతంప్రైవేటు పాఠశాలలపట్ల ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేటుకు దీటుగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్, బెల్ట్, షూ, ఉపకారవేతనాలు, మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా ప్రైవేటు పాఠశాలల పట్ల ఆకర్షితులవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేరికలు ప్రతీ సంవత్సరం తగ్గుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగటా నికి కృషి చేయాల్సి న అవసరం ఉంది.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## ప్రజలు, స్వర్ణకారులు సతమతం

ఇటీవల కాలంలో బంగారం ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా ఆర్థికపరిస్థితులు మార్పుకు లోనవుతుండటమే దీనికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అమెరికా డాలర్ విలువ మార్పులు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల పెరుగుదల, అలాగే భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి కారణంగా బంగారంవైపుమొగ్గు చూపుతున్నారు. భారతదేశంలో బంగారం కేవలం ఆభరణంగా కాకుండా పెట్టుబడి సాధనంగా భావించబడుతుంది. పండుగలు, పెళ్లిళ్ల వంటి సందర్భాల్లో అధిక డిమాండ్ కూడా ధరలను మరింతగా పెంచుతోంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

మన వి **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎగుమతులు బాగున్నాయి...

## మిర్చి యార్డును సందర్శించిన కలెక్టర్

**గుంటూరు ఈస్ట్ క్రైమ్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** గుంటూరు మిర్చి యార్డులో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా , జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి గురువారం పర్యటించారు. మిర్చి యార్డులో కార్యకలాపాలు పరిశీలించారు. రైతు నుండి ఎగుమతిదారు వరకు జరిగే ప్రక్రియను స్వయంగా తనిఖీ చేశారు. రైతుల శ్రేయస్సుకు సహకరించి కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. బిడ్డింగ్ రూమ్ ను పరిశీలించారు.మిర్చి యార్డులో కార్యకలాపాలను మార్కెటింగ్ శాఖ



సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, యార్డు ఇన్ ఛార్జ్ సుబ్రహ్మణ్యం, వ్యాపారులు వివరించారు. మిర్చి యార్డులో రైతులు స్వయంగా విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని అన్నారు. 415 మంది ట్రేడర్లు ఉన్నారని తెలిపారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎగుమతి ధరలు ఉంటాయని వివరించారు. పంట కాలంలో




రెండు లక్షల బస్తాల వరకు సరుకు వస్తుందని, మిగిలిన కాలంలో ఏభై వేల బస్తాల వరకు వస్తాయని చెప్పారు. చైనా, థాయిలాండ్, కొలంబో, ఇండోనేసియా, మలేసియా తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు జరుగుతాయన్నారు. తేజ రకం ఎగుమతుల్లో ప్రధానమైనది పేర్కొన్నారు. 334, 341 రకం స్థానిక వినియోగానికి ఉపయోగిస్తారని తెలిపారు. గత ఏడాది దిగుబడులు ఎక్కువగా ఉండటం, నాణ్యత కొంత మేర తక్కువగా ఉండటం వలన ధరలు తక్కువగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఏ. చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్ట్

**గుంటూరు ఈస్ట్ క్రైమ్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** ప్రేమించి వివాహం చేసుకున్న 12 రోజులకే బావ బామ్మరిదిని హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పాత గుంటూరు స్టేషన్ సీఐ కే వెంకట ప్రసాద్ వెల్లడించారు. ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్న కుర్రా నాగ నరేష్ భార్య అన్న కీర్తి దుర్గారావు పొన్నూరు రోడ్ లోని ఎం కన్వెన్షన్ సమీపంలో మారణాయుధాలతో కలిసి మృతుడుపై కత్తులతో దాడి చేశారు. దింతో కుర్ర మృతి చెందడం జరిగింది. మృతుడు తండ్రి కుర్ర ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గుంటూరు పాత పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు పై ప్రత్యేక దృష్టి సారించిన పాత గుంటూరు పోలీస్ స్టేషన్ సిఐ









ఎస్పీ ఆదేశాల మేరకు, డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిలు అరెస్టులో కృషి చేసిన పాత గుంటూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## బహుళ జాతి ఔషధ సంస్థలో ఉపాధి పొందిన హిందూ ఫార్మసీ విద్యార్థులు

గుంటూరు విద్య, అక్టోబర్ 16, ప్రభాతవార్త : సా ్థనిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో ఎం.ఫార్మసీ చదివిన విద్యార్థులు బహుళజాతి ఔషద సంస్థల్లో ఉపాది పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్



ఎం.వి.నాగభూషణం తెలిపారు.వై.లక్ష్మీప్రియ ఇలి-లిల్లిలో రెగ్యులేటరి విభాగంలో రెగ్యులేటరీ అససియేట్‌గా పనిచేస్తుందన్నారు.లంకపల్లి మెర్సీ ఇవాంజిలిన్,ఫ్రాన్స్ దేశంలో రెస్యూ బయోటెక్నాలజీ సంస్థలో రెగ్యూలేటరి అసోసియేట్ ఉపాది పొందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కళశాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఛైర్మన్ జూపూడి రంగరాజు,కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు,అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

## స్కూల్‌గేమ్స్‌లో హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ విద్యార్థి ప్రతిభ

గుంటూరు విద్య, అక్టోబర్ 16, ప్రభాతవార్త : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 గుంటూరు జిల్లా వాలీబాల్ టీమ్ కి బి.లోకేష్‌రెడ్డి, సెకండ్ ఇయర్ ఎంపిసి హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ నుంచి సెలెక్ట్ అయ్యాడు.సెలెక్ట్ అయిన సందర్భంగా హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి,ప్రిన్సిపాల్ కె.బాబ్జి,పిటిఎల్‌పియు స్టేట్ ప్రెసిడెంట్ లెక్చరర్స్,స్టూడెంట్స్ అందరూ కూడా అభినందించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్ పరమైన అంశాల్లో ప్రతిభ కాకుండా వివిధ క్రీడాపరమైన అంశాల్లో కూడా ప్రగతిని సాధించే విధంగా మా అకాడమీ కృషి చేస్తుందన్నారు.విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోటీ తత్వాన్ని అలవర్చుకోవడమే కాకుండా మానసిక శారీరక దృఢత్వాని ్న కలిగి ఉంటారని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ కె.బాబ్జి మాట్లాడుతూ హర్ష మెడికల్ ఐఐటి అకాడమీ క్రీడా పరమైన అంశాల్లో విద్యార్థులకు తగిన ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.ఈ సందర్భంగా బి.లోకేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు.



# గుంటూరు వార్త

## అమరావతి భూ సమీకరణకు 40.25 ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులు

### అక్కడికక్కడే 9.3 అగ్రిమెంట్ ఫలించిన కమిషనర్ కె. కన్నబాబు చర్చలు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 16:** అమరావతి సీడ్ యాక్సిస్ రోడ్డు, కొండవీటి వాగు, ఇతర రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం ఉండవల్లిలో ల్యాండ్ పూలింగ్ కింద 12 ఎకరాల భూమి ఇచ్చిన 22మంది రైతులు. పెనుమాకలో 28.25 ఎకరాల భూమి ఇచ్చిన 14 మంది రైతులు. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధికి సహకరించిన ఇరు ప్రాంత రైతులకు కమీషనర్ కన్నబాబు అడిషనల్ కమీషనర్ భార్గవ్ తేజ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు



## 40.25 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ క్రింద రాజధాని నిర్మాణానికి ఇచ్చిన రైతులు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 16:** ప్రజారాజధాని అమరావతి అభివృద్ధి కోసం ఉండవల్లి, పెనుమాక గ్రామాలకు చెందిన 46 మంది రైతులు భూ సమీకరణ పథకం(Land Pooling Scheme) కింద స్వచ్ఛందంగా మొత్తం 40.25 ఎకరాలు భూమిని దిళిదీతి అధికారులకు అందజేశారు. రైతులు చూపిన చొరవతో రాజధాని ప్రాంతంలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, భవన నిర్మాణ పనులు వేగవంతం కావడం సులభమవుతుంది. ఉండవల్లిలో సీడ్ యాక్సెస్ రహదారి సమీపంలో భూములు కలిగిన 22 మంది రైతులు 14 ఎకరాలు భూమి, అలాగే పెనుమాకలో 14 మంది రైతులు 28.25 ఎకరాలు భూమిని 9.3 క్రింద భూసమీకరణ పథకం కింద తమ భూములను ప్రభుత్వానికి సమర్పించేందుకు అధికారులకు అంగీకార పత్రం సమర్పించారు. రైతులు అందజేసిన భూముల ద్వారా సీడ్ యాక్సెస్ రహదారి, కొండవీటి వాగు వరద నిర్వహణ పనులు, రాజధాని ప్రాంతంలో ప్రధాన రహదారి అనుసంధానం వంటి కీలక అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి.ఈ సందర్భంగా..ఏపి సిఆర్డీఏ కమిషనర్ కె. కన్నబాబు ఐఏఎస్ గారు అమరావతి నిర్మాణంలో రైతులు అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారు. అమరావతిని ప్రపంచ స్థాయి ప్రజారాజధానిగా తీర్చిదిద్దడంలో రైతులు, భూయజమానుల భాగస్వామ్యం అద్భుతమని కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కమిషనర్ ఏ. భార్గవ తేజ ఐఏఎస్ గారు ఉండవల్లి, పెనుమాక రైతులు రాజధాని నిర్మాణానికి అందిస్తున్న సహకారం, సానుకూలతకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజధాని అమరావతి రైతులకు ముఖ్యసూచన

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 16:** ప్రజారాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సిఆర్డిఏ కార్యాలయంలో రేపు శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు సిఆర్డిఏ అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ్ తేజ ఐఏఎస్ గారు తెలిపారు. రేపు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు, అమరావతి ప్రాంతవాసులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. రాజధాని రైతుల సహకారంతో అమరావతి అభివృద్ధి జరుగుతోందని, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల సమస్యలను "గ్రీవెన్స్ డే" ద్వారా దిళిదీతి అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లైతే త్వరితిరగతిన పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని, "గ్రీవెన్స్ డే" కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కమిషనర్ గారు సూచించారు.

## దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన

**గుంటూరు క్రైమ్,అక్టోబర్16,ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును తగ్గించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (లీబీతి) ఆధ్వర్యంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4ది) పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం



కల్పించడం ప్రధాన లక్ష్యంగా, అక్టోబర్ నెలను జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసంగా గుర్తించి దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, మేడికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పేరేచర్ల జంక్షన్ వద్ద ఈ



రోజు పోలీసులు సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సీఐ శ్రీ నిస్సార్ భాషా, మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసులు విద్యార్థులకు సైబర్ నేరాల ముప్పు, వాటిని నివారించే మార్గాలు గురించి వివరించారు.

## లలిత సంగీత సామ్రాజ్ఞి రావు బాలసరస్వతీదేవికి నివాళి

గుంటూరు కల్చరల్, అక్టోబర్ 16, ప్రభాతవార్త : అనేక తొలితరం సినిమాల్లో తన అద్భుతగానంతో తెలుగు సినీ,సంగీత అభిమానుల హృదయాల్లో చిరస్థానం సంపాదించుకున్న లలిత సంగీత సామ్రాజ్ఞి రావు బాల సరస్వతీ దేవి అని అవగాహన మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు నివాళులర్పించారు.అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించిన రావు బాలసరస్వతీ దేవి సంస్మరణ కార ్యక్రమంలో ప్రసిద్ధ గాయనీ యార్లగడ్డ లక్ష్మీదేవి మాట్లాడుతూ తన తేనేలూరే గళంతో,కోకిల స్వరంతో ఆణిముత్యాల్లాంటి పాటలు ఆలాపించి సంగీత ప్రియులను రంజింప చేసిన తొలి తరం గాయని రావు బాలసరస్వతీదేవి మరణం సంగీత ప్రియులకు ఆశనిపాతం అన్నారు.కళాసౌధ అధ్యక్షుడు బిళ్ళా అశోక్ మాట్లాడుతూ సరస్వతీదేవి తన నాల్గవ ఏటనే స్వస్థలం గుంటూరులోని రత్నమహల్ థియోటర్ స్టేజీమీద పాటలు పాడారని 6వ లేట హెచ్‌ఎంవి గ్రామ్ ఫోన్ రికార్డు కంపెనీ ద్వారా సోలో గా పాడి సంగీత ప్రియుల అభిమానం పొందారన్నారు.కార్యక్రమంలో గాయనీ గాయకులు రజని,పరమేశ ్వరీ,జి.సత్యన్నారాయణ,ప్రమీల లు బాల సరస్వతీదేవి పాటలు ఆలాపించి నివాళులర్పించారు.




## చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రాంతం కొండవీడు : కలెక్టర్

యడ్లపాడు, అక్టోబర్ 16, ప్రభాతవార్త : చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రాంతము కొండవీడు కోట అని, ఇది రాజధానికి సమీపంలో ఉండటంతో మంచి పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందుతుందని, గతంలో పర్యాటక పరంగా తీసుకున్న వసతులు ప్రస్తుతం తీసుకోవల్సిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండవీడు కోటను అమె గురువారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. కొండపైన ఉన్న పురాతన కట్టడాలను, ఘాట్ రోడ్డు





ప్రాంతమును వెదుళ్ల చెరువులో బోటింగ్ నిర్వహించారు. కొండవీడు నగర వనంను పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను అధికారులను అడిగి తెల్సుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ రాజధానికి సమీపంలో ఉన్న పర్యాటక ప్రాంతము కొండవీడు కావటం పర్యాటకంగా మంచి అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ పర్యాటకులకు అందుబాటులో బోటింగ్, ట్రెక్కింక్ వంటివి ఉన్నాయని, రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా కొండవీడు కోటపై టూరిజం అధ్వర్యంలో ఫెస్టివల్ నిర్వహించాలని సంకల్పించామని, ఇప్పటికే దీనికి సంబంధించి అటవీ శాఖ అధికారులు ఓ ప్రణాళిక తయారు చేశారని, జిల్లా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్దానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దీనిని పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల సహకారంతో సంక్రాంతి పండుగ రోజున ఫుడ్ ఫెస్టివల్ కైట్, ఫెస్టివల్ నైట్ క్యాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించి సాధ్యసాధ్యాలను క్షేత్రస్దాయిలో పరిశీలించే క్రమంలోనే ఇక్కడికి రావడం జరిగిందన్నారు. గతంలో ప్రతిపాదించిన డిపిఆర్‌ను పరిగణలోకి తీసుకోవడం లేదని, కొత్తగా రూపొందించే డిపిఆర్‌ను మాత్రమే అనుమతిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జి కృష్ణప్రియ, అర్డిఓ మధులత, టూరిజం శాఖ అధికారి నాయుడమ్మ అర్‌అండ్‌బి ఎస్సీ, తహశీల్దార్ విజయశ్రీ, ఎంపీడివో హేమలతాదేవి, స్దానిక సర్పంచ్ సాంబయ్య, సొలస ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, కొండవీడు అభివృద్ది కమిటీ కన్వీనర్ శివారెడ్డి, స్దానిక టిడిపి మండల నాయకులు కామినేని సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు మండలానికి 60 టన్నుల డిఏపి



పెదనందిపాడు అక్టోబర్ 16 (ప్రభాతవార్త) పెదనందిపాడు మండలంలోని పుసులూరు, పెదనందిపాడు, మరియు ఉప్పలపాడు జీడీసీఎంఎస్ సొసైటీలకు 60 టన్నుల డిఏపి వచ్చినదని మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు.అదేవిధంగా 17 .18 తేదీలలో మరలా ఒక వంద టన్నులు డిఏపి మండలానికి వస్తుందని రైతులందరికీ అవసరమైన అంతవరకు డి ఏ పి అందుబాటులోకి ఉందని అదే విధంగా యూరియా కూడా వచ్చే వారంలో రైతు సేవా కేంద్రాలకి మరియు సొసైటీకి లు కి తెప్పిస్తామని ఎం ఏ ఓ సుబ్రమణ్యం తెలిపారు.

## ఇండస్ట్రియల్ పార్ట్‌నర్ షిప్ డ్రైవ్ పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్

గుంటూరు ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 16 : ఏపిఐఐసి-ఇండస్ట్రీ పార్టనర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లాలో విడుదల చేశారు.నవంబర్ 14,15తేదీల్లో విశాఖపట ్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో భాగంగా ఈ పోస్టర్ విడుదల జరిగింది.భాగస్వామ్య సదస్సుపై సంబంధిత వర్గాల్లో అవగాహన,భాగస్వామ్యం కల్పించడానికి అక్టోబర్ 15నుంచి నవంబర్ 15వ తేది వరకు నెలరోజులపాటు కార్యక్రమాలను ఏర్పాటుచేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు.పరి శ్రమల వృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణ సమానంగా సాగాలని ఇందులో భాగంగా జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీరనణ,పర్యావరణ పరిరక్షణ,పరిశ్రమల అభివృద్ధి,శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా జరుగుతుందని తెలిపారు.పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం,ఏపిఐఐసి జోనల్ మేనేజర్ డాక్టర్ ఎం.ఎల్ నరసింహారావు,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.జయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌విఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల్లో నేషనల్ ఇన్నోవేషన్ డే



గుంటూరు విద్య, అక్టోబర్ 16, ప్రభాతవార్త : ఇండియాను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చే దిశగా విద్యారు ్థలు సృజనాత్మక ఆవిష్కరణలకు నాంది పలకాలని,భారత విజ్ఞాన ప్రగతికి డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం మార్గదర్శకులని డిఆర్‌డిఓ శాస్త్రవేత్త, డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం సహోద్యోది డాక్టర్ సుబీర్ కుమార్ చౌధురి పేర్కొన్నారు.స్థానిక చౌడవరంలోని ఆర్‌విఆర్ జేసి కళాశాల్లో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని కళాశాల అధ్వర్యంలో జాతీయ ఆవిష్కరణ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.తొలుత కార్యక్రమంలో పాల్గొన్న అతిధులు,కళాశాల సిబ్బంది డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ సుబీర్ కుమార్ చౌధురి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనా రంగ ప్రగతిలో భారత్ వేగంగా పురోగతి సాధిస్తూ ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిచిందని,డిజిటల్ ఎకానమి పెంచుతూ గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా బారత స్థానాన్ని సుస్థిరం చేసేందుకు యువ ఇంజనీర్లు సృజనాత్మక ఆలోచనలతో పరిశోదన,ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

## మిస్సైల్ మ్యాన్ కలాం.. నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబర్ 16, ప్రభాతవార్త : కల అంటే నిద్ర వచ్చేది కాదని,నిద్ర లేకుండా చేసేదని యువతకు లక్ష్యాలను నిర్ధేశించిన మిస్సైల్ మ్యాన్ డాక్టర్ అబ్దుల్ కలాం ఆదర్శప్రాయులని తూరు ్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువతకు డాక్టర్ అబ్దుల్ కలాం జీవితం ఒక పుస్తకమని,ఇది జీవితాలను ఉన్నత మార్గలలో తీర్చిదిద్దే ఆయుధమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో చల్లా ఆంజనేయ ప్రసాద్,పోతురాజు చంద్ర,రియాసత్,నజీర్,ఇర్రి సాయి,ముకుందరావు,వజ్జా లక్ష్మి,అఖని,తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీల అభ్యున్నతికి పాటుపడతాం

గుంటూరు,,అక్టోబర్ 16,ప్రభాతవార్త : రాష్ట్రంలో మైనార్టీల అభు ్యన్నతికి అని ్న విధాలా కృషిచేస్తున్నామని తూర్పుఎమ్మెల్యే నసీర్ అన్నారు.డిప్యూటీ కలెక్టర్,మైనార్టీ జిల్లా ఆఫీసర్ పార్ధసారధితో కలసి ముస్లీం మైనార్టీ అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు.స్థానిక బ్లూలైట్ సెంటర్‌లో మల్టిపర్పస్ స్కిల్ సెంటర్,ఫంక్షన్‌హాల్ నిర్మించనున్నామని



వెల్లడించారు.రెడ్ ట్యాంక్‌వద్ద షాదీఖానా,ఉర్దూ ఇన్‌స్టిట్యూట్ లైబ్రరీలతో కలపి బిల్డింగ్ ఏరా ్పటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.రా ష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మైనార్టీల అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.గత ప్రభుత్వంలో మౌజన్లు,ఇమామ్‌లకు అందించాల్సిన గౌరవ వేతనం బకాయిలను తాము అధికారంలోనికి వచ్చిన వేంటనే విడుదల చేశామన్నారు.

## చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమం పై అవగాహన

యద్లపాడు, అక్టోబర్ 16, ప్రభాతవార్త : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం స్వచ్ఛత అవగాహన కార్యక్రమంపై టీం 5కు ఎల్ఎస్‌డిజి ఎస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడివో వి హేమలతాదేవి పాల్గొని ప్రసంగిస్తూ తడి చెత్త పొడి చెత్తను వేరు చేయుట చెత్త నుండి సంపదను సృష్టించడం మనకు ఇంటిలో పనికిరాని వస్తువుల ద్వారా ఇంటి అవసరాలు తీర్చుకునే పద్ధతిని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని వాటిపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేసారు. పనికిరాని వస్తువులను జాగ్రత్తగా ఉంచి ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ రథంలో అందజేస్తే దానికి తగిన నిత్యఅవసరల సరుకులను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడివో జాకీర్ హుసేన్, గ్రూప్ లీడర్స్, పంచాయితీ పిఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఆర్‌జిఎస్ శ్రామికులు విధిగా జాబ్ కార్డుతో ఫేస్ ఈకెవైసి చేయించుకోవాలి

యద్లపాడు, అక్టోబర్ 16, ప్రభాతవార్త : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించే ఉపాధి హామీ శ్రామికులు అందరూ తమ జాబ్ కార్డు నెంబరుతో ఫెస్‌ను ఈకెవైసి చేయించుకోవాలని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ద లింగ మూర్తి పేర్కొన్నారు. యద్లపాడు గ్రామంలోని సంచాయితీలో ఉపాధి శ్రామికులకు ఈకెవైసి నిర్వహించే కార్యక్రమంలో అయన పాల్గొని స్వయంగా ఈకెవైసి నిర్వహించారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ ఈకెవైసి కార్యక్రమాన్ని అదివారం కల్లా పూర్తిచేయాలని అదేశించటం జరిగిందన్నారు. క్యాటిల్ షెడ్‌లు ఈ నెల 25కల్లా పూర్తి చేయాలని తెలిపారు సోక్ పిట్, కంపోస్ట్ పిట్, ఫామ్ ఫండ్ ప్రతి జిపికి 15చేయాలని తెలపటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎన్‌అర్‌జి ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పీహెచ్‌సీ తీరుపై జిల్లా వైద్యాధికారి అసంతృప్తి



కారంపూడి, అక్టోబరు 16 ప్రభాతవార్త: జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో పలు లోపాలు, నిర్లక్ష్యం స్పష్టమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

**రికార్డులు అస్తవ్యస్తం:** ఓపీ రిజిస్టర్, రోగుల వివరాలు, ల్యాబ్ పరీక్షల రికార్డులు, ఫార్మసీ గదిలో మందుల నిల్వ, టీకాల స్టాక్ వివరాలు పరిశీలించారు. అయితే రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, మందుల నిల్వ వివరాలు అసమగ్రంగా ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యాక్సిన్ నిల్వ సదుపాయాలు సరిగా లేవన్నారు. వ్యాక్సిన్ నిల్వ సరైన రీతిలో నమోదు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. టీకాల నిల్వ, వినియోగం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

**అవగాహన కార్యక్రమాలపై నిర్లక్ష్యం:** ప్రస్తుతం జరుగుతున్న గుండె – ఊపిరితిత్తుల పునరుద్ధరణ (సీపీఆర్) అవగాహన కార్యక్రమం, ఆడబిడ్డను రక్షించు – చదివించు కార్యక్రమాలు కేవలం పేరుతో నిర్వహిస్తున్నట్లు తేలిందని అధికారులు గుర్తించారు. ప్రజలలో అవగాహన కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని జిల్లా వైద్యాధికారి హెచ్చరించారు.

**ఉప ఆరోగ్య కేంద్రాల పరిశీలనలో లోపాలు:** పీహెచ్‌సీ పరిధిలోని ఉప ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి బుధవారం జరిగే వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలు కూడా పర్యవేక్షణ లేకుండా సాగుతున్నాయని ఆయన గమనించారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల పనితీరులో కూడా స్పష్టమైన లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం, రికార్డుల లోపాలు, మందుల నిల్వ అస్తవ్యస్తంపై జిల్లా వైద్యాధికారి తీవ్రంగా స్పందించారు. ఇకముందు ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతమైతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి హనుమకుమార్, జిల్లా సమన్వయకర్త ఉన్నూర్ బాషా, సిబ్బంది మల్లయ్య, ఉషారాణి, శివశంకర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి

కారంపూడి, అక్టోబరు 16 ప్రభాతవార్త: భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి, ప్రపంచ విద్యార్థుల దినోత్సవ వేడుకలు స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కలాం జీవిత విశేషాలను, ఆయన విద్యార్థుల గురించి సూచించిన విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## కారంపూడి శ్రీచక్ర సిమెంట్స్‌కు బెస్ట్ క్వాలిటీ అవార్డు



కారంపూడి, అక్టోబరు 16 ప్రభాతవార్త: కారంపూడి శివారులోని శ్రీచక్ర సిమెంట్స్ బెస్ట్ క్వాలిటీ అవార్డు దక్కింది. గత 40 సంవత్సరాలుగా సిమెంట్స్ రంగంలో దేనిలోనూ రాజీపడకుండా వినియోగ దారులకు నాణ్యమైన సిమెంట్‌ను అందిస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించింది. వరల్డ్ స్టాండర్డ్స్ డే సందర్భంగా భారతీయ ప్రామాణిక సంస్థ ద్వారా బెస్ట్ క్వాలిటీ అవార్డు శ్రీచక్ర సిమెంట్స్‌కు దక్కింది. ఈ తరహా అవార్డు దక్కడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా శ్రీచక్ర సిమెంట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆదరిస్తున్న కస్టమర్లకు, వినియోగదారులకు, పంపిణీదారులకు, మార్కెటింగ్ సభ్యులకు ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. ఈ అవార్డు రావడం వెనుక యాజమాన్య నిరంతర శ్రమ, ఉద్యోగస్తుల కఠోర శ్రమ, మార్కెటింగ్ కృషి కారణమన్నారు. వారందరికీ శ్రీచక్ర సంస్థ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు

క్రోసూరు, అక్టోబర్ 16 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా కోసూరు మండలంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వెంకటరమణ ఆధ్వర్యంలో క్రోసూరులోని షాదీ ఖానా సమావేశ మందిరంలో గురువారం పోషణ మాస ఉత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. పోషకాహార ప్రదర్శనతో పాటు



పోషకాహార వంటల పోటీలు కిషోర్ బాలికలకు మీరు తినే ఆహారం మీ పెరుగుదల అనే అంశంపై వ్యాసరచన పోటీలు , నిర్వహించి వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేయడం జరిగింది. ఉత్తమ భర్తలకు ఉత్తమ భార్యలకు సత్కారం చేయడం జరిగింది. దీంతోపాటు విటమిన్లు రక్తహీనత పరిశుభ్రత వంటి అంశాలపై కిషోర్ బాలికలకు గర్భిణీలకు మరియు బాలింతలకు అవగాహన కల్పించడం జరిగింది ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ భోజన పదార్థాల్లో నూనె పంచదార చెడు క్రొవ్వును పెంచే పదార్థాలను తక్కువగా వాడి పోషకాలు ఎక్కువగా ఉండే పదార్థాలను అనగా పప్పు ఆకుకూరలు కోడిగుడ్లు రాగి పిండి వేరుశెనగ చెక్కలు ఎండు ఖర్జూరం మరియు కాయగూరలు ఎక్కువగా వాడాలని సూచించారు తద్వారా మన శరీరంలో ఊబకాయం రాకుండా శరీరం దృఢంగా ఉంటుందని సూచించారు మరి విశేషంగా బాల్య వివాహాలు నిరోధించడంలో తల్లిదండ్రులు గణనీయ పాత్ర పోషించాలన్నారు సమాజం పట్ల అవగాహన కలిగించాలని కోరారు ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కోటయ్య దేశం పార్టీ మండల అధ్యక్షులు మొగల్ జాన్ కాంగ్రెస్ కాశయ్య వేగుంట రాణి, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, వివిధ మండలాల ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

## ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షునిగా దివ్వెల



సత్తెనపల్లి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షునిగా దివ్వెల శ్రీనివాసరావు గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సంబంధించిన పూర్తి కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు భగవన్నారాయణ ప్రకటించారని తెలిపారు. ఈ నెల 19న నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని కోరారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో ఉపాధ్యక్ష పదవిని రాష్ట్ర అధ్యక్షులు డి.భగవన్నారాయణ అందించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

## విశ్వ కళాభూషణ్ పురస్కారాలు

సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 16ప్రభాత వార్త : బెజగం రవి కుమార్‌కి తెలుగు వెలుగు సాహితీ వేదికచే భారత స్ఫూర్తి కిరీటి, మరియు విశ్వకర్మ కళాపీఠం వారిచే,విశ్వ కళా విభూషణ్ ఖిఖి జాతీయ గౌరవ పురస్కారాలు ప్రధానం ఇచ్చారు .హైదరాబాద్ త్యాగరాయ గాన సభ బుధవారం.తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారి ఆధ్వర్యంలో త్యాగరాయ గాన సభలో వెంకట కళా దీక్షి తులు కళా వేదిక ప్రాంగణంలో పోజ్ల్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో కీర్తి శేషులు మండలి వెంకట కృష్ణా రావు శత జయంతి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం పొందిన 100 మందికి పైగా కళా కారులకీ జాతీయ గౌరవ పురస్కారాలు మహా నంది, స్ఫూర్తి కిరిటి అశోక చక్ర మరియు నటరాజ పురస్కారాలను ప్రధానం చేసారు. కార్యక్రమము నకు ముందు కవులు గాయకులు తమ గానముతో ప్రేక్షకులను రంజింప చేసారు. ఈ కార్యా క్రమానికి శాసన సభ్యులు మండలి బుద్దా ప్రసాద్,ముఖ్య అతిధి మండలి లక్ష్మణ బాబు,మాజీ చైర్మన్ బి. సి కమిషన్ తెలంగాణ.,శభాధ్యక్షులు బ్రహ్మశ్రీ వంగల శాంతి కృష్ణ ఆచార్యులు,గా వ్యవహరించారు. అతిథులు, ముఖ్యతిథులు పురస్కార గ్రహీతలకు తలపాగా, శాలువా, పతకం, మరియు ప్రశంస పత్రాలును ప్రధానం చేసారు.పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణమునకు చెందిన వర్ధమాన పౌరాణిక రంగస్థల కళాకారుడు బెజగం రవి కుమార్ కీ తెలుగు వెలుగు సాహితీ వేదిక "భరత స్ఫూర్తి కిరిటి ఖిఖి అశోక చక్ర మరియు విశ్వకర్మ కళా పీఠం వారి ఖిఖి విశ్వ కళా భూషణ్‌ఖిఖిపురస్కారాలు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమలో కె.నాగేశ్వరావు రావు సినిమా పాటలు పాడారు. రవి కుమార్ తో పాటు నాగేశ్వరావు రావు కీ కూడా విశ్వకర్మ జ్ఞాపికని రమేష్ బహుకరించారు. సత్తెనపల్లి లోని వివిధ కళా సంస్థల వారు,గురువారం స్వగృహం నందు మిత్రులు, శ్రేయోభిలాషులు రవి కుమార్ ను అభినందించారు.



## బిసి నేత ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్' కార్యక్రమాలు

అచ్చంపేట, అక్టోబర్ 16 (ప్రభాతవార్త):.గత రెండు రోజులుగా సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్" కార్యక్రమాన్ని బీసీ నాయకులు భక్తులు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదల వల్ల వ్యాపారస్తులకు అమ్మకాలు పెరిగి, కొనుగోలు దారులకు ఖర్చు తగ్గి, అందరికీ లాభం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వ్యాపారస్తులకు పన్ను భారాన్ని తగ్గించడమే కాకుండా సాధారణ ప్రజలకు కూడా ఆర్థిక ఉపశమనం కలిగించిందని ఆయన అభిప్రాయపడ్డారు. పట్టణంలోని షాపులు, దుకాణాలు, వ్యాపార సంస్థల్లో ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



## ఏపి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవార్డులు



అమరావతి, అక్టోబర్ 11 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమొక్రటిక్ ఆధ్వర్యంలో టీచర్స్ ఎక్సలెన్సీ అవార్డుని మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్.రామకృష్ణ, గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ మన్నం సుబ్బారావులు ఉపాధ్యాయులు షేక్.మస్తాన్‌షరీఫ్‌కు అందజేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉందన్నారు. గత 23 సంవత్సరాలుగా గణిత ఉపాధ్యాయునిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. అవార్డు గ్రహీత షరీఫ్‌ను కాకతీయ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శీలంనేని సాంబశివరావు, సొసైటీ అధ్యక్షులు శీలంనేని ఇందిరాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాణాసంచా అమ్మకాలకు ఆర్డీవో అనుమతి తప్పనిసరి : తహశీల్దార్ డానియేలు

అమరావతి, అక్టోబర్ 16 ప్రభాతవార్త : దీపావళి పర్వదినం సందర్భంగా టపాసులు అమ్ముకునేందుకు ఆర్డీవో అనుమతులు తప్పనిసరి అని తహశీల్దార్ డానియేలు గురువారం స్పష్టం చేశారు. లైసెన్స్ పొందేవారు తహశీల్దార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఫైర్ డిపార్ట్‌మెంట్, పంచాయితీ వారు సూచించిన స్థలాలలో టపాసుల అమ్మకాలు జరపాలన్నారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డానియేలు తెలియజేశారు.




## కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు బలోపేతం : సర్పంచ్ పులిబండ్ల అశోక్

రాజుపాలెం, అక్టోబర్ 16 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయితీలు స్వతంత్రంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్‌శాఖామంత్రి పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధిస్తామని రాజుపాలెం సర్పంచ్ పులిబండ్ల అశోక్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు, షెడ్ మిత్రాలకు "పచ్చదనం – పరిశుభ్రత, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్" పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం మండల కేంద్రమైన రాజుపాలెంలోని చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రంలో గురువారం జరిగింది. ఈవోపిఆర్‌డి పగడాల ముక్కంటి అధ్యక్షతన జరిగిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులిబండ్ల అశోక్ పాల్గొని తమ గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణ, తడి, పొడి చెత్త గ్రేడింగ్ విధానం, తదనంతరం దశలవారీగా చేస్తున్న పద్ధతులను అధికారులకు అంబాసడర్లకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో పంచాయితీలకు ప్రోత్సాహకంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, మాజీమంత్రి, స్థానిక సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పగడాల శ్రీనివాసరావు, చొక్కా మల్లికార్జునరావు, దుడుకు రామారావు, కొజ్జా శ్రీనివాసరావు, గుడారి గంగారావు, కేదారి రమేష్, చిట్టెంశెట్టి గోపి, సఖినాల ధర్మారావు, మొర్రిబోయిన శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌నాయక్, వెంకటేశ్వరనాయక్, అధికారులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.




## నేడు చీఫ్‌విప్ జీ.వీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్



వినుకొండ,అక్టోబర్16,ప్రభాతవార్త: నేడు ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పట్టణంలోని కొత్తపేట నందు గల కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా వినతులను జీ.వీ స్వీకరిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## మద్యం కేసులో వ్యక్తులు బైండోవర్

ఈపూరు,అక్టోబర్15,ప్రభాతవార్త: ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యంకు సంబంధించిన కేసులో బొల్లాపల్లి మండలం మ రిపాలెం గ్రామానికి చెందిన ఒకరు,అలవల గ్రామానికి చెందిన ఇద్దరిని,అయ్యన్నపాలెంకు చెందిన ఒక వ్యక్తిని బొల్లాపల్లి మండల తహశీల్ధార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందని ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు తెలిపారు.


## జీడీసీసీ బ్యాంకు మేనేజర్ల సాధారణ సమావేశం



వినుకొండ,అక్టోబర్16,ప్రభాతవార్త: గుంటూరు పట్టణంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నందు మేనేజర్ల సాధారణ సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు ఛైర్మన్ మకె ౖన మల్లికార్జునరావు,సీఈవో అజయ్ కిషోర్,అధికారులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన

సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 16ప్రభాతవార్త :సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం బృందం సత్తెనపల్లి పట్టణంలోని గురువారం నాడు ప్రతి షాప్ దగ్గర సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడవద్దని, ఒక వేళ వాడితే 10 వేల రూపాయల జరిమానా వెయ్యొచ్చు అని అండర్ టేకింగ్ తీసుకుంటున్నాము అని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. స్వచ్ఛంధంగా అడిగిన వెంటనే ప్రజలు ముందుకొస్తున్నారు అని, త్వరలో చాలా వరకు మార్పు ఆశిస్తున్నాము అని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ విజయ సారధి మరియు పారిశుద్ధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంటికి తాళం



మాచర్ల, అక్టోబరు 16 ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాసం ఈఈ.1 నంబరు గల ఇంటికి ఇరిగేషన్ అధికారులు తాళం వేశారు. ఆ క్వార్టర్ పిన్నెల్లికి కేటాయించి సుమారు 15 సంవత్సరాలుగా ఆయన పేరుపై ఉంది. ఎన్నికల అఫిడవిట్‌లో కూడా ఈ క్వార్టర్‌ను ధ్రువీకరించారు. అయితే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విజయపురిసౌత్‌లోని పిన్నెల్లి నివాసానికి నీటిపారుదల శాఖ అధికారులు తాళం వేశారు.

## చంద్రబాబు మైక్రోసాఫ్ట్ తెస్తే.. లోకేష్‌బాబు గూగుల్ తెచ్చారు!: యాగంటి

మాచర్ల, అక్టోబరు 16 ప్రభాతవార్త: ఆనాడు సీఎం చంద్రబాబు హైదరాబాదుకి మైక్రోసాఫ్ట్ తెస్తే ఈనాడు లోకేష్‌బాబు విశాఖకి గూగుల్‌ని తీసుకువచ్చారని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. గూగుల్ క్లౌడ్‌తో ఆంధ్రప్రదేశ్ తలరాత మారబోతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ క్లౌడ్ రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడితో 2 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబోతుందన్నారు. ఇది కేవలం పెట్టుబడి కాదు, భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది అన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి, యువనాయకుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి ఫలితంగా అద్భుతమైన గ్లోబల్ పెట్టుబడి సాధ్యమైందన్నారు. 12 నెలల నిరంతర శ్రమ, జాతీయ విధానాల్లో మార్పులు చేసి రాష్ట్రానికి ఈ అవకాశాన్ని తీసుకురావడం లోకేష్ నాయకత్వం, సమర్థతకు నిదర్శనమన్నారు. అమెరికా తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద, దేశంలో తొలి ఏఐ హబ్ విశాఖలో స్థాపన ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ టెక్ మ్యాప్‌పై నిలబెట్టబోతోందన్నారు. విశాఖలో ఏర్పడబోయే సబ్ సీ కేబుల్ నెట్‌వర్క్ అంతర్జాతీయ కనెక్టివిటీకి నూతన గమ్యం అన్నారు.



## వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తృతం

మాచర్ల, అక్టోబరు 16 ప్రభాతవార్త: ప్రపంచంలోని అనేక దేశాలలో సేవలందిస్తున్న వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ, వాసవీ క్లబ్ లక్ష్మీచెన్నకేశవ సభ్యులు రాబోయే నూతన సంవత్సరంలో చేయబోయే కార్యక్రమాల గురించి గురువారం సమావేశం నిర్వహించారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు, పేదలు, పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. నూతన సంవత్సరంలో చేయబోయే సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భవనారి సత్యనారాయణ, కార్యదర్శి విజయలక్ష్మి, వాసవీ క్లబ్ పూర్వ అధ్యక్షులు పోలూరి నరసింహారావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, ఓరుగంటి చెన్నకేశవరావు, మేడా వెంకటలక్ష్మిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎన్ చుండూరు సత్యనారాయణ, గంగిశెట్టి రామలింగేశ్వరరావు, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



## వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

మాచర్ల, అక్టోబరు 16 ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం పట్టణంలో జరిగింది. మాచర్ల 30వ వార్డులో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమ పాల్గొన్నారు. కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

విజయపురిసౌత్, అక్టోబరు 16 ప్రభాతవార్త: ఓ గొప్ప సైంటిస్టు, గొప్ప రాష్ట్రపతి, మంచి రచయిత, అంతకుమించిన మార్గనిర్దేశకుడు, అందరికీ ఆదర్శనీయుడు, అన్నిటికీ మించి ఓ గొప్ప దేశభక్తుడు, మిస్సైల్ మ్యాన్‌గా దేశ చరిత్రను ప్రపంచానికి చాటిన వ్యక్తి డా॥ ఏపీజే అబ్దుల్‌కలాం అని హెచ్‌ఎం మల్లికార్జునరావు అన్నారు. సాగర్ క్యాంపు-1 పాఠశాలలో కలాం జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ



రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ దాకా, పేపర్ బాయ్ నుంచి ప్రెసిడెంట్ దాకా సాగిన ఆయన ప్రస్థానం గురించి విద్యార్థులకు వివరించారు. ఇస్రో నుంచి నాసా నుంచి పిలుపువచ్చినా డాలర్ డ్రీమ్స్ కన్నా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తిత్వం అని కలాంను కొనియాడారు. సైంటిస్టుగా రిటైరయ్యాక దేశ అత్యున్నత పదవికి ఎన్నికయ్యారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అధికార, విపక్షాల మద్దతుతో రాష్ట్రపతిగా ఎన్నికైన అబ్దుల్ కలాం ఆ పదవికే వన్నె తెచ్చారు. రాష్ట్రపతి భవన్‌కే విలువలు పెంచారు. అత్యున్నత పదవిలో ఉన్నా ఎక్కడా తన వినయానికి ఎక్కడా లోటు రానివ్వలేదని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఫ్లైటెక్ ఏవియేషన్ ఛైర్మన్ మమత సాగర్ సాగర్ క్యాంప్-2 విద్యార్థులకు 500 నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం పాల్‌రాజు పాఠశాల తరఫున ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భక్తులకు అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలి: గురజాల ఆర్డీవో మురళీకృష్ణ

గురజాల, అక్టోబరు 16 ప్రభాతవార్తః కార్తీకమాసం సందర్భంగా ఆలయాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని ఆర్డీవో మురళీకృష్ణ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో దేవాదాయ శాఖ, మండలస్థాయి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని దైద, పిడుగురాళ్ల మండలం గుత్తికొండ బిలం దేవాలయాలకు భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో భక్తులకు అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ జగదీష్, నాగార్జున సాగర్ కుడి కాలువ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, తహసీల్దార్ దుర్గేశ్వరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.



## కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న 'గజ్జల'

ముప్పాళ్ళ, అక్టోబర్ 16ప్రభాతవార్త :గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ళ మండలం కుందురు వారి పాలెం గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారూరి పద్మావతి రామలింగారెడ్డి, పల్నాడు జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు ఇందూరి నర్సింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్ రెండేఎద్దుల వెంకటేశ్వర్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చావా రమేష్ బాబు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, సర్పంచ్ సైకం వెంకటప్పరెడ్డి, ఎంపీటీసీ మేడ వెంకటరమణ వీరాంజనేయులు, బత్తుల బాలకోటి, షేక్ మస్తాన్వలి, ఏరువ అప్పిరెడ్డి, సానికొమ్ము శ్రీనివాస్ రెడ్డి, బత్తుల సాంబశివరావు, జింక జగన్మోహన్రావు, కొండ్రతి శ్రీనివాస్, సురేంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు



# రోటరీ సేవల అభినందనీయం

మంగళగిరి, అక్టోబర్ 16, ప్రభావతవార్త: మంగళగిరి వీటిజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కాలేజీలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మంగళకరము అనే పేరుతో ఈనెల 14 నుండి 17 వరకు జరుగుతున్న నాలుగో విడత దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజైన గురువారం 45 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి హాజరై దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి దివ్యాంగులకు కృత్రిమ చేతులు అందజేయడం అనేది ఎంతో గొప్ప కార్యక్రమాన్నారు.



పూర్తి పనితీరుతో ఉన్న కృత్రిమ చేతులు ప్రారంభంలో కొంత అసౌకర్యంగా ఉన్నప్పటికీ దివ్యాంగులు అశద్ధ చేయకుండా ఉపయోగించుకుంటే భవిష్యత్తులో పూర్తి ఫలితాలను పొందవచ్చన్నారు. ప్రభుత్వం కూడా చేపట్టని మంచి అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిన రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరిని తమ శాఖ తరపున అభినందిస్తున్నానన్నారు. రోటరీ మంగళకరం రాష్ట్రంలో మంచి ప్రాచుర్యం పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి లిమిటెడ్ రిటైర్డ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ వి రవి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ట్రెజరర్ కేవీఎస్ ప్రకాశరావు, ప్రాజెక్టు చైర్మన్ ఇసునూరి అనిల్ చక్రవర్తి, ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు అందె మురళీ మోహనరావు, గోలి శ్రీకాంత్, జొన్నాదులు బిక్షారావు, చనుమోలు గోపాల్, కాపరౌతు సుందరయ్య, జవ్వాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై ప్రభుత్వ హాస్టళ్లు గురుకులాల నిర్వహణ పర్యవేక్షణలపై బీసీ సంక్షేమ సంఘం ఆరా: కేసన

మంగళగిరి, అక్టోబర్ 16, ప్రభాతవార్త: ఇటీవల వెలుగు చూస్తున్న ప్రభుత్వ వసతి గృహాలు గురుకుల ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల్లో కొందరు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలు కావడం కొందరు మృతి చెందటం చాలా బాధాకరమని, వీటి నిర్వహణ పర్యవేక్షణలపై అన్ని జిల్లా కమిటీలు సమగ్ర సమాచారం సేకరించి రాష్ట్ర కార్యాలయానికి పంపాలని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఈ అంశంపై ఈరోజు స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి,ఆ మేరకు తమ




సంఘ రాష్ట్రవ్యాప్త నాయకులందరికీ పిలుపునిచ్చారు. ఇంకా వారు స్వాతంత్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు పైబడుతున్నా, ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా, కోట్లాది రూపాయలు అట్టడుగు వర్గాల బాలబాలికల సంక్షేమానికి విద్యాభివృద్ధికి బడ్జెట్లలో కేటాయింపులు జరుపుతున్నప్పటికీ, అవినీతి అసమర్ధ పాలనల కారణంగా, సంక్షేమ హాస్టళ్లఆశ్రమగురుకుల పాఠశాలల నిర్వహణ పర్యవేక్షణలు ఇంకను అస్తవ్యస్తంగానే ఉంటున్నాయన్నారు. కనీస మౌలిక వసతుల కల్పన కూడా జరగడం లేదన్నారు ఇంకనూ ప్రభుత్వ వసతి గృహాలలో కనీసం మంచాలు పరుపులు లేకుండా,విద్యార్థులకు నేలపడకలే దిక్కవుతున్నాయన్నారు. వసతి గృహాల విద్యార్థుల సమస్యలపై ఎన్నిసార్లు న్యాయస్థానాలు ముఖ్యంగా హైకోర్టుతో సహా మొట్టికాయలేసినా మీడియా ఎంతగా గగ్గోలు పెడుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదన్నారు. సంఘం ప్రతి జిల్లా అధ్యక్షుని నాయకత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన పర్యవేక్షణ కమిటీ, స్వంతఅద్దె భవనాలను గుర్తించాలని,అన్ని అద్దె భవనాలను, ప్రభుత్వమే నూతన భవనాలను నిర్మించి వైద్యంతో సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలలోని హాస్టళ్లు గురుకులాలను పర్యవేక్షి ంచి, వివరాలను రాష్ట్ర కార్యాలయానికి పంపాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, రాష్ట్ర నాయకులు అడపా శ్రీనివాసరావు మంగళగిరి నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలి



పొన్నూరు, అక్టోబరు 16,ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని 23వ వార్డులో గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటికరణకు నిరసనగా వైకాపా ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పేద విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు రాష్ట్రానికి ఎన్నడూ లేని విధంగా 17వైద్య కళాశాలలను తీసుకొస్తే, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేసేందుకు కూటమి ప్రభుత్వం స్వీకారం చుట్టిందని, కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకొనేందుకు ప్రతి ఒక్కరూ బయటకు రావాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే పేదలకు వైద్య విద్య దక్కకుండా పోతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు పీపీపీవిధానంలో ప్రభుత్వ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారన్నారు. ఈ విధానం పేద విద్యార్థులకు ఇబ్బంది కరంగా మారుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో తమ నిరసనను తెలిపేందుకు కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గేరా కుమారి, గేరాసంజీవ్, షేక్ నాజర్, ఎందేటి వెంకటసుబ్బయ్య, అమిరినేని సాంబశివరావు, మంద్రు అనిత, సుశోభిత తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి



పొన్నూరు, అక్టోబరు 16,ప్రభాతవార్త: నరక చతుర్ధశి, దీపావళి పర్వ దినాలను పురస్కరించుకొని బాణా సంచా విక్రయదారులు అందుకు సంబంధించిన అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని తహశీల్దార్ మహమ్మదహ జియావుల్ హక్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాణా సంచా విక్రయదారులు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విక్రయాలు జరుపుకునేందుకు అనువైన ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామారావు, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్, అగ్నిమాపకశాఖాధికారి కె.ప్రసాదరావు, రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబు పాల్గొన్నారు.

## సేవా తత్పరుడు షేక్ యాసిన్



పొన్నూరు, అక్టోబరు 16,ప్రభాతవార్త: పేదలకు దాన ధర్మాలు చేసి పేదల పాటిట పెన్నిధిగా, సేవా తత్పరుడుగా షేక్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ స్వర్గీయ షేక్ యాసిన్ ప్రజల హృదయాల్లో నిలిచారని వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక రేపల్లె బస్టాండ్ సెంటర్‌లో యాసిన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ యాసిన్ పేద ప్రజల పట్ల జాలి, దయ, సహాయం చేసే మనస్తత్వం కలిగి ఉండేవారన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నా, ఆయన తనయుడు వైఎస్ జగన్మోహనరెడ్డి అన్నా మరింత అభిమానంగా ఉండేవారన్నారు. యాసిన్ అకాల మరణాన్ని కార్యకర్తలు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా మాట్లాడుతూ మంచి మనసున్న మనిషిని కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. యాసిన్ ఎప్పుడూ పేదల కోసమే శ్రమించేవారన్నారు. అంజుమన్ కమిటి అధ్యక్షుడిగా పనిచేసిన యాసిన్ ముస్లింల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని సైపుల్లా చెప్పారు. తొలుత యాసిన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎందేటి వెంకటసుబ్బయ్య, షేక్ నాజర్, అమిరినేని సాంబశివరావు, షేక్ మహమ్మద్(మాము), షేక్ పీర్‌సాహెబ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్స్ పొందండి

పొన్నూరు, అక్టోబరు 16,ప్రభాతవార్త: సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్స్ పొందాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ పిలుపునిచ్చారు. స్థానిక హీరో హోండా షోరూంలో గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జియావుల్ హక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జీఎస్టీపై అవగాహన పెంచుకొని సొమ్మును ఆదా చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మరీ ముఖ్యంగా పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కొన్ని వస్తువులపై జీఎస్టీని పూర్తిగా తొలగించిందన్నారు. తెనాలి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృతరాణి మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్, రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌కార్డుల నమోదు ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పని సరిగా చేయాలి



బాపట్ల,అక్టోబర్16,ప్రభాతవార్త: ఆధార్ అప్‌డేట్ ఐదేళ్ళ చిన్నారులకు తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లాలో ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై గురువారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరి అన్నారు. అదే విధంగా ఐదు నుంచి ఏడు సంవత్సరాల, 15 నుంచి 17 సంవత్సరాల లోపు వారికి బయోమెట్రిక్ నవీకరణ తప్పకుండా చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. లేనిపక్షంలో ఆధార్ కార్డులు రద్దయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అదేవిధంగా 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతీయువకుల ఆధార్ కార్డులలో బయోమెట్రిక్ నవీకరణ తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ఈ నవీకరణ చేయకపోతే వారి ఆధార్ కార్డులు రద్దు అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు 21,671 మంది ఐదు నుంచి ఏడేళ్లలోపు పిల్లల ఆధార్ నవీకరణ, అలాగే 14,536 మంది 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతీయువకుల ఆధార్ నవీకరణ పెండింగ్‌లో ఉండటంపై ఆయన ఆరా తీశారు. డిఆర్‌ఓ జి.గంగాదర్‌గౌడ్,డిఈవో పురుషోత్తం,జిల్లా వైద్యాధికారిఎస్ విజయమ్మ,స్త్రీశిశు సంక్షేమ శాఖ పిడి రాధా మాధవి,జిల్లా కోఆర్డినేటర్ ఆశోక్‌బాబు,కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ వందనం,తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలి

బాపట్ల,అక్టోబర్16,ప్రభాతవార్త: గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుపై సంబంధితశాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవడంతోనే బాపట్ల జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావడంలేదన్నారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో 50 ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవడంపై ఆరా తీశారు. తక్షణమే భూ సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 14 గేట్లు మరమ్మతులు పూర్తి అయ్యాయన్నారు. ప్రాజెక్టు ద్వారా బీడు భూములకు సాగునీరు అందించడం లక్ష్యమన్నారు. తాజాగా బాపట్ల జిల్లాలో 2,600 ఎకరాల భూమి ఆయకట్టు పరిధిలోకి తీసుకురావడానికి గజిట్ విడుదల చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం అధికారికంగా ప్రకటన విడుదలకు అన్ని చర్యలు చూసుకుంటున్నామన్నారు. మరో 78 ఎకరాల భూమి ఆరికట్టులోకి తెచ్చేందుకు జలవనరులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ వారంలో పూర్తి చేయాలన్నారు. కొరిశపాడు, అద్దంకి మండలాలలో మూడు గ్రామాలలో 1,100 కుటుంబాలకు పునరావాసం కింద నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో, సంబంధిత తహసిల్దారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టుల ఎస్‌ఈ అబూతలీమ్, ఆర్డీవో చంద్రశేఖర్, ఉప కలెక్టర్లు తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాలు ప్రారంభం

బాపట్ల,అక్టోబర్16,ప్రభాతవార్త: జిల్లాలో పరిశ్రమల భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. పరిశ్రమల పెట్టుబడిదారుల సదస్సును పురస్కరించుకొని రూపొందించిన గోడపత్రాలను కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల భాగస్వాముల సదస్సు నవంబర్ 14, 15 తేదీలలో విశాఖపట్నంలో జరగనుందన్నారు. ఈ సదస్సు ద్వారా ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రయత్నం జరుగుతుందని ఆయన తెలిపారు. పరిశ్రమల ఆధునికీకరణ, స్థిరీకరణ, పెట్టుబడిదారుల సంసిద్ధత, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలోని పరిశ్రమల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో అక్టోబర్ 17 నుంచి నవంబర్ 15 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు. అక్టోబర్ 17నుంచి 21 వరకు పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాలు.22 నుంచి 28 వ తేది వరకు మొక్కలు నాటే కార్యక్రమాలు 29-నవంబర్ 5వ తేది వరుకు ఉత్సాహిక పెట్టుబడిదారుల సహకారంతో పరిశ్రమల అభివృద్ధి కార్యక్రమాలు నవంబర్ 6నుంచి 15వరకు పరిశ్రమల ఆధునికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. డీఆర్‌ఓ జి. గంగాధర్ గౌడ్, ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు

బాపట్ల,అక్టోబర్16,ప్రభాతవార్త: జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటా మని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. గురువారం బాపట్ల సూర్యలంక బీచ్ లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కోసం బీచ్ లో ఏర్పాటు చేసిన శాండ్ ఆర్ట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఆర్ట్ ఈ నెల 19వ తేదీ వరకు ప్రదర్శిన కోసం ఉంచడం జరుగు తుందని పర్యాటకులు అందరూ కూడా చూడాలని ఆయన చెప్పారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం 97.52 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సూర్యలంక బీచ్ లో టాయిలెట్లు, స్నానపు షవర్లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ను, క్లాత్ చేంజ్ రూమ్స్ , పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. జిల్లాలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులు పాటు షాప్ ఫెస్టివల్ ను ఏర్పాటు చేస్తామని అనిఆయన చెప్పారు. షాప్ ఫెస్టివల్స్ లో కార్యక్రమంలో ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ సేవింగ్స్ తో పాటు అదనపు డిస్కౌంట్ లను షాపు యజమాని ప్రజలకు ఇస్తారని ఆయన చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన కోరారు. రామాపురం బీచ్ లో ఇటీవల జరిగిన సంఘటన చాలా బాధాకరమని ఇలాంటి సంఘటనలు జరగకుండా బీచ్ వద్ద 15 మంది స్విమ్మర్లను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. సముద్ర స్నానానికి వెళ్లే పర్యాటకులు మద్యం సేవించి వెళ్ళరాదని ఆయన తెలియ జేశారు. సముద్రంలో ప్రమాదాలు జరిగిన వెంటనే రక్షించడానికి నాలుగు బోట్లను ఏర్పాటు చేశామని అని చెప్పారు. బీచ్ కు వచ్చే పర్యాటకులు సముద్రంలో లోతైన ప్రాంతాల వెళ్లకుండా సమీప ప్రాంతాల్లో స్నానాలు ఆచరించి సురక్షితంగా తిరిగి వెళ్ళాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్, జిఎస్టి స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గ్లోరియా కుమారి, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, తహసిల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ ఉమామహేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బాపట్ల జిల్లా నూతన అదనపు కలెక్టర్ వి.భావన

బాపట్ల,అక్టోబర్16,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా నూతన అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వి.భావన గురువారం జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



స్థానిక జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో అదనపు కలెక్టర్ భావన, ఎస్పీ ఉమామహేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పోలీసుల కృషిని ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ వివరించారు. నూతన అదనపు కలెక్టర్‌కు జిల్లా పరిస్థితులపై అవగాహన కల్పించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్‌గా తనవంతు సహకారం అందిస్తానని వి.భావన తెలిపారు.

## విద్యతో పాటుగా క్రీడల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలి



కర్లపాలెం, అక్టోబర్16, ప్రభాతవార్త: విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని బాపట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని భార్గవి హై స్కూల్ లో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యంతో విద్యను అభ్యసించాలని కోరారు. నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్ జి ఎఫ్ డివిజన్ స్థాయి అండర్ 17 బాలికలచెస్ పోటీలలో శ్రీ భార్గవి హై స్కూల్ విద్యార్థిని ఏట్రా అమూల్య అండర్ 14 విభాగంలో శ్రీ భార్గవి హైస్కూల్ కు చెందిన ఎట్ర దేవి శ్రీ జిల్లాస్థాయి కి ఎంపిక కావడం పట్ల ఆమె విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమార్ చేతుల మీదుగా మెడల్స్ ను అందజేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమారిని దృశ్యాలు వాళ్ళతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పేరాల వెంకట సురేష్ ప్రిన్సిపాల్ బాపట్ల లక్ష్మి,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు దివ్య, సునీత,సాహితీ, ప్రసన్నకుమారి,సత్యవతి, రిజ్వానా,ప్రేమావతి, చక్రవర్తి శివప్రసాద్ పి ఈ టి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



పొన్నూరు, అక్టోబరు 16,ప్రభాతవార్త: అధికారులు గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టి అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని ఎంపిపి భవనం పద్మలీల కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పద్మలీల అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పద్మలీల మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలను చైతన్యం తేవాలన్నారు. రోడ్ల వెంట మురుగు ఉన్నట్లయితే తొలగించాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగేవిధంగా పంచాయితీ అధికారులు, సచివాలయాల సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జాగ్రత్తల గురించి ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అంబటి రాఘవయ్య, మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్, మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుంది



పొన్నూరు, అక్టోబరు 16,ప్రభాతవార్త: ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రణాళికలను రూపొందిస్తుందని తహశీల్దార్ శ్రీనివాసశర్మ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి, శలపాడు, శేకూరు, వడ్లమూడి,వేజండ్ల, నారాకోడూరు, గొడవర్రు చేబ్రోలు-1,చేబ్రోలు-2, చేబ్రోలు-3, చేబ్రోలు-4 రైతు సేవా కేంద్రాలను గురువారం రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసశర్మ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఇప్పటి నుంచే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని 17శాతం కాన్న ఎక్కువ తేమ శాతం లేకుడా ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. రైతుల సౌలభ్యం కోసమే ప్రతి రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందన్నారు. ప్రభుత్వం రూ.1792(75కిలోల బస్తా) మద్దతు ధర ప్రకటించిందన్నారు.ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జి.మోహన్, రైతు సేవా సిబ్బంది ఎన్.అఖిల, సూర్యప్రకాష్, వర్ష, ఎం.రత్నబాబు, కోటి లక్ష్మి, కె.విజయకుమార్, వి.మదుసూధనరావు, జె.జోనాథన్, ఎ.శ్రీలేఖ, సబీనా బేగం, టి.రమ్మ తదితరులున్నారు.

## స్నేహహస్తాలు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవి



కొల్లిపర,అక్టోబరు 16 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్ధుల కోసం స్నేహహస్తాలు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని ఎంఈవో వెంకటేశ్వర్లు-1, రఘానిస్సలత-2 అన్నారు. అచ్చంపేట బొల్లాపల్లి, వినుకొండ తదితర మండలాలలో 100 కు పైగా పాఠశాలలకు వితరణ అందిస్తున్న స్నేహహస్తాలు పౌండేషన్ తరపున గురువారం మున్నంగిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎల్ఈకు) కు ఒక కంప్యూటర్‌ను,స్కూలు లోని 72 మంది విద్యార్థులకు అన్నతినే కంచాలు,కాపీరైటింగ్ పుస్తకాలు,ఎక్కాల పుస్తకాలు,పెన్నులు వితరణగా అందించారు.హైదరాబాద్‌లో పనిచేస్తున్న అరవ గోపికృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విద్యార్థులందరికీ స్టీలు వాటర్‌బాటిల్స్ అందజేసారు.పాఠశాల తరపున విద్యార్థులందరికీ ఐడీ కార్డులు ఉచితంగా అందజేసారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయినీ మునగాల ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు మాట్లాడుతూ దాతలు అందించిన సాయాన్ని అందుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు.వీటిని సక్రమంగా వినియోగించుకుని దాతల వితరణకు అర్ధం చేకూర్చాలన్నారు.15 సంవత్సరాలుగా తాము వితరణ చేస్తున్నట్లు స్నేహహస్తాలు పౌండేషన్ సమన్వయకర్త కరిముల్లా చెప్పారు.భారతీయులు దాతలుగా ఈ వితరణ అందిస్తున్నారన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత విద్యను అభ్యచించలేని వారికి కూడా తమ పౌండేషన్ తరపున సాయం చేస్తామని చెప్పారు.ఈ సందర్భంగా మున్నంగికి చెందిన నర్సరీ నిర్వాహకులు వంగా మోహన్‌రెడ్డి అందించిన మొక్కలను పాఠశాలలో నాటారు.కార్యక్రమంలో సర్పంచ్ వేమూరు దీనమ్మ,వేమూరు కిషోర్,ఉపాధ్యాయులు వెంకాయమ్మ,శ్రీలక్ష్మి,నాగూర్,రాము,తల్లిదండ్రులు ఉన్నారు.

## పరిపాలనాధికారిగా చరణ్ కిషోర్‌కుమార్



కొల్లిపర,అక్టోబరు 16 ప్రభాతవార్త: మండల కేంద్రం కొల్లిపర మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా గురువారం చరణ్ కిషోర్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈయన రేపల్లెలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రమోషపై కొల్లిపర ప్రజా పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా వచ్చారు.

## వరుస దొంతనాల కేసులో దొంగ దొరికాడు..!!



కొల్లిపర,అక్టోబరు 16 ప్రభాతవార్త: దొంగతనాలకు పాల్పడుతున్న షేక్ శేషావలిని పట్టుకున్నామని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.గురువారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 12,13 వ తేదీలలో కొల్లిపరలో రాత్రి వేళల్లో వరుస దొంగతనాలు జరగటంతో కొల్లిపర చెందిన గ్రామస్తులు జొన్నల జాన్‌రెడ్డి,చల్లా వెంకటపుల్లారావు, తీయగూర విద్యాసాగర్‌రెడ్డిలు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందన్నారు.దొంగతనం చేసిన వ్యక్తి షేక్ శేషావలిగా గుర్తించటంతో అతని ఇంటి వద్ద అరెస్టు చేసి దొంగిలించిన వస్తువులు ల్యాబ్‌టాప్,ఫోన్,వాచ్,సిల్వర్‌రింగ్,బ్రాస్‌లైట్‌ను దొంగతనం చేయటానికి ఉపయోగించిన వస్తువును సీజ్ చేసి గురువారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
... విశ్వాసానికి మరో పేరు !
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అస్సెట్ రికవరీ మోనిటరింగ్ బ్రాంచ్ : వైజాగ్,
డి.నెం. 9-13-45/2/9/1, 5వ అంతస్తు, ఎమ్‌వివిఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, వివిపి రోడ్డు, విశాఖపట్నం - 530003.
మొబైల్: 9831200669, 9640933383

ఉద్దేశించిన అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8(6) ప్రకారం

తేది : 14-10-2025
ప్రదేశం : విశాఖపట్నం
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

## 19న "మట్టి రంగు" పుస్తకావిష్కరణ సభ



బాపట్ల,అక్టోబర్16,ప్రభాతవార్త: ప్రముఖ కవయిత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత డా. చిల్లర భవానీ దేవి రచించిన మట్టి రంగు కవితా సంపుటి పుస్తకావిష్కరణ మహోత్సవము ఈనెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక హోటల్ గౌతం వేదిక హాలు నందు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడునని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ సాహితీ వేత్తగా విఖ్యాతినొందిన చిల్లర భవాని దేవి రచించిన ఈ 59 వ పుస్తక పుస్తకావిష్కరణ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ప్రముఖ రచయిత్రి వెలువోలు నాగరాజ్యలక్ష్మి సభాధ్యక్షత వహిస్తారన్నారు. ప్రముఖ సాహితీ విమర్శకులు డా. బీరం సుందరరావు పుస్తక పరిచయాన్ని చేస్తారన్నారు. ఆత్మీయ అతిథిగా ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పి.సి. సాయిబాబు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితి పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డా. అప్పాజోస్యుల సత్యనారాయణకు డా. భవానీ దేవి కుటుంబ సభ్యులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## ఏఐపై నేడు అవగాహన సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు16, ప్రభాతవార్త: వర్సిటీలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం టెక్నలాజికల్ అడ్వాన్సెస్ ఇన్ ఏఐ: కంప్యూటింగ్, కమ్యునికేషన్స్ అండ్ కంజ్యూమన్ ఎలక్ట్రానిక్స్ ఫర్ సొసైటల్ బెనిఫిట్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు తెలిపారు. ఈ సదస్సుకు యుఎస్ఏ లోని వాషింగ్టన్ డి.లో ఉన్న జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఆర్.సుబ్రహ్మణ్యం కీలకవక్తగా పాల్గొంటారని చెప్పారు.

**సిఎస్ఆర్ ఆద్వర్యంలో అవగాహన కార్యక్రమాలు**

వర్సిటీలోని కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబులిటీ ఆధ్వర్యంలో వర్సిటీ పరిసర ప్రాంతాల్లో ఆహారబద్రత, పౌష్టికాహార లోపంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సిఎస్ఆర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బి.బబిత అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యం.వి.రమణ, ఫుడ్‌సన్స్ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్‌గా తేజోమూర్తి



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,అక్టోబరు16, ప్రభాతవార్త: ఏఎన్‌యు ఫార్మసూటికల్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కె.తేజోమూర్తి నియమితులయ్యారు. ఈనెల 13న ఆయన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఫార్మశీ కళాశాలకు ప్రొఫెసర్ నియామకం కోసం జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి జూలై 19న ఇంటర్వ్యూలు నిర్వహించారు. అప్పట్లో ఈ పోస్టులప భిన్నాభిప్రాయాలు వచ్చాయి. నిబంధనలు పాటించలేదని, అర్హులను కాదని, ఒక పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చి రెండు పోస్టులు భర్తీ చేశారని ఆరోపణలు వచ్చాయి. వాటిపై దృష్టిసారించకుండా అధికారులు అనుకున్నట్లు ప్రొఫెసర్ ఉద్యోగాలు ఇచ్చేశారు. ప్రొఫెసర్ ఉద్యోగాలతో పాటు వెంటనే ఒకరికి ప్రిన్సిపాల్, మరొకరికి డీన్ పదవి ఇవ్వడం వర్సిటీలో చర్చనీయాంశమైంది. కాగా కళాశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని నూతన ప్రిన్సిపాల్ తేజోమూర్తి పేర్కొన్నారు.

## కెఎల్‌యు లో ఉచిత దంత వైద్యశిబిరం



తాడేపల్లి,అక్టోబర్ 16,ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్,యూత్ రెడ్‌క్రాస్,కాలేజీ ఆఫ్ ఫార మ్రసీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు డీన్ స్టూడెంట్ ఆఫైర్స్ డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్ తెలిపారు.విజయవాడకు చెందిన భరణి డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ సిఎల్‌వి కిరణ్‌కుమార్,డాక్టర్ నికిత కామటి వైద్యసేవలు అందించారు.యూనివర్సిటీలోని అధ్యాపకులు,సిబ్బంది,విద్యార్ ్థని విద్యార్థులు భవననిర్మాణ కారి ్మకులు తదితరులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు,సలహాలు అందజేశారు.వైద్యశిబిరాన్ని డీన్ స్టూ ్డెంట్ అఫైర్స్ సలహదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ ప్రారంభించి,మాట్లాడుతూ యూనివర్సిటీలోని అధ్యాపకులు,సిబ్బంది,కారి ్మకుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.శిబిరానికిఅసోసియేట్ డీన్,ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్‌కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య,యూత్‌రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.సుప్రియ,లిబరల్ ఆర్ట్ ్స ప్రొఫెసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆర్.సుధాకర్‌రాజు పర్యవేక్షించగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్ట్ ర్ జి.పార్థసారథి వర ్మ,ప్రొఫెసర్ వైస్ చాన ్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్,ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ కలాం జయంతి



తాడేపల్లి,అక్టోబర్ 15,ప్రభాతవార్త : భారత శాస్త్రవేత్త,రాజకీయ నాయకునిగా మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ది ఇండియా గా గొప్ప ఖ్యాతి గడించిన డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలాం కు ఏపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ కొనియాడారు.అక్టోబర్ 15 అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో పలువురు బిసి నాయకులు డాక్టర్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ కలాం జయంతి వేడుకల్లో నియోజకవర్గ ఉపాధ్యక్షులు ధనుంజయ్,యువజన అధ్యక్షులు ఆలా శివాజీ,రామారావు నాగేశ్వరరావు శివ వెంకన్న పలువురు బిసి నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## 18న కెఎల్ శాటిలైట్ ప్రయోగానికి సర్వం సిద్ధం



తాడేపల్లి,అక్టోబర్ 16,ప్రభాతవార్త : వినూత్నమైన పరిశోధనలతో ఎన్నో సృజనాత్మక ఆవిష్కరణలు చేపట్టిన కెఎల్ యూనివర్సిటీ విద్యార్థులు సరికొత్త విజా ్ఞనం,ఆలోచనలతో శాటిలైట్ ప్రయోగానికి శ్రీకారం చుట్టారు.కెఎల్ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన 34మంది విద్యార్థులు రూపొందించిన 3రకాల శాటిలైట్స్‌ను అక్టోబర్ 18 ఉదయం 5.30నుంది 8గంటల మధ్యలో ప్రయోగించనున్నారు.పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తక్కువ ఖర్చుతో అంతరిక్ష పరిశోధనలను విజయవంతంగా నిర్వహించి భారతదేశం ఖ్యాతిని ప్రపంచంలో గొప్ప ఖ్యాతిని పొందింది.అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం,కమ్యూనికేషన్ రంగాల్లో ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.కెఎల్‌యు సొంత టెక్నాలజీతో ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన చిన్న తరహా ఉపగ్రహ ప్రయోగం చేయబోతున్నామని వీసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు.భూమినుండి సుమారు 12-13కిమీ ఎత్తులో ఉంటూ 800కిమీ దూరం ప్రయాణిస్తూ వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశోధనలు చేయడానికి కెఎల్ శాట్ పేరుతో అన్ని రకాల అనుమతులు తమకు వచ్చాయన్నారు.ఈ మిషన్‌కు పూర్వ డైరెక్టర్,చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ గా పూర్వ డాక్టర్ కె.శరత్‌కుమార్ వ్యవహరిస్తుండగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ పూర్వవిద్యార్థుల విభాగ డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్ శ్రీకావ్య వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఈ మొత్తం ప్రాజెక్టుకు కెఎల్‌ఈఎఫ్ చైర్మన్ కోనేరు సత్యనారాయణ సర్వర్గం నిధులు సమకూర్చారని తెలిపారు.ఈ సందర్భంగా ఉపగ్రహానికి రూపకల్పన చేసిన బృంద సభ్యులను,విద్యార్థులను వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ,వీసి డాక్టర్ జి.పార్థసారథివర్మ,ఆచార్య వీసి డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, పరిశోధన,అభివృద్ధి డీన్ డాక్టర్ బిటిపి మాధవ్ అభినందించారు.అన్ని విభాగాల డీన్లు,డైరెక్టర్లు,విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో అవకతవకలపై సంతకాల సేకరణ



మంగళగిరి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త: ఓటర్ల జాబితా లో అవకతవకలపై న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల నాయకత్వంలో మంగళగిరి నియోజకవర్గంలో సంతకాల ఉద్యమం విజయవంతం గా నిర్వహించామని నియోజవర్గ పార్టీ ఇంచార్జి షేక్ సలీం తెలియజేశారు. మంగళగిరి నియోజకవర్గం లో ఒక్క నెల రోజుల్లో సెప్టెంబరు 15 నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు మంగళగిరి పట్టణం, మండలం, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో ఈ సంతకాల ఉద్యమాన్ని చేపట్టామన్నారు. నెలరోజుల పాటు సంతకాల సేకరణ కార్యక్రమం కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడికొండ వెంకటేశ్వరరావు, గుంటూరు పార్లమెంట్ ఇంచార్జి శ్రీపతి ప్రకాష్, జిల్లా అధ్యక్షులు చిలక విజయ్ కుమార్, జిల్లా కాపు సంఘం డైరెక్టర్ రెమిడిశెట్టి హనుమంతరావులకు షేక్ సలీం ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలోని మంగళగిరి మండల పార్టీ అధ్యక్షులు కె. కృష్ణ చౌదరి , తాడే పల్లి మండల అధ్యక్షులు సుభాని, పట్టణ అధ్యక్షులు శామ్యూల్, దుగ్గిరాల మండల అధ్యక్షులు నెమలి కంటి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నెమలికంటి ఉషమ్మ ,ఇంకా నియోజవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, సంతకాల ఉద్యమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఇంచార్జ్ సలీం కృతజ్ఞతలు తెలియజేశారు.

## సర్వీస్ రోడ్డుపై గుంతలు!



మంగళగిరి, అక్టోబర్ 16 ప్రభాతవార్త: జాతీయ రహదారి పై ఉన్న టోల్గేట్ నుంచి కాజ గ్రామంలోకి రాక పోకలు సాగించే సర్వీస్ రోడ్డు గుంతల మయంగా మారింది. కాజ గ్రామం నుండి టోల్గేట్ వైపునకు చేరుకునే సర్వీసు రోడ్డు పై భారీగా గుంతలు దర్శనమిస్తున్నాయి. వరద పడితే ఆ గుంతల్లో నీరు నిలవడంతో వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.ఈ ప్రాంతంలో లైట్లు కూడా వెలగడం లేదని, రాత్రుళ్లు ఇబ్బందిగా ఉంటోందని లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**..సమస్య పరిష్కరించాలి:కంకణాల శంకర్**

కాజ గ్రామంలోకి చేరుకునే సర్వీస్ రోడ్డు గుంతల మయంగా మారింది. నీళ్లు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డుపై లైట్లు వెలగటం లేదు.ఇప్పటికే ఈ సమస్యపై నేషనల్ హైవే, మంగళగిరి కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ పరిష్కరించలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి గుంతలను పూడ్చడంతో పాటు లైట్లను ఏర్పాటు చేయాలని జనసేన నియోజకవర్గం కంకణాల శంకర్ అధికారులను కోరారు

## పాత కోటయ్యస్వామి గుడికి మెట్ల మార్గం ఏర్పాటు చేస్తాం : కలెక్టర్



నరసరావుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : రాబోయే ఆరు నెలల్లో పాత కోటయ్య స్వామి గుడి వద్దకు మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలియజేశారు. గురువారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండను కలెక్టర్ కృతికాశుక్లా అధికారులతో కలిసి దర్శించుకున్నారు. త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎకో పార్కును, చిల్డ్రన్ పార్కును, నగర వనాలను పరిశీలించారు. రానున్న కార్తీకమాసం, సంక్రాంతి, శివరాత్రి వంటి పర్వదినాలను పురస్కరించుకొని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కోటప్పకొండను ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకంగానూ అభివృద్ధి చేస్తామని కలెక్టర్ కృతికాశుక్లా తెలియజేశారు. తొలుత వారికి ఆలయ ధర్మకర్త రామకృష్ణకొండలరావు బహదూర్, ఈవో చంద్రశేఖరరావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణప్రియ, ఆర్డీవో మధులత, దేవాదాయశాఖ అధికారులు ఉన్నారు.

## ప్రధాని మోడీ సభ విజయవంతం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభ, కర్నూలు పర్యటన విజయవంతమైందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ప్రధానమంత్రి పాల్గొన్న సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం, బిజెపి, జనసేన ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు లక్షల సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను అనుసరిస్తూ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామివారిని దర్శించుకోవడం, పూజలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించి యువతలో మంచిని పెంపొందించే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారని తెలియజేశారు. ఈ పర్యటనలో రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రధాని మోడీ తన ప్రసంగంలో చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని ప్రశంసించారని తెలిపారు. ఢిల్లీ, అమరావతి కలిసి పని చేస్తే డబల్ ఇంజన్ ప్రభుత్వ సహకారంతో ఏపి ప్రగతిపథంలో దూసుకెళ్తుందన్నారు. భారత్ 11వ స్థానం నుండి 4వ స్థానానికి ప్రపంచంలో నిలిపేందుకు ఏపి వంటి రాష్ట్రాలు దేశంలో ఉండటం వలన సాధ్యమైందన్నారు. 15 ఏళ్ళ పాటు కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని ప్రధాని ప్రకటించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు.

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రానికి ఒరిగేది శూన్యం : డాక్టర్ గోపిరెడ్డి




నరసరావుపేట, అక్టోబర్ 11 ప్రభాతవార్త : విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో రాష్ట్రానికి ఒరిగేది శూన్యమని జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూగుల్ డేటా సెంటర్ కేవలం 200 ఉద్యోగాలను మాత్రమే ఇస్తుందన్నారు. వీరికి చంద్రబాబు ప్రభుత్వం రూ.22 వేల కోట్ల రాయితీ ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన గొప్పలు గూగుల్ డేటా సెంటర్‌లో ఆదాని, ఎయిర్‌టెల్ కలిసి ఉన్నట్లు గుర్తు చేశారు. డేటా సెంటర్ అంటే ఒక గోడౌన్ లాంటిదని తెలిపారు. ఇటువంటి గూగుల్ డేటా సెంటర్లు తమకు వద్దని ఐర్లాండ్, లెదర్లాండ్ వంటి దేశాలు నిరాకరించాయన్నారు. తెలంగాణలో అక్కడి ప్రభుత్వం గూగుల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువచ్చిందని, దాని వలన 15 వేల ఉద్యోగాలు ఆ రాష్ట్రానికి లభించాయన్నారు. ఇటువంటి తెలివితక్కువ నిర్ణయాలతో రాష్ట్రానికి, నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తుందన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో వైకాపా గతంలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు సంబంధించి డబ్బులు వసూలు చేశామని అబద్దాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉప్పలపాడు గ్రామ సమీపంలో వెంచర్‌లో అవినీతి జరిగిందని అర్థంపర్థం లేని ఆరోపణలు చేసిన అధికారపార్టీ నాయకులు 20 నెలలు కావస్తున్నా అవినీతికి ఎందుకు బయట పెట్టలేదన్నారు. టిడ్కో ఇళ్ళ వద్ద రూ.14 కోట్లలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, 64 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి వైకాపా ప్రభుత్వం 600 మందికి ఇంటి తాళాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నాయకులు తాము ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సబ్‌స్టేషన్‌లు కొత్తవి తాము తెస్తే అప్పటి ఉద్యోగులు ఇప్పుడు తొలగించి కొత్తవారిని పెట్టడం దారుణమన్నారు. నకిలీ మద్యం కేసుకు సంబంధించి ధర్నాలు చేస్తే 22 మందిపై కేసులు పెట్టారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## గ్రీన్ కార్డులను అందజేసిన ఎంపిడివో కృష్ణకుమారి



నరసరావుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం గ్రీన్ అంబాసిడర్లకు ఎంపిడివో టి.వి.కృష్ణకుమారి 92 మందికి గ్రీన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ థీమ్-5 పచ్చదనం - పరిశుభ్రత కలిగిన గ్రామంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఒక్క శిక్షణా కార్యక్రమంలో ప్రతి రోజూ గ్రామంలో జరిగే చెత్త సేకరణ సంపద కేంద్రం వద్ద తీసుకునే చర్యలను తెలియజేయడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ రథానికి సంబంధించి పలు అంశాలను వివరించామన్నారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలను ఖచ్చితంగా తమ గ్రామాలలో అమలు చేయాలని ఈ సందర్భంగా ఎంపిడివో టి.వి.కృష్ణకుమారి సూచించారు.

## టిడిపి నాయకునికి డాక్టర్ చదలవాడ ఆదిత్య నివాళి



రొంపిచర్ల, అక్టోబర్ 16 ప్రభాతవార్త : మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు మంజుల ఆంజనేయులు ఆకస్మికంగా కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న తెలుగుదేశంపార్టీ యువ నాయకులు డాక్టర్ చదలవాడ ఆదిత్య గ్రామానికి చేరుకొని ఆంజనేయులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆంజనేయులు మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే విధంగా పార్టీకి ఆంజనేయులు ఎన్నో సంవత్సరాలుగా అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తరపున ఈ కార్యక్రమంలో పాల్గొని మంజుల ఆంజనేయులు కుటుంబసభ్యులకు డాక్టర్ చదలవాడ ఆదిత్య ధైర్యం చెప్పారు.

## ఈశ్వర్ కళాశాలలో క్యూస్పైడర్ ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట, అక్టోబర్ 16 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్యూస్పైడర్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. వివరాలను కళాశాల చైర్మన్ షేక్.మీరావలి, కార్యదర్శి



కరీమ్, డైరెక్టర్ షరీఫ్‌లు తెలియజేశారు. కంపెనీ ప్రతినిధులు తేజస్విని, నిఖిత తమ సంస్థకు సంబంధించిన విధి విధానాలను వివరించారు. మొత్తం 214 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 21 మంది విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా నియమిస్తున్నట్లు వారు తెలిపారు. వారికి వార్షికి వేతనం రూ.5.50 లక్షలు ఉంటుందన్నారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్.నజీమా, కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేసింది.

## ప్రజల ఆశలు.. ఆకాంక్షలు నెరవేర్చే నియోజకవర్గ భవిష్యత్ ప్రత్తిపాటి శరత్ : టీడీపీ నేతలు

చిలకలూరిపేట, అక్టోబరన 16, ప్రభాతవార్త: తండ్రి తగ్గ తనయుడిగా ప్రజాసేవలో రాణిస్తూ.. సాంకేతిక పరిజ్ఞానం.. వినూత్న ఆలోచనలతో నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తూ తనదైన శైలిలో జనం మెచ్చే నిబద్ధత కల భావి నాయకుడిగా ప్రత్తిపాటి శరత్ రాణిస్తున్నారని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కొనియాడారు. ఎప్పటికైనా ఆయన నియోజకవర్గ ప్రజల ఆశలు..ఆకాంక్షలు.. ఆశయాలు నెరవేర్చే భవిష్యత్ ప్రతినిధిగా నిలుస్తారని వారు తెలిపారు.గురువారం తమ అభిమాన యువనాయకుడి పుట్టినరోజుని పురస్కరించుకొని వారు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో శరత్ బాబు జన్మదినాన్ని ప్రజల సమక్షంలో పార్టీశ్రేణులు పండుగలా నిర్వహించారు. దానిలో భాగంగా గురువారం పట్టణంలోని అనాద శ్రమాలు, అన్నాక్యాంటీన్లలో తొలుత కేక్ కట్ చేసిన కూటమి పార్టీల ప్రధాన నాయకులు, అనంతరం అన్నదానం నిర్వహించారు. టీడీపీ యువజన విభాగం నేతలు, సభ్యులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ..గత ప్రభుత్వం శరత్ బాబుని వ్యక్తిగతంగా టార్గెట్ చేసి, తప్పుడుకేసులతో ఇబ్బంది పెట్టిందన్నారు. మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుని నేరుగా ఎదుర్కొనే ధైర్యంలేకనే నాటి పాలకులు ఆయన కుమారుడిని ఇబ్బంది పెట్టి, శునకానందం పొందారని నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు కేసులు... తప్పుడు ఆరోపణలతో చివరకు ఏమీ సాధించలేకపోయారని, నిజాయితీ.. నిబద్ధత.. నిర్భయత్వం అనేవి ప్రత్తిపాటి పుల్లారావు, ప్రత్తిపాటి శరత్ బాబుల రక్తంలోనే ఉన్నాయన్నారు.



**గూగుల్ ఒప్పందాన్ని స్వాగతిస్తూ..**

గూగుల్ ఏఐ హబ్.. డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్ర సాంకేతిక రంగంలో నూతన అధ్యాయమని, దాని సాకారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేసిన కృషి అసామాన్యమని నియోజకవర్గ ఐటీడీపీ, తెలుగుయువత విభాగాలు అభిప్రాయపడింది. గూగుల్ తో రాష్ట్రప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. ప్రత్తిపాటి శరత్ బాబు జన్మదినంలో భాగంగా తెలుగుయువత, ఐటీడీపీ విభాగాలు క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, తమ ఆనందాన్ని వ్యక్తంచేశాయి. ఈ కార్యక్రమాల్లో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గట్టినేని విజయ్ సాయి, ఐటీడీపీ నాయకులు మరేళ్ల అప్పారావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగు మహిళా నాయకులు, టీడీపీ లో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి పీఠం జోగుళాంబను దర్శించుకున్న ప్రత్తిపాటి



చిలకలూరిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త: తెలంగాణ గద్వాల జిల్లా, అలంపురం గ్రామంలో వేంచేసియున్న శక్తి పీఠం జోగుళాంబ అమ్మవారిని, శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి వారినీ మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు , రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలు ఆలయ అర్చకులు అందజేశారు.

## ఇస్రో ఛైర్మన్ నారాయణన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న ఐఐటీ వారణాసి విద్యార్థి రవితేజ




చిలకలూరిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన రావు రవితేజ మెటలర్జీ మెటీరియల్ సైన్స్ ఎంటెక్ ఐఐటీ వారణాసి (BHU) మొదటి స్థానంలో నిలిచాడు.16102025 బుధవారం ఉదయం 10 గంటలకు వారణాసి ఐఐటీ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన కాన్వకేషన్లో ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్ చేతులు మీద బంగారు పతకం,ప్రశంసా పత్రం అందుకున్నాడు.కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకంత మజుందార్ విద్యార్థులను వీడియో కాల్ ద్వారా అభినందించారు. తీబీగే నుండి విశ్వ విద్యాలయం కులపతి అమిత్ పాత్ర, విభాగ అధిపతులు, తోటి విద్యార్థులు,తల్లిదండ్రులు రావు సుబ్రహ్మణ్యం,రామ తులసి అభినందనలు తెలిపారు .

## ఎంఇఒను కలిసిన ఎస్టీయు నేతలు



చిలకలూరిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారికి ఎస్టియుప్రాతినిధ్యం చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారి బి.సత్యనారాయణ సింగ్‌ను చిలకలూరిపేట మండల మరియు పట్టణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అకాడమిక్ కమిటీ నిర్మాణం చేయాలని, క్లస్టర్ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ మరియు మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లు అప్డేట్ చేయాలని ఉపాధ్యాయుల ఎరియర్ బిల్స్ సరెండర్ లీవ్ బిల్స్ ఏపీ జి యల్ ఐ సి బిల్స్ త్వరగా మంజూరు చేయాలని వేసవి సెలవుల్లో చేసిన సంపాదిత సెలవులను సర్వీస్ రిజిస్టర్లో నమోదు చేయాలని, 24 సంవత్సరాల స్కేల్ కోసం అప్లై చేసుకుని పెండింగ్ ఉన్న ఉపాధ్యాయునుల స్కేల్ వెంటనే మంజూరు చేయాలని సింగిల్ టీచర్ స్కూల్స్ నందు ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు సర్దుబాటు చేయాలని, డీఎస్సీ లో నూతనంగా ఉపాధ్యాయులు క్లస్టర్ లో వచ్చినందున విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలని, ,మండల విద్యాశాఖ అధికారి స్పందిస్తూ తక్షణమే ఈ సమస్యలు పరిష్కారం చేస్తానని తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా మున్సిపల్ ఉపాధ్యాయులు మండల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సమిష్టిగా మండల స్థాయిలో విద్యాశాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎస్టియూ పక్షాన తెలియజేయడం జరిగింది ఎస్టియు పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు ఎస్ టి యు చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంత రవి,ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్వలి.వి రమణ నాయక్, ఎస్టియు రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## 'గిరిజన పాఠశాల,వసతి గృహాలను ఖగిరిజన శాఖ మంత్రి సందర్శించాలి'



చిలకలూరిపేట, అక్టోబర్ 16, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్నటువంటి గిరిజన గురుకుల పాఠశాలలను, గిరిజన వసతి గృహాలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సందర్శించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ అన్నారు.గురువారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఆమె పరామర్శించారు. ఆ సందర్భంలో ప్రధానంగా మరుగుదొడ్ల వలన రోగాలు వ్యాపిస్తున్నాయని చెప్పడం జరిగింది. గత అసెంబ్లీ సాక్షిగా చిలకలూరిపేటలో ఉన్నటువంటి గిరిజన గురుకుల పాఠశాల, విద్యార్థులకు వసతిగృహని ఏర్పాటు చేయాలని చెప్పిన ఎందుకు చేయించడం లేదని పలు ప్రశ్నలు సంధించారు. గిరిజన పాఠశాల భవనానికి నిధులు ఎందుకు కేటాయించడంలేదో సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థుల మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించలేకపోయారని దుయ్యబట్టారు. పల్నాడు జిల్లాతో పాటు రాష్ట్రంలో ఉన్నటువంటి గిరిజన గురుకుల పాఠశాలలను, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రాజీనామా చేయాలన్నారు. రానున్న రోజుల్లో తమ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు.

## ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి యుగంధర్‌కు రాష్ట్రస్థాయిలో రజితం

నకరికల్లు, అక్టోబర్ 16 ప్రభాతవార్త : బాపట్ల జిల్లాలో జరుగుతున్న 10వ రాష్ట్ర సబ్ జూనియర్ డాడ్జిబాల్ ఛాంపియన్‌షిప్ 2025-26లో కళాశాలకు చెందిన ఎల్.యుగంధర్‌కు రజిత పతకం లభించింది. బాపట్ల జిల్లాలో రజిత పతకం సాధించడంతో పాటు అనేక పోటీలలో తమ విద్యార్థులు బహుమతులు తీసుకురావడం కళాశాలకు గర్వకారణంగా ఉందని వారు తెలిపారు. యుగంధర్‌ను వారు అభినందించారు. యుగంధర్‌ను అభినందించిన వారిలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి, పీడి వై.మధుసూదనరావు ఉన్నారు.

## నకిలీ మద్యం నిర్మూలనకు ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్

నరసరావుపేట క్రైం, అక్టోబర్ 16 ప్రభాతవార్త : నకిలీ మద్యం నిర్మూలనకు ఏపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను తీసుకువచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. నరసరావుపేటలోని డిస్ట్రిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ మద్యం గుర్తించే విధానం గురించి తెలియజేశారు. యాప్ వినియోగం, ప్రత్యేక టీముల ఏర్పాటు గురించి తెలియజేశారు. నకిలీ మద్యం గుర్తించేందుకు మద్యం సీసాపై సీల్ హోలోగ్రామ్ బార్ కోడ్ ఉంటుందన్నారు. వీటిని స్కాన్ చేస్తే ఎప్పుడు ఎక్కడ తయారైంది, ఏ దుకాణానికి సరఫరా అయ్యింది వంటి వివరాలు తెలుస్తాయన్నారు. నకిలీ మద్యం అని తేలితే 14405 అనే ట్రోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి సెల్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. షాపుల యజమానులు ఖచ్చితంగా క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయించాలన్నారు.

17-10Pg5 9_17-10Pg5.qxd 10/16/2025 11:52 PM Page 1



# ఈసారి గోవాలో ప్రధాని దీపావళి వేడుకలు



**పనాజి, అక్టోబరు 16:** ప్రతి సంవత్సరం దీపావళి వేడుకలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరిహద్దుల్లోని జవాన్లతో కలిసి జరుపుకుంటున్న విషయం తెలిసిందే. సైనిక దుస్తులు ధరించి ప్రతి ఏటా ఒక ప్రదేశంలో మోదీ ఈ వేడుకలను జరుపుకుంటూ వస్తున్నారు. జవాన్లకు స్వయంగా స్వీట్లు తినిపించి జాలీగా గుడుపుతుంటారు. అయితే, ఈ సారి గోవాలో దివాళి సెలబ్రేషన్స్ చేసుకోనున్నట్లు తెలిసింది. గోవాలోని నౌకాదళ సిబ్బంది తో ప్రధాని దీపావళి వేడుకలు జరుపుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. పహల్గాం దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో భారత్ సాధించిన విజయాన్ని నౌకాదళ సిబ్బందితో జరుపుకోనున్నట్లు పేర్కొన్నాయి. 2014లో ప్రధానిక పదవి చేపట్టినప్పటి నుంచి మోదీ సాయుధ దళాల సిబ్బందితో దీపావళిని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. 2014లో ఆయన లడఖ్‌లోని సియాచిన్ హిమానీనదానికి వెళ్లి అక్కడ గస్తీలో ఉన్న జవాన్లతో వేడుకలు జరుపుకున్నారు. 2015లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని డోగ్రాయ్ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించారు. అక్కడ 1965 ఇండోపాక్ యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. 2016లో హిమాచల్ ప్రదేశ్‌లోని సుమ్దోలోగల భారత్‌చైనా సరిహద్దు సమీపంలో భద్రతా దళం, సైనిక సిబ్బందిని కలిశారు. 2017లో జమ్ము కశ్మీర్‌లోని గురెజ్ సెక్టార్‌లో, 2018లో ఉత్తరాఖండ్‌లోని ఇండోటిబెటన్ బోర్డర్ పోలీసు సిబ్బందితోను, 2019లో జమ్ము కశ్మీర్‌లోని రాజౌరిలో గల సైనికులతోను దీపావళి వేడుకలు జరుపుకున్న మోడీ 2020లో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లోను, 2021లో జమ్ము కశ్మీర్‌లోని నౌషెరాలోను, 2022లో కార్గిల్, 2023లో చైనా సరిహద్దులోని లేప్చా (హిమాచల్‌ప్రదేశ్) సైనిక శిబిరంలో వేడుకలు చేసుకున్నారు. 2024లో కచ్‌లోని సర్ క్రీక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న సరిహద్దు భద్రతా దళం, ఆర్మీ, నేవీ, వాయుసేన సిబ్బందిని కలిసి వారితో వేడుకలు చేసుకున్నారు.

# గుజరాత్ రాజకీయాల్లో భారీ కుదుపు

## కేబినెట్ మొత్తం రాజీనామా.. ఆమోదించిన గవర్నర్

## నేడు రాజ్‌భవన్‌లో కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం

## తాజా కేబినెట్‌లో క్రికెటర్ జడేజా భార్యకు ప్రమోషన్!



**అహ్మదాబాద్, అక్టోబరు 16:** గుజరాత్ రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్యపరిణామాలు. రాష్ట్రంలో కొత్త కేబినెట్ శుక్రవారం కొలువు దీరనుంది. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన 16 మంది మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు మార్గం సులువు చేసేందుకు మంత్రులు రాజీనామాలుచేసారు. గత కొన్ని రోజులుగా కేబినెట్ విస్తరణ ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ నివాసంలో మంత్రులు సమావేశం అయ్యారు. బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ రాజీనామాలు అంగీకరించారు. అనంతరం గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాజీనామాలు అందజేయగా ఆయన ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం కొత్త కేబినెట్ కొలువుదీరనుంది. గుజరాత్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన మంత్రులు అంతా తమ పదవులకు రాజీనామా చేశారు. గత కొంతకాలంగా గుజరాత్‌లో కేబినెట్ విస్తరణ ఉంటుంది అని అంతా భావించారు. అయితే దీపావళి పండుగకు ముందే ఈ విస్తరణ ఉంటుందని ఊహించ లేదు. ఈ విస్తరణలో కొత్త ము ఖాలు, యువ నాయకులు, ప్రాంతీయసామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఓబిసి పాటిదార్ సమతుల్యత, సౌరాష్ట్రఉత్తర గుజరాత్ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు రవీంద్ర జడేజా భార్య, జామ్‌నగర్ ఎమ్ఎల్ఏ రీవా జడేజాకు కేబినెట్ ర్యాంక్ ప్రమోషన్ ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతుంది. అలాగే ప్రస్తుతం రాజీనామా చేసిన మంత్రుల్లో కొందరికి కొత్త కేబినెట్‌లో ఛాన్స్ ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా ఈ విస్తరణ జరుగుతోంది. ఎందుకంటే 2027లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మధ్యలో మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జగదీష్ విశ్వకర్మ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2027 అసెంబ్లీ ఎన్నికలు, లోకల్ బాడీ పోల్స్‌కు ముందుగా పార్టీ బలాన్ని పెంచే ఉద్దేశ్యంతో ఈ కేబినెట్ విస్తరణ జరుగుతుంది అని తెలుస్తోంది. ప్రస్తుత మంత్రివర్గం ముఖ్యమంత్రి సహా 17 మందితో ఉన్నారు. గుజరాత్ చరిత్రలో అతి చిన్న మంత్రివర్గం ఇదే కావడం విశేషం. 182 సభ్యుల శాసనసభ పరిధిలో 27 మంది వరకు మంత్రులు ఉండవచ్చు. కానీ 17 మందితోనే మంత్రివర్గం ఏర్పడింది. మంత్రివర్గంలో ఈసారి దాదాపు 10 మంది కొత్త వారికి అవకాశం లభించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో దాదాపు సగం మందిని మార్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో ముఖ్యమంత్రితో సహా మొత్తం 17 మంది మంత్రులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది క్యాబినెట్ ర్యాంకు మంత్రులు కాగా మిగిలిన వారు సహాయ మంత్రులుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సారి 22 నుంచి 27 మందికి మంత్రులకు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాజ్ భవన్‌లో శుక్రవారం నూతన మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేయనుంది.

ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం విస్తరించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు అధ్యక్షుడు జెపీ నడ్డా, అమిత్ షా, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సీ.ఆర్. పాటిల్, ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ వంటి సీనియర్ నేతలు హాజరవుతారు.

# యెమెన్‌లో నిమిషప్రియ హత్యకేసులో స్టే కొనసాగుతోంది

## సుప్రీంకోర్టుకు నివేదించిన కేంద్రం



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యెమెన్ మరణశిక్షను ఎదుర్కొంటున్న భారత నర్సు నిమిష ప్రియకు శిక్ష అమలుపై స్టే కొనసాగుతున్నదని గురువారం కేంద్రం సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎలాంటి తీవ్ర పరి ణామాలు చోటుచేసుకోకపోవడం గమనార్హమని పేర్కొంది. భారతీయ నర్సు నిమిష ప్రియను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యమార్గాలను ఉపయోగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారిస్తోంది. తాజాగా ఆ మరణశిక్ష గురించి ప్రశ్నించింది. ఆమెకు చట్టపరమైన సహకారం అందిస్తున్న 'సేవ్ నిమిషప్రియ ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్' తరఫు న్యాయవాది స్పందిస్తూ శిక్ష అమలుపై స్టే కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ వెంకట రమణి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కేసులోకి కొత్త మధ్యవర్తి వచ్చారని, ఇప్పటివరకు ఈ కేసులో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకోక పోవడం మంచి విషయమని అన్నారు. వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం కేసును జనవరికి వాయిదా వేసింది. అయితే ఏవైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ముందస్తు లిస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కాగా నిమిష ప్రియ నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన తర్వాత 2008లో యెమెన్ వెళ్లి అక్కడే ఉద్యోగంలో చేరారు. ఆ దేశ నిబంధనల ప్రకారం స్థానిక వ్యక్తి తలాల్ అదిబ్ మెహది భాగస్వామ్యంతో అల్‌అమన్ మెడికల్ కౌన్సిల్ సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత ఆ వ్యక్తి ప్రియను వేధించి, పాస్‌పోర్ట్, ఇతర పత్రాలను లాక్కొన్నాడన్న ఆరోప ణలు ఉన్నాయి. 20 16లో అతడిపై ప్రియ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. వారు ఆమెను పట్టించుకోలేదు. దాంతో 2017లో మెహదికి మత్తుమందు ఇచ్చి అతడి వద్ద ఉన్న తన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవాలని భావించింది. కానీ ఆ డోస్ ఎక్కువకావడంతో అతడు చనిపోయాడు. ఆ తర్వాత మృతదేహాన్ని ఓ వాటర్ ట్యాంక్‌లో పారేసింది. చివరికి అక్కడినుంచి సౌదీకి వెళ్లిపోతుండగా సరిహద్దుల్లో ఆమెను అరెస్టు చేసి మరణశిక్ష విధించారు. భారత ప్రభుత్వం, మత పెద్దల ప్రయత్నాలతో ప్రస్తుతం ఆమె ఉరిశిక్ష స్టే కొనసాగుతోంది.

## కోర్టు హాలులో ఆన్‌లైన్‌లోనే మహిళకు కిస్ ఇచ్చిన లాయర్!


**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** న్యాయస్థానంలో వృత్తిగత హుందాతనాన్ని ప్రదర్శించాల్సిన ఓ న్యాయవాది అనుచితంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీ హైకోర్టులో ఓ కేసు వర్చువల్ విచారణ సందర్భంగా కెమెరా ఆన్‌లో ఉండగానే ఆయన ఓ మహిళను ముద్దుపెట్టుకోవడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సదరు లాయర్ తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆన్‌లైన్ విచారణ కోసం అందరూ లాగిన్ అయి న్యాయమూర్తి రాక కోసం ఎదురుచూస్తున్న సమయంలో కోర్టు దుస్తుల్లో ఉన్న ఆ లాయర్, తన కెమెరాకు కొద్దిగా పక్కకు కూర్చుని ఉన్నారు. ఆ సమయంలోముందు నిల్చుని ఉన్న మహిళ చేతిని ముద్దుపెట్టడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది.

# మత్తుమందిచ్చి డాక్టర్ భార్యను హత్యచేసిన వైద్యుడు



**బెంగళూరు, అక్టోబరు 16:** వైద్య వృత్తిని అడ్డం పెట్టుకుని, కట్టుకున్న భార్యను హతమార్చిన ఓ వైద్యుడి కిరాతకం బెంగళూరులో వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించినా, ఆరు నెలల తర్వాత ఫోరెన్సిక్ నివేదిక అసలు నిజాన్ని బయటపెట్టడంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రిలో జనరల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ మహేంద్ర రెడ్డి, డెర్మటాలజిస్ట్ అయిన డాక్టర్ కృతిక రెడ్డి భార్యాభర్తలు. వీరికి గత ఏడాది మే 26న వివాహం జరిగింది. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ 21న మున్నెకొల్లాల్‌లోని వారి నివాసంలో కృతిక అస్వస్థతకు గురయ్యారని చెబుతూ ఆమె భర్త మహేంద్ర రెడ్డే దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మరాఠహళ్లి పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో క్రైమ్ ఆఫీసర్లు తనిఖీ చేయగా, ఓ కానిలా సెట్, ఇంజెక్షన్ ట్యూబ్ వంటి వైద్య పరికరాలు లభించాయి. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు. మృతురాలి అంతర్గత అవయవాల నమూనాలను కూడా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎఫ్ఎస్ఎల్ నివేదికలో కృతిక శరీరంలో ప్రోపోఫాల్ అనే శక్తిమంతమైన అనస్థీషియా (మత్తు) మందు ఆనవాళ్లు ఉన్నట్లు తేలింది. దీంతో ఇది హత్యేనని నిర్ధారణ కావడంతో మృతురాలి తండ్రి అక్టోబర్ 13న తన అల్లుడే మత్తుమందు ఇచ్చి కూతురిని చంపాడని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వేగంగా స్పందించి, అక్టోబర్ 14న కర్ణాటకలోని మణిపాల్‌లో ఉన్న నిందితుడు మహేంద్ర రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భార్యను ఆసుపత్రికి తీసుకొచ్చిన భర్త, ఆమెకు మత్తు మందు ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టాడు. ఆమె ఆరోగ్యం బాగోలేదని మాత్రమే చెప్పాడు. ఇప్పుడు ఆమె శరీరంలో మత్తుమందు ఆనవాళ్లు బయటపడటంతో, ఇందులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమైంది. ఈ కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నాం అని తెలిపారు. ప్రస్తుతం నిందితుడు పోలీస్ కస్టడీలో ఉన్నాడు. వైద్య పరిజ్ఞానాన్ని ఉపయోగించి హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటన వైద్య వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

# చిన్నారుల యాంటిబయాటిక్ సిరప్‌లో పురుగులు



**భోపాల్, అక్టోబరు 16:** ప్రభుత్వ ఆసుపత్రిలో ఇచ్చిన పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించాయి. ఇది చూసి ఒక చిన్నారి తల్లి షాక్ అయ్యింది. ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ సిరప్ స్టాక్‌ను సీజ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఒక చిన్నారిని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తల్లి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్, అజిత్రోమైసిన్ యాంటీబయాటిక్ సిరప్ సూచించగా ఆసుపత్రి సిబ్బంది ఆ మందు ఇచ్చారు. ఇంటికి చేరుకున్న తర్వాత చిన్నారికి మందు వేసేందుకు అజిత్రోమైసిన్ సిరప్ మూతను ఆ మహిళ తెరిచింది. ఆ యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించడంతో ఆమె షాక్ అయ్యింది. వెంటనే ఆ సిరప్ బాటిల్ తీసుకుని మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. తెరిచిన అజిత్రోమైసిన్ సిరప్ బాటిల్‌ను ఆసుపత్రికి సిబ్బందికి చూపించింది. ఈ సంఘటన కలకలం రేపింది. మరోవైపు ఈ విషయం తెలిసిన వెంటనే డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని ఒక ఔషధ కంపెనీ ఆ అజిత్రోమైసిన్ సిరప్ తయారు చేసినట్లు తెలిపారు. మోరార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి సరఫరా చేసిన ఆ యాంటీబయాటిక్ సిరప్ బాటిల్స్‌లో స్టాక్ ఉన్న 306 బాటిళ్లను రీకాల్ చేసినట్లు చెప్పారు. కొన్ని సిరప్ బాటిల్స్ పరిశీలించగా వాటిలో పురుగు అవశేషాలు లేవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుభూతి శర్మ తెలిపారు. అయితే టెస్టింగ్ కోసం కొన్ని మందు సీసాలను భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ ఔషధం నమూనాలను కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ లాబొరేటరీకి కూడా పంపనున్నట్లు ఆమె వెల్లడించారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ వల్ల కిడ్నీలు పాడైన కారణంగా 24 మంది పిల్లలు మరణించారు. మరింత మంది అనారోగ్యం పాలయ్యారు. ఈ సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో తాజాగా పిల్లల యాంటీబయాటిక్ సిరప్‌లో పురుగులు కనిపించిన సంఘటన ఆందోళన కలిగిస్తున్నది.

# పాక్ సైనిక దుస్తులను బహిరంగ ప్రదర్శనకు పెట్టిన తాలిబన్లు!




**కాబూల్, అక్టోబరు 16:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. సరిహద్దుల్లో భీకర ఘర్షణల నేపథ్యంలో, పట్టుబడిన పాకిస్థాన్ సైనికుల ప్యాంట్లు, రైఫిళ్లను ఆఫ్ఘన్ సైనికులు, తాలిబన్ అనుబంధ మిలీషియా సభ్యులు ఆఫ్ఘన్ నగర వీధుల్లో ప్రదర్శిస్తూ అవమానపరిచారు. కార్ల మీద నిలబడి, స్వాధీనం చేసుకున్న వస్తువులను ప్రదర్శిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా తూర్పు నంగర్‌హార్ ప్రావిన్స్‌లో ఈ ప్రదర్శన జరిగినట్లు ఆఫ్ఘన్ జర్నలిస్ట్ దావూద్ జున్‌బిష్ 'ఎక్స్' వేదికగా ఒక ఫొటోను పంచుకున్నారు. "డ్యూరాండ్ లైన్ వద్ద పాకిస్థాన్ సైన్యం విడిచిపెట్టిన సైనిక పోస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఖాళీ ప్యాంట్లను ప్రదర్శించారని ఆయన ఆ ఫొటోకు క్యాప్షన్ జతచేశారు. ఈ వీడియోల ప్రామాణికతను స్వతంత్రంగా ధ్రువీకరించలేనప్పటికీ, ఇవి ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్రమైన వైషమ్యాలకు అద్దం పడుతున్నాయి. ఆశ్చర్యకరంగా, ఇరు దేశాల మధ్య బుధవారం నుంచి 48 గంటల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ ఈ ప్రదర్శనలు జరగడం గమనార్హం. సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో ఇరువైపులా డజన్ల కొద్దీ సైనికులు, పౌరులు మరణించడంతో ఈ ఒప్పందం కుదిరింది. అయితే కాల్పుల విరమణకు ఎవరు ముందు ప్రతిపాదించారనే దానిపై కూడా ఇరు దేశాలు పరస్పరం భిన్నమైన ప్రకటనలు చేశాయి. తహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నాయకుడిని లక్ష్యంగా చేసుకుని కాబూల్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులు చేయడంతో ఇటీవలి ఘర్షణలు మొదలయ్యాయి. టీటీపీకి ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాక్ ఆరోపిస్తోంది. దీనికి ప్రతీకారంగా, ఆఫ్ఘన్ దళాలు డ్యూరాండ్ లైన్ వెంబడి పాక్ సరిహద్దు పోస్టులపై దాడులు చేశాయి. మరోవైపు, ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ గ్రూప్ (ఐఎస్‌కే) దాడులకు పాక్ సైన్యం సహకరిస్తోందని ఆఫ్ఘనిస్థాన్ ఎదురుదాడి చేస్తోంది. ఈ ఘర్షణల్లో డజన్ల కొద్దీ శత్రు సైనికులను మట్టుబెట్టినట్లు ఇరుపక్షాలు ప్రకటించుకున్నాయి. పాక్ దాడుల్లో ఆఫ్ఘన్ పౌరులు లక్ష్యంగా మారారని తాలిబన్లు ఆరోపించారు. తమ దేశం ఉగ్రవాద బాధితురాలని, దాడుల సమయంలో పౌర నష్టం జరగవచ్చని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖావాజా ఆసిఫ్ గతంలోనే హెచ్చరించారు. 58 మందికి పైగా పాక్ సైనికులు మరణించారని, వందల మందిని బందీలుగా పట్టుకున్నామన్నారు.

# సంక్షిప్తంగా..

## వెనుజులాలో సిఐఎ రహస్య ఆపరేషన్‌కు ట్రంప్ గ్రీన్ సిగ్నల్



**వాషింగ్టన్, అక్టోబరు 16:** అమెరికాలోకి అక్రమంగా మాదకద్రవ్యాలు రావడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటి నుంచి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా పడవలపై ఇటీవల అమెరికా సైన్యం పలుమార్లు దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ కీలక విషయం బయటపెట్టారు. వెనుజులాలో రహస్య కార్యకలాపాలు నిర్వహించేందుకు తాను సిఐఎకు అధికారికంగా అనుమతిచ్చినట్లు తెలిపారు. బుధవారం ఓవెల్ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే దానిపై స్పష్టతనిచ్చారు. వెనుజులా నుంచి పెద్ద మొత్తంలో మాదక ద్రవ్యాలు వస్తున్నా యన్నారు. సముద్రం ద్వారా వస్తున్న వాటిని అడ్డుకోవడంతోపాటు ఆ దేశ ప్రజలు ఇక్కడ నేరాలకు పాల్పడి యు ఎస్ జైళ్లలో ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో వారు మరిన్ని దాడులకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.

## సిఎం పదవి ఇస్తానన్నా వద్దన్నా: రామ్‌దేవ్‌బాబా



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** యోగా గురు బాబా రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ముఖ్యమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినా, పదవులపై ఆసక్తి లేకపోవడంతో దానిని సున్నితంగా తిరస్కరించానని వెల్లడించారు. దేశానికి సేవ చేయడమే తన ఏకైక లక్ష్యమని, అధికారం, కీర్తి ప్రతిష్ఠలపై తనకు ఏమాత్రం వ్యామోహం లేదని స్పష్టం చేశారు. రిపబ్లిక్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన రాష్ట్ర సర్వోపరి సమ్మేళన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేశారు. నా వాళ్లను రాజ్యసభకు పంపమని, సొంతంగా పార్టీ పెట్టమని కూడా చాలామంది అడిగారు. కానీ నాకు అధికారంపై ఆశ లేదు. నా జీవితంలో ఒకే ఒక్క లక్ష్యం ఉంది, అది భరతమాతకు సేవ చేయడ మేనని రాందేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ఏదో ఒకటి అవ్వాలని కాకుండా, దేశం కోసం ఏదైనా చేయాలని ఆలోచించండి.

## కర్ణాటకలో టెన్త్‌పాస్‌కు 33 మార్కులే!

**బెంగళూరు, అక్టోబరు 16:** పదో తరగతి విద్యార్థులకు కర్ణాటక ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. పబ్లిక్ పరీక్షలో పాస్ మార్కులు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇకపై ప్రతీ సబ్జెక్ట్‌లో 33 మార్కులు తెచ్చుకుంటే పాస్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటీ అరా మార్కులతో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, దీనిని నివారించేందుకే ఈ నిర్ణయం తీసు కున్నామని కర్ణాటక మంత్రి మధు బంగారప్ప పేర్కొన్నారు. గతేడాది వరకు పదో తరగతిలో పాస్ కావాలంటే ప్రతి సబ్జెక్ట్‌లో తప్పనిసరిగా 35 శాతం మార్కులు తెచ్చు కోవాల్సిందే. ఒకటీ అరా మార్కులతో ఫెయిలైన విద్యార్థి తిరిగి సప్లిమెంటరీ పరీక్షల కోసం వేచి ఉండాలి. ఈ గ్యాప్‌లో విద్యార్థులను వారి తల్లి దండ్రులు పనికి పంపించడం, ఆడపిల్లలైతే పెళ్లి చేసి పంపించడం చేస్తున్నారని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బంగారప్ప చెప్పారు. ఆ తర్వాత పిల్లలు చదువుకు శాశ్వతంగా దూరమవుతున్నారని తెలిపారు. దీనిని తప్పించేందుకు పాస్ మార్కులను 33 కు తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు.

## చైనా కరెన్సీలో భారత్ చెల్లింపులు: రష్యా డిప్యూటీ పిఎం



**మాస్కో, అక్టోబరు 16:** రష్యా చమురు కొనుగోళ్లకు చైనా కరెన్సీ యువాన్‌లో భారత్ చెల్లింపులు చేస్తోంది. ఈ విషయాన్ని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ వెల్లడించారు. అయితే అది స్వల్ప మొత్తంలోనేనని, ఎక్కువ శాతం లావాదేవీలు రూబుల్స్‌లోనే జరుగుతున్నాయని స్థానిక మీడియా సంస్థతో మాట్లాడారు. రష్యా చమురుకు భారత్ రెండో అతిపెద్ద కొనుగోలుదారుగా ఉన్న సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించిన తర్వాత ఈ చమురు కొనుగోళ్లు భారీగా పెరిగాయి. దాంతో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అప్ప టి నుంచి వ్యాపారలావా దేవీల కోసం ప్రత్యా మ్నాయ కరెన్సీలు యు వాన్, యుఎఇ, దిరమ్ వాడకం పెరిగింది. ఇదిలా ఉంటే.. సెప్టెం బరులో రష్యా నుంచి చమురు కోసం భారత్ 2.5 బిలియన్ యూరోలను వెచ్చించింది. అంతకుముందు నెలతో పోలిస్తే అది 14 శాతం తక్కువ కావడం గమనార్హం.



# ఇంకా కొలిక్కిరాని 'సర్దుబాట్లు'!

## - లాలూకు రాహుల్ ఫోన్ - 61 సీట్లిచ్చేందుకు ఆర్‌జెడి ఓకే? - మహాకూటమి నేడు అధికారిక ప్రకటన

## - 16మందితో కాంగ్రెస్ తొలి జాబితా - బిజెపి - జెడియు అభ్యర్థులు ఫైనల్ - 40మంది బిజెపి స్టార్ క్యాంపెయినర్లు

**పాట్నా, అక్టోబరు 16:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం ఉదయం ఫోన్ చేశారు. మహా కూటమిలో సీట్ల సర్దుబాటు అంశంపై ఇరువురు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ బీహార్ శాఖ కోరినట్లు 70–75 సీట్లు ఇచ్చేందుకు ఆర్‌జెడి సుముఖంగా లేదని, కాదు కూడదంటే 60–16 స్థానాలు కేటా యిస్తామని ఆ పార్టీ అగ్రనేతలు లాలూ, తేజస్వి తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో లాలూకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఫోన్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తమ్మీద సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, శుక్రవారం అధికారికంగా ప్రకటన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇండియా కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పష్టం చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ 16 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో సిట్టింగ్ స్థానాలే అధికంగా ఉన్నాయి. ఇక లాలూ తనయుడు, జన్‌శక్తి జనతా దళ్ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్ మహువ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ మేరకు గురువారంనాడు నామినేషన్ దాఖలు చేశారు. తేజ్‌ప్రతాప్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొంటూ సోదరి రోహిణి ఆచార్య సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. అటు ఎన్‌డియేలోని ప్రధాన భాగస్వామ్య పార్టీలు బిజెపి–జెడియు తమకు కేటాయించిన చెరో 101 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేశాయి. బిజెపి తొలి జాబితాలో 71, రెండో జాబితాలో 12 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, మూడో జాబితాలో మిగిలిన 18 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అలాగే జెడియు గురువారంనాడు మిగిలిన 44 స్థానాలకు తమ పార్టీ అభ్యర్థుల పేర్లతో జాబితా విడుదల చేసింది. మొత్తమ్మీద జెడియు ఒబిసి–37, ఇబిసి–22, జనరల్–22, ఎస్‌సి–15, ఎస్‌టి–1, ముస్లిం 4 స్థానాలకు కేటాయించింది. సిఎం నితీశ్ కుమార్ ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు. గురువారంనాడు పలు నియోజకవర్గాలలో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. అలాగే రాష్ట్రీయ లోక్‌మోర్చా తమకు కేటాయించిన ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి భారతీయ జనతా పార్టీ ప్రధాని మంత్రి నరేంద్రమోడీ, ఆ పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జెపి నడ్డా సహా 40 మందితో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఎన్నికల అధికారులకు అందజేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటైంది. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ నేతృత్వంలో కొత్త కూటమి ఏర్పాటైంది. మూడో కూటమిలో ఎంఐఎం తోపాటు ఆజాద్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ, తేజ్‌ప్రతాప్ నేతృత్వంలోని జెజెడిలతో కూటమిగా ఏర్పడ్డాయి.

17-10pg6exHMNWJQE 10_17-10pg6exHMNWJQE.qxd 10/16/2025 11:21 PM Page 1



## మిథున్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతిపై
# ఎసిబి కోర్టు తీర్పు నేడు

**విజయవాడ, అక్టోబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కేసులో నిందితుడు, వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతించాలని దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్‌పై తీర్పును శుక్రవారం వెలువరిస్తామని ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ప్రకటించారు. మద్యం కేసులో నిందితుడిగా ఉన్న మిథున్ రెడ్డి ఇటీవల బెయిల్‌పై రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. అక్టోబర్ 26వ తేదీన అమెరికా వెళ్ళే పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో మిథున్ రెడ్డి పేరు ఉన్న విషయం విదితమే. అయితే అక్టోబర్ 20వ తేదీన న్యూయార్క్ వెళ్లేందుకు తనను అనుమతించాలని కోరుతూ ఏసీబీ కోర్టులో మిథున్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. మద్యం కేసులో అరెస్టయిన సందర్భంగా ఆయన పాస్ పోర్టును సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో తనకు పాస్ పోర్ట్‌ను తిరిగి ఇప్పించాలని కోరుతూ.. ఇటీవల ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మిథున్ రెడ్డికి పాస్‌పోర్ట్ అందజేయాలంటూ సిట్ అధికారులను కోర్టు ఆదేశించింది. అలాగే తనపై ఉన్న లుక్ ఔట్ సర్క్యులర్ రద్దు చేయాలని కోరుతూ కోర్టులో మిథున్ రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు.

## రాష్ట్రంలో మొదటి సారిగా ప్యాలియేటివ్ కేర్‌లో పీజీ డిగ్రీ
### విశాఖ హోమీబాబా క్యాన్సర్ సెంటర్‌కు అనుమతి

**విశాఖపట్నం, అక్టోబరు 16 ప్రభాతవార్త:** దీర్ఘకాలిక చికిత్సతో పాటు రోగికి బాగా నొప్పి కలిగించే వ్యాధులు సంక్రమించినప్పుడు అటువంటి రోగులకు కలిగే తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం కల్పించడం చాలా అవసరమవుతుంది. ఆ నొప్పిని తగ్గించే ప్రత్యేక చికిత్సా విధానాన్ని ఉపశమన సంరక్షణ(ప్యాలియేటివ్ కేర్) అంటారు. ప్రత్యేక చికిత్సా విధానం మరియు నైపుణ్యతలతో కూడిన ఈ చికిత్సకు సంబంధించి పీజీ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్ట దానికి విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, చికిత్సా కేంద్రానికి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతించారు. దీంతో రాష్ట్రంలో మొదటసారిగా ఈ పీజీ కోర్సు ప్రారంభంకానుంది. 4 పీజీ సీట్లలో ప్రవేశాలు జరుగుతాయి. ఉపశమన చికిత్స, క్యాన్సర్ వంటి కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించినప్పుడు రోగులు విపరీతమైన నొప్పితో బాధపడడం వల్ల వారి జీవన నాణ్యత తగ్గిపోతుంది. అటువంటి నొప్పి నుండి ఉపశమనం కల్పించి రోగుల జీవన నాణ్యతను పెంచేందుకు తగిన మందుల వినియోగం, మానసిక సలహాలు, కుటుంబ సభ్యుల సహాయం, ఫిజియోథెరపీ ఉపయోగపడతాయి. నొప్పి తరంగాలు (సిగ్నల్స్) ప్రసరించకుండా చేయడం ఈ ఉపశమన సంరక్షణలో అంతర్భాగం. ఉపశమన సంరక్షణలో అందుబాటులో కొస్తున్న ఆధునిక సమగ్ర చికిత్సా విధానాలను పీజీ కోర్సు ద్వారా విస్తరింపచేయడానికి ముందుకొచ్చిన హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి నిర్వాహకులను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. ఇటీవలే గైనికాలజికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీల్లో నాలుగేసి సీట్లతో సూపర్ స్పెషాలిటీ విద్యను ప్రవేశపెట్టడానికి హోమీ బాబా ఆస్పత్రికి మంత్రి అనుమతించారు.





### తిరుమల పరకామణి కేసు
# హైకోర్టు నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ!
### నేడు ధర్మాసనం ముందుకు సిఐడి వివరాలు

● విచారణకు ఆదేశిస్తే ఏం జరగనుందో? ● రవికుమార్ మౌనం దేనికి సంకేతమో?

**తిరుమల, అక్టోబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు సంవత్సరాల క్రిందట తిరుమల పరకామణిలో వెలుగు చూసిన 920 అమెరికన్ డాలర్ల చోరీ కేసు ఉదంతంలో లోక్‌అదాలత్ ద్వారా మధ్యవర్తిత్వం జరిపి రాజీచేయడం వెనుక ఉన్న మతలబుపై హైకోర్టు ధర్మాసనం పునర్విచారణకు ఆదేశిస్తే ఏం జరగనుందనేది అటు పోలీసుశాఖలో ఇటు టిటిడి వర్గాల్లో సంచలనంగా మారింది. నిందితుడుగా పట్టుబడిన సివి రవికుమార్ రెండు దశాబ్దాల పాటు పరకామణి విధుల్లో ఉంటూ ఏకంగా 140 కోట్ల రూపాయలు మేరకు అక్రమాస్తులు కూడగట్టారనేది ప్రధాన ఆరోపణలు. ఈ ఆస్తుల్లో కేవలం 14 కోట్ల రూపాయలు మాత్రమే అతని పేరున, భార్య పేరున ఉన్నవాటిని వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి విరాళంగా ఇచ్చారనేది అప్పటి టిటిడి పాలకమండలి పెద్దలు బోర్డులు తీర్మానించిన విషయం. అయితే క్రిమినల్ చర్యగా భావించే ఈ కేసులో చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, కొందరు పోలీస్ అధికారులు లోక్‌అదాలత్ ద్వారా రాజీకుదర్చడం దేవుని సొమ్ముకు శఠగోపం పెట్టేశారా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై 2023లోనే అప్పట్లోనే పెద్ద దుమారం రేపినా పట్టించుకోలేదు. గత కొంతకాలంగా ఈ పాత కేసుపై దుమారం రేగడం, ఏకంగా ప్రస్తుత టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆధారాలతో సిఎం చంద్రబాబుకు విన్నవించారు. శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం తదుపరి ఈ కేసుకు సంబంధించి 2023లో నమోదైన ఎఫ్ఐఆర్, సిడిఫైళ్ళు, దర్యాప్తు రికార్డులు, సిసిపుటేజీలు సమర్పించాలని ఆదేశించింది. పోలీసు వర్గాలు జాప్యం చేయడంపై ఇటీవల హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. తదనంతరం పరిణామాలతో సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ మంగళవారం తిరుమలకు చేరుకుని పరకామణి భవనాన్ని పరిశీలించడం, పరకామణి లెక్కింపు, భద్రత, సిసిటివి నిఘా వంటివి కీలకంగా గమనించారు. తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2023 మార్చి నెలలో నమోదైన కేసు వివరాలు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని నేడు హైకోర్టు ధర్మాసనంకు సమర్పించనున్నారు. వీటన్నిటినీ పరిశీలించిన తరువాత హైకోర్టు ఏం నిర్ణయం తీసుకుంటుందో, తిరిగి సిఐడి పునర్విచారణకు ఆదేశిస్తే 2023 మార్చినెలలో జరిగిన చోరీ కేసు, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, దర్యాప్తు, లోక్‌అదాలత్ ద్వారా మధ్యవర్తిత్వం జరిపి రాజీచేయడం వెనుక ఎవరి పాత్ర ఏమేరకు ఉందనే సంచలన విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందనేటి టిటిడి వర్గాల్లో చర్చమొదలైంది.

ఇదిలా ఉండగా తిరుమలలోని పెద్దజీయంగార్ మఠంలో ఉండే రవికుమార్ పరకామణిలో విధుల్లో లెక్కలు రాసే ఉద్యోగిగా ఉండట, అమెరికాన్ డాలర్లు చోరీచేసి విజిలెన్స్‌కు అక్కడికక్కడే పట్టుబడటం, తదుపరి తిరుమల వన్‌టౌన్ పోలీసులు అరెస్టుచేయడం జరిగిపోయింది. ఈ ఘటనపై అప్పట్లోనే టిటిడి పూర్తిస్థాయి విచారణ చేయలేదనేది ఇప్పటికీ ఆరోపణలు. అంతేగాక సిసిటివి పుటేజీ ఆధారాలు మాయం చేసిన విజిలెన్స్ అధికారులపై కూడా చర్యలు తీసుకునే దిశగా సిఐడి ముందుకు కదలనుందా అనేది హాట్‌టాఫిక్‌గా మారింది. అసలు నిందితుడైన రవికుమార్ ఆచూకీ కూడా తెలియాలని తాజాగా బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మీడియా ముందుకు వచ్చాడు. ఆయన ఆచూకీ తెలియాలని పట్టుబడటం ఉత్కంఠ పరిణామాలే. ఈ కేసు ఇప్పుడు తిరిగి సిఐడి చేతికి వెళ్ళడం, హైకోర్టు ఆదేశాలతో సిఐడి విచారణ ప్రారంభిస్తే రవికుమార్ ఎక్కడనున్నాడో తెలుసుకోవడం ప్రధానంగా మారింది.

నేడు హైకోర్టుకు సిఐడి అధికారులు సమర్పించే కీలక ఆధారాలపై తదుపరి ఏం జరగనుందనే మాత్రం టిటిడిలో, గత బోర్డు పెద్దల్లో ఉత్కంఠ రేపుతోంది. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల రూపంలో హుండీకి సమర్పించిన విదేశీ కరెన్సీ చోరీలో పాత్రధారుడైన రవికుమార్‌ను తప్పించిన ఘటనలో కీలక సూత్రధారులు ఎవరనేది తేల్చనుందనే భయం పోలీస్‌వర్గాల్లో సంచలన పరిణామాలు చోటుచేసుకోనున్నాయి.



# అమరావతిలో దసపల్లా హోటల్
### ప్రోత్సాహకాలతో ఏపీ ప్రభుత్వం అనుమతి

**విజయవాడ, అక్టోబరు 16, ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో 4 స్టార్ దసపల్లా హోటల్ నిర్మాణానికి ప్రోత్సాహకాలతో ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.200 కోట్లతో 4 స్టార్ హోటల్‌ని దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించనుంది. దసపల్లా హోటల్ నిర్మాణంతో 400 మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్ర పన్నులు, స్టాంప్ డ్యూటీ వందశాతం తిరిగి చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల తరహాలో విద్యుత్ చార్జీలు విధింపు, ఐదేళ్లకు విద్యుత్ సుంకం తిరిగి చెల్లించాలని నిర్ణయించింది. టూరిజం పాలసీ 2024 నుంచి 2029 ప్రకారం పలు రాయితీలు ఇస్తూ ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజైయ్ జైన్ ఆదేశాలు జారీ చేశారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**కొడవలూరు (నెల్లూరు), అక్టోబరు 16 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలో ఉన్న ఇంజనీరింగ్ డిప్లమా కళాశాల విద్యార్థి బుధవారం రాత్రి శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల మూడవ అంతస్తులో ఉరి వేసుకుని మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా పోరుమామిళ్ల మండలానికి చెందిన ఉదయ్ కిరణ్ (17) ఇంజనీరింగ్ డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఏమైందో ఏమో కాలేజీలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయాన్ని కాలేజీ యాజమాన్యం, మృతుడి కుటుంబీకులకు, పోలీసులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థి మృతిదేహాన్ని వెలికితీశారు. మృత్యువాత పడ్డ ఉదయ్ కిరణ్ చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. దీంతో విద్యార్థి యూనియన్ సంఘాలు కళాశాల వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. సమస్య ఉద్రికతక కావడంతో రూరల్ డిఎస్పీ మక్కినేని వెంకటేశ్వరరావు రంగంలోకి దిగి పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. డి.ఎస్.పి కుటుంబ సభ్యులతో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొడవలూరు సీఐ సురేంద్రబాబు, స్థానిక ఎస్సై కోటిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేటి నుంచి మరిన్ని పండుగ ప్రత్యేక రైళ్లు



**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 16 ప్రభాతవార్త:** ప్రస్తుత పండుగల సమయంలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో రైల్వేశాఖ పండుగ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్ళే నెంబర్ 07497 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 17న తిరుపతి నుంచి బయలుదేరుతుంది. మార్గమధ్యంలో ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, బాపట్ల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, నడికూడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో నిలుస్తుంది. అలాగే సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్ళే నెంబర్ 07498 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 18న శనివారం సికింద్రాబాద్ నుంచి బయలు దేరుతుంది. మార్గమధ్యంలో ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, సూలేహళ్ళి, యాద్గీర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో నిలువనుంది. ధర్మవరం నుంచి షోలాపూర్ వెళ్ళే నెంబర్ 01438 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 18న శనివారం ధర్మవరం నుంచి బయలుదేరుతుంది. ఈరైలు మార్గమధ్యంలో కదిరి, మొలకలచెరువు, మదనపల్లె, పీలేరు, పాకాల, తిరుపతి, రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, క్రిష్ణా, యాద్గీర్, వాడి స్టేషన్లలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తుంది. అలాగే దర్భాంగ నుంచి యశ్వంతపూర్ వెళ్ళే నెంబర్ 05541 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 20 నుంచి నవంబర్ 17 వరకు ప్రతి సోమవారం దర్భాంగ నుంచి బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంతపూర్ నుంచి దర్భాంగ వెళ్ళే నెంబర్ 05542 ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి నవంబర్ 20 వరకు ప్రతి గురువారం యశ్వంతపూర్ నుంచి బయలు దేరుతుంది. ఈ రైళ్ల మార్గమధ్యంలో తెలుగు రాష్ట్రాల్లో రామగుండం, కాజీపేట్, కాచిగూడ, మహబూబ్ నగర్, డోన్, ధర్మవరం, హిందూపురం స్టేషన్లతోపాటు బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తాయి.

# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి తాడిపత్రి శ్రీశివసాయి మందిరం

● ఏకశిలా సాయిబాబా విగ్రహంగా పేరు ప్రఖ్యాతలు ● సర్టిఫికెట్ అందుకున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, ఎస్వి రవీంద్రరెడ్డి



శ్రీషిరిడి సాయిబాబా మూలవిరాట్టు

**తాడిపత్రి టౌన్, అక్టోబరు 16 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లాలోని తాడిపత్రి పట్టణం సంజీవనగర్ 5వ రోడ్డులో వెలసిన శ్రీశివసాయి మందిరంలో శ్రీషిరిడిసాయిబాబా విగ్రహం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. రాజస్థాన్‌లోని జైపూర్ నుండి ప్రత్యేకంగా ఏకశిలతో 9.5 అడుగులు ఎత్తు, 7 టన్నులు బరువు కలిగి ఉండటం ఈ సాయిబాబా విగ్రహం ప్రత్యేకత. అహ్మదాబాద్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు చెందిన అధికారి పవన్ సోలంకి తాడిపత్రికి చేరుకుని విగ్రహం ఎలా ఉంది ఏకశిలనా, విగ్రహం ప్రత్యేకత ఏంటో క్షుణ్ణంగా తెలుసుకుని వెళ్లారు. అనంతరం రికార్డులు పరిశీలించి భారతదేశంలోనే ఎక్కడ కూడా ఇలాంటి ఏకశిలా విగ్రహం ఇంత పరిమాణంలో లేదని ధ్రువీకరించారు. అనంతరం గురువారం తాడిపత్రికి చేరుకుని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్, మెడల్స్‌ను తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, ఎస్వి రవీంద్రారెడ్డిలు అందుకున్నారు. తాడిపత్రికి ఆధ్యాత్మికలో అవార్డులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాడిపత్రిని ది టెంపుల్ సిటీ ఆఫ్ రాయలసీమ చేసే ప్రయత్నంలోనే ఇలాంటి అవార్డులు రావడం ఎంతో శుభపరిణామమని మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.






## డివైడర్‌ను ఢీకొన్న బస్సు

**దగదర్తి (నెల్లూరు), అక్టోబరు 16 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా దగదర్తి మండలం అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి దగ్గర వర్షానికి బస్సు సింగల్ రోడ్డు అవ్వటంతో రోడ్డు పక్కన ఉన్న డివైడర్ ఢీకొని రోడ్డుకి అడ్డం తిరిగింది. దాని వలన కిలోమీటర్ల కొద్ది వాహనాలు ఆగిపోయాయి. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం అందుకున్న ఎస్సై జంపని కుమార్ వెంటనే స్పందించి పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని క్రేన్ల సాయంతో బస్సును పక్కకు తీసి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. ఎస్సై జంపని కుమార్ మాట్లాడుతూ ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడని, ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని బస్సులో ఉన్న వారందరూ సురక్షితంగా ఉన్నారని చెప్పారు.

## బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తజనం
### గజవాహనంపై రాజాధిరాజా అలంకరణలో శ్రీవారు



**ఉమ్మడి తూర్పుగోదావం జిల్లా బ్యూరో, అక్టోబరు 16, ప్రభాతవార్త:** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారు రాజాధి రాజా అలంకరణలో గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మశ్రీ ఖండవల్లి వరప్రసాద చార్యులు నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు స్వస్తి వచనము, ప్రధానహోమములు, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, వైభవ పేతంగా జరిపారు. అశేష భక్తజనం నడుమ అంగరంగ వైభవంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణతో మర్మోగాయి. రాజాధి రాజ అలంకరణలో స్వామివారు గజ వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. భక్తులకు నాయనానంద కరంగా భక్తులకు శ్రీదేవి భూదేవి సమేతంగా దర్శనమిచ్చారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, కనకదుర్గ దంపతులు, చైర్మన్ ముదునూరి వెంకటరాజు, శ్రావణి దంపతులు గజవాహన సేవలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో ముదునూరి రామభద్రరాజు, ఏపుగంటి వెంకటేష్, సూపెరిడెంట్ పులపర్తి రాంబాబు, రాపాక శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వై, శ్రీనివాస్, నందిశ్వరుడు, వర్మ, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కవుల కామధేనువు 'ఎక్స్‌రే' కొల్లూరి ఇకలేరు

**విజయవాడ, అక్టోబరు 16, ప్రభాతవార్త ప్రతినిధి:** కవుల కామధేనువు, తెలుగునాట మిని కవిత ఉద్యమ రథసారథుల్లో ఒకరు "ఎక్స్‌రే" కొల్లూరి(72) ఇక లేరు. ఆయన విజయవాడలో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో హృద్రోగ సమస్య తలెత్తడంతో అక్షర ఐక్యమయ్యారు. తెలుగునాట యువతరం కవుల నుంచి లబ్దప్రతిష్ఠుల వరకు కొల్లూరి అంటే అందునా "ఎక్స్‌రే" కొల్లూరి అంటే తెలియని వారు లేరు. ఆయనది వ్యవస్థపై ధిక్కారస్వరం, వ్యవస్థలో లోలోతుల నిగ్గుదిశలో "ఎక్స్‌రే" పత్రికను స్థాపించి కేవలం అర్ధ రూపాయికే అందించిన కవుల వేదిక అతను. ఆయన ఎక్స్‌రే పత్రిక ద్వారా సాహిత్య సేవ చేయడంతో పాటు ఎందరో ప్రతిభావంతులైన కవులకు, విమర్శలకు ఏటా అవార్డులు ఇచ్చి సత్కరించారు. చలనచిత్రంతోను ప్రవేశం ఉన్న కొల్లూరు మెగాస్టార్ చిరంజీవి పేరు టైటిల్‌గా ప్రతికకు సంపాదకత్వం వహించారు. ఎక్స్‌రే అవార్డు అంటే జాతీయ స్థాయిలో అదో అత్యంత గౌరవనీయ పురస్కారంగా ఇప్పటికి కవులు భావిస్తారు. లయన్స్‌క్లబ్బు ద్వారా సామాజిక సేవలు, వాకర్స్ అసోషియేషన్ ద్వారా



ఎన్నో దానాలు, వేసవి వచ్చిందంటే మూడు నెలల నిరంతరాయ మజ్జిగ పంపిణీ, కొల్లూరి తెలుగు సాహిత్యానికి అందించిన కవులు, కళాకారులు. స్వచ్ఛంద సేవకులు లెక్కలేనంత మంది. ఏ అంశంపైనైనా వినేవారికి విసుగు రాకుండా అనర్ఘళంగా మాట్లాడే కొల్లూరి ఏ నాడు పొగడ్తలను, తెగడ్తలను ఒకే విధంగా తీసుకునే వారు. కృష్ణ, నారాయణమూర్తి, రావు బాలసరస్వతి, కృష్ణరాజు ఇలా చెప్పుకుంటే పోతే ఆయన చేత అవార్డు అందుకోని వారు లేరు.

ఆయనకు ఏపీ ప్రభుత్వం అనేక పర్యాయాలు ఉగాది పురస్కారాలు ప్రకటించిన తిరస్కరించారు. గత ఉగాదికి మిత్రులందరి బలవంతంపై ఉగాది పురస్కారం స్వీకరించారు. కొల్లూరు రచనలు సామాజిక చైతన్య గీతికలు, ఆయన రాసిన " స్త్రీ" దీర్ఘకావ్యం పెనుసంచలనం. కొల్లూరి ఆకస్మికకక మృతి పట్ల సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమా, మెగాస్టార్ చిరంజీవి, ఎంఎల్‌సీ నాగబాబు, మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్, మల్లెతీగ కలిమిశ్రీ, ప్రజాసాహితీ గౌరవ సంపాదకులు, విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ నేత పెనుగొండ లక్ష్మీనారాయణ, గోరేటి వెంకన్న, ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షుడు శరత్‌చంద్ర(విల్సన్‌రావు), తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ సంచాలకు డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, శమంతక మణి, మందరపు హైమావతి కవులు కళాకారులు, సామాజిక సేవకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు.

## జిఎస్‌టి 2.0తో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు
### కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి




**బుచ్చి (నెల్లూరు), అక్టోబరు 16 ప్రభాతవార్త:** జిఎస్‌టి 2.0 సంస్కరణలతో వస్తు రవాణాలో కీలక పాత్ర పోషించే వాహనాల కొనుగోలు, మెయింటెన్స్ కాస్టు తగ్గడంతో సరుకుల రవాణా ఖర్చులు తగ్గి నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని కెవిఆర్ కళ్యాణ మండపంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిఎస్‌టి అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని వినియోగ వస్తువుల ధరలు పెరగడం తగ్గడంలో రవాణా రంగ పాత్ర గురించి ఆమె గణాంకాలతో సహా వివరించారు. జిఎస్‌టి 2.0 సంస్కరణలు లాజిస్టిక్ రంగానికి వరం లాంటివన్నారు. జిఎస్‌టి 2.0 సంస్కరణలతో ట్రాక్టర్లు తగ్గడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రెండవ ట్రాక్టర్ కొనేందుకు ఆసక్తి చూపుతున్నారని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్టు వాహనాల ఇన్సూరెన్స్‌పై గతంలో ఉన్న 18% శాతం జిఎస్‌టిని 05% శాతానికి తగ్గించడం శుభపరిణామమని అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమీషనర్ సుజాత, జిల్లా రవాణాశాఖ అధికారి కార్తీక్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సంధ్య, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ స్వప్నిల్‌రెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, నగర అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, రూరల్ అధ్యక్షుడు జగదీష్, వింజం రామానాయుడు, తాళ్ళ నరసింహస్వామి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, మైనార్టీ నాయకులు పఠాన్ మహబూబాషా, షబ్బీర్, షేక్, ఫర్వీనా, వల్లూరు రాఘవరెడ్డి, వల్లూరు శ్రీనివాసులు, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, రహమత్, జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, మాధవ్, బిజెపి నాయకులు కాసా శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

17-10pg7exHMNWJQE 11_17-10pg7exHMNWJQE.qxd 10/17/2025 12:08 AM Page 1





# దుర్గమ్మవారికి బంగారు ఆభరణాల కానుక

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 16, ప్రభాతవార్త: దుర్గమ్మవారికి గురువారం 531 గ్రాముల బంగారు ఆభరణాలను కానుకగా దాతలు సమర్పించారు. బంగారు ముక్కుపుడక, సూర్యుడు, చంద్రుడు, బులాకీ, సూత్రాలు, గొలుసు ఆభరణాలను వజ్రాలతో పొదిగించి రూపొందించారు. వాటిని ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలకు అందించగా, కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మిరవి, గోకరాజు గంగరాజు, కనుమూరి బాపిరాజు, కీర్తిలాల్ కాళిదాస్ జ్యుయలరి డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

### సేవానిరతితో బాధ్యతలు నిర్వర్తిస్తాం

భక్తజనానికి సేవలందిస్తూ తమ బాధ్యతలు నిర్వర్తిస్తామని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నూతన పాలక మండలి చైర్మన్ సభ్యులు తెలిపారు. గురువారం పాలక మండలితో పరిచయం కార్యక్రమం ఇఓ వికె శీనా నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరం నూతన క్యాలండర్‌లను ఆవిష్కరించారు. ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలక మండలి వెల్లడించారు.

### దుర్గమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

దుర్గమ్మవారి ఆలయంలో ధన త్రయోదశి ఈనెల 19న నిర్వహిస్తామని ఇఓ తెలిపారు. ఉదయం 8 గంటలకు రుద్రహోమం యాగశాలలో శ్రీ మహాలక్ష్మియాగం (పరోక్షసేవగా) నిర్వహిస్తామన్నారు. 20వ తేదీ దీపావళి సందర్భంగా సాయంత్రం 7 గంటలకు శ్రీ ధనలక్ష్మి పూజ, దీపాలంకరణ, బాణాసంచా వెలిగించుట, కవాట బంధనము ఉంటాయన్నారు.

### 22 నుండి కార్తీక మాస పూజలు

ఈనెల 22 నుండి కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజాదికాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8



దుర్గమ్మవారి కాల్యండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గంటలకు శివపంచాక్షరి, లక్ష్మీగణపతి జపములు, ప్రదోషకాలంలో మహానివేదన, పంచహారతులు, చతుర్వేదస్వస్తి, ఆకాశదీపం వెలిగించడం జరుగుతుందని ఇఓ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం భక్తులచే దీపోత్సవం జరుగుతుందన్నారు. 23వ తేదీన శ్రీ అమ్మవారం ఆలయంలో గాజుల ఉత్సవం భగినీ హస్త భోజనం (యమ ద్వితీయ) జరుపుతామని, భక్తులతో ఏర్పాటు చేసిన గాజులతో అలంకారం చేస్తామన్నారు 25 వ తేదీ నాగుల చవితి సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 5వ తేదీ పూర్ణిమ సందర్భంగా కోటి దిపోత్సవం జరుపుతామ్నారు. నవంబర్ 18న మాస శివరాత్రి సందర్భంగా శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు 25కెజిల అన్నంతో అన్నాభిషేకం నిర్వహిస్తామన్నారు. నవంబర్ 21న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

### ప్రత్యేక బిల్వార్చన

కార్తీకమాసంలో వచ్చే పర్వదినాలైన అక్టోబర్ 27, నవంబర్ 1, 3, 5, 10, 15, 17, 18 తేదీల్లో ప్రత్యేక బిల్వార్చన, అన్న సంతర్పణ శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయంలో జరుగుతాయన్నారు.




ఆలయ పాలకమండలి, ఇఓ సమావేశం దృశ్యం

# 1నుంచి భవానీ దీక్షలు

నవంబర్ 1న కార్తీకమాసం శుద్ధ ఏకాదశి ఉదయం 8.45లకు శ్రీ భవానీ మండల దీక్షల ధారణలు ప్రారంభమయ్యి, నవంబర్ 5 వరకు దీక్షధారణలు జరుగుతాయని ఇఓ తెలిపారు. నవంబర్ 21న అర్ధమండల దీక్షలు ప్రారంభమై 25వ తేదీ వరకు వుంటాయన్నారు. డిసెంబర్ 4న మార్గశిర పూర్ణిమ పర్వదినాన కలశజ్యోతి జరుగుతుందన్నారు. సత్యనారాయణ పురం శివరామకోటి నుండి కలశజ్యోతులు ప్రారంభమై దుర్గమ్మవారికి ఆలయానికి ఊరేగింపుగా చేరుకుంటాయన్నారు. డిసెంబర్ 11న ఉదయం 6.30 గంటలకు అగ్ని ప్రతిష్టాపన, 15న శతచండీయాగం, గిరిప్రదక్షణలు, భవానీ దీక్షల విరమణలు జరుగుతాయన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు భవానీ దీక్షలకు పూర్ణాహుతి జరుగుతుందన్నారు. భవానీ దీక్షల సందర్భంగా డిసెంబర్ 11 నుండి డిసెంబర్ 15 వరకు అన్ని ప్రత్యక్ష, పరోక్ష సేవలు రద్దు చేశామన్నారు. ఈ సేవలను ఏకాంతంగా శ్రీ అమ్మవారికి నిర్వహిస్తామన్నారు

పోలవరం నిర్వాసితులకు శుభవార్త

# సహాయ, పునరావాస ప్యాకేజీ కోసం రూ.1,100 కోట్లు విడుదల



విజయవాడ, అక్టోబరు 16 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సహాయ, పునరావాస ప్యాకేజీ కోసం రూ.1,100 కోట్లు విడుదల చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం గతంలో అడ్వాన్సుగా ఇచ్చిన నిధులలో మిగిలి ఉన్న రూ.1,800 కోట్ల నుంచి ఈ మొత్తాన్ని ప్రాజెక్టు ప్రత్యేక ఖాతాకు రాష్ట్ర ఆర్థిక శాఖ మళ్లించింది. ఈ నిధులు ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు పరిహారం చెల్లించడానికి దాదాపుగా సరిపోతాయని జల వనరుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరో రూ.100 కోట్లు అందితే ఈ దశ చెల్లింపులు సంపూర్ణంగా పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

### కేంద్రం ఒత్తిడితోనే కదలిక

నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్వాసితులకు చెల్లింపులు జరపడంలో జాప్యంపై కేంద్ర ప్రభుత్వం కొంతకాలంగా ఒత్తిడి తెస్తోంది. ఈ నెల ఆరంభంలో ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ అంశంపై తీవ్రంగా చర్చ జరిగింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను నిర్ణీత సమయంలో ఖర్చు చేయకపోతే అవి మురిగిపోయే ప్రమాదం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో, చెల్లింపుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని మంత్రి పాటిల్ రాష్ట్ర అధికారులను ఆదేశించారు. ఈ సమాచారాన్ని మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించింది. దీని ఫలితంగానే రాష్ట్ర ఆర్థిక శాఖ మంగళవారం రూ.1,100 కోట్లను విడుదల చేసింది. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దాదాపు రూ.1,000 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసింది. ఈసారి కూడా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేసి, వారితో కలిసి ఒక సభను నిర్వహించాలని మంత్రి నిమ్మల రామానాయుడు భావిస్తున్నట్లు సమాచారం.

# శీతల పానీయాలపై 'ఓఆర్ఎస్' లేబుల్ నిషేధం

### ఎఫ్ఎస్ఎస్ఎఐ తాజా ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ఆహారశీతలపానీయాల సంస్థలు ఇకపై తమ పానీయాలపై ఒఆర్ఎస్ అన్న పదాన్ని వినియోగించకూడదని కేంద్ర ఆహారభద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) కొత్త సర్క్యులర్ జారీచేసింది. అన్ని ఉత్పత్తులపైనా, లేబుళ్లపైనా, ట్రేడ్ మార్కులు వంటి అన్నింటిపైనా 'ఒఆర్ఎస్' అన్న పదాన్ని నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. పండ్లరసాలతో ఉన్నా, నాన్ కార్బొనేటెడ్ డ్రింక్స్ అయినా రెడీటు డ్రింక్ ఉత్పత్తులు అయినా కూడా ఎఫ్ఎస్ఎస్ఎఐ ప్రమాణాలకు అనుగుణంగా ఉండా లని ఆదేశించారు. అలాగే గతంలో అంటే 2022 లోను, 2024 లోను జారీ చేసిన మార్గదర్శకాలు, అనుమతుల ప్రకారం కంపెనీలు ఒఆర్ఎస్ అన్న పదం ముద్రిం చేందుకు అనుమ తు లిచ్చింది. అయితే ఈ పానీయాలేవీ కూడా ఒఆర్ఎస్ ఫార్ములా అనుసరిం చాలేదని, ప్రపంచ ఆరోగ్యసంస్థ నిర్దేశించిన ప్రమా ణాలకు అనుగుణంగా లేవని అందువల్ల ఒఆర్ఎస్ అన్న పదం ఇకపై ముద్రించ కూడదని ఎఫ్ఎస్ఎస్ఎఐ స్పష్టంచేసింది. గతంలో ఇచ్చిన అనుమతులను కూడా ఏజెన్సీ రద్దుచేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలప్రకారం మాత్రమే ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్స్ ఉండాలని నిర్దేశిత ఫార్మా నిబంధనలప్రకారం ఉండా లని వాటిపైనే ఒఆర్ఎస్ ముద్ర ఉండవచ్చని ఎఫ్ఎస్ఎస్ఎఐ వెల్లడించింది. కొన్ని వాణిజ్య పానీయాలు, ఎనర్జీ బేవరేజెస్ కూడా భారత్‌లో ఒఆర్ ఎస్‌లైక్ అంటూ పదాలను ముద్రిస్తున్నాయని, ఇది చట్టవిరుద్ధమని ఇకపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిం చింది. ఈ ఉత్పత్తులు



ఔషధ పానీయాలు కాదని, చక్కెర, ఇతర రుచులు సమ్మిళి తంచేసి ఉంటాయని అందువల్ల వీటిని ఎంతమాత్రం ఒఆర్ఎస్ అనేందుకు వీలులేదన్నారు.

# మరో 170 మంది మావోల లొంగుబాటు



ఇంద్రావతి నుంచి లొంగిపోయేందుకు వెళ్తున్న మావోయిస్టులు

### నేడు జగ్దల్‌పూర్‌లో సభకు సిఎం విష్ణుదేవ్

**చర్ల, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** ఐదు దశాబ్దాల పాటు దేశ వ్యాప్తంగా మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలతో పాటు దండకారణ్యాన్ని అక్కడ ప్రభుత్వంతో పాటు సమానంగా సమాంతర పాలన నడిపిన నక్సల్స్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కాగార్‌తో కాకావికలం అవుతుంది. ఆయుధాలు విడి జనజీవ స్రవంతిలో కలవాలి లేదంటే మావోయిస్టుల అంతం తప్పదని కేంద్ర హోంశాఖ మంత్రి పలుమార్లు ప్రకటించారు. 2026 మార్చి 31 కల్లా మావోయిస్టు రహిత భారత్‌ను చూస్తారని డెడ్ లైన్ విధించి సంచలనం కలిగించారు. అనుకున్న గడువుకల్లా మావోల ఏరివేత సాధ్యమా అని అనేక అనేక చర్చలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. తాజా సంఘటనలు నేటి పరిస్థితులను నిషితంగా పరిశీలిస్తే మావోయిజం అంతిమ దశకు చేరిందా అన్న సందేశాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. వరసు లొంగుబాట్లు, ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీని కోలుకోని దెబ్బ తీసింది. మరణమే తప్ప శరణం ఉండదని భావించిన కొందరు కేంద్ర కమిటీ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏరియా కమిటీ సభ్యులు లొంగుబాటు సిద్ధం అయ్యారు. కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ తోపాటు 60 మంది వివిధ కేడర్లకు చెందిన మావోలు గడ్చిరోలి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగిపోయిన రెండు రోజుకు మరో 170 మంది మావోయిస్టులు చత్తీస్‌గఢ్ ప్రభుత్వం ముందు లొంగుబాటు సిద్ధం అయ్యారు.

### నేడు జగ్దల్ పూర్ సభ

మావోయిస్టు అగ్రనేత సెంట్రల్ కమిటీ మెంబర్ తక్కిళ్లపల్లి వాసుదేవరావుతోపాటు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యులు రాజమన్ రనిత రాజ సలాంతోపాటు మరికొందరు డివిజన్ కమిటీ సభ్యులు లొంగిపోయేందుకు బీజాపూర్ చేరుకున్నారు. వారిని ప్రత్యేక వాహనాల్లో జగ్దల్ పూర్ తరలిస్తున్నారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హోం మంత్రి విజయ్ శర్మలు ఈ సభకు హాజరుకానున్నారు.

### నక్సల్స్ రహిత ప్రాంతం అబూజ్ మఢ్ చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి

ఉత్తర్ బస్తర్ అబూజ్‌మఢ్ అటవి ప్రాంతం నేడు నక్సల్స్ రహిత ప్రాంతంగా మారిందని బస్తర్‌లో శాంతి, అభివృద్ధికి నాంది పలికిందని ముఖ్యమంత్రి విష్ణుదేవ్ అన్నారు. గడిచిన రెండురోజుల్లో 258 మంది లొంగిపోయారని ప్రస్తుతం మావోయిజం ముగింపు అంచున ఉందన్నారు. గత 22 నెలల్లో సిజీ లో 477 మృతిచెందగా 2.110 మంది లొంగిపోయారని 1785మందిని అరెస్టు చేసామని, చత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ రహితం చేయాలని మా సంకల్పానికి నిదర్శనం అన్నారు. బస్తర్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని మా భద్రతా బలగాలు చేపట్టిన సైనిక చర్య విజయం సాధించిందని అన్నారు.

### రెండురోజుల్లో 258 మంది లొంగుబాటు : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

చత్తీస్‌గఢ్ రెండురోజుల్లో 258 మంది మావోయిస్టులు లొంగిపొయినట్లు అమిత్ షా ఎక్స్ వేదికగా ట్వట్ చేసారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిపొవాలన్నారు.

# అంతిమ దశకు నక్సలిజం: అమిత్‌షా

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** నక్సలిజంపై పోరాటంలో ఇది గుర్తుంచుకోదగిన రోజు అని కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షా అన్నారు. మావోయిస్టుపార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు బుధవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మరుసరిరోజే మరో 170 మంది మావోయిస్టులు చత్తీస్‌గఢ్‌లో సరెండర్ అయ్యారు. ఈ విషయాన్ని చెబుతూ అమిత్‌షా పైవిధంగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు.

బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది, మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. రెండు రోజుల వ్యవధిలో 258 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్‌షా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్‌షా.. లొంగిపోయే వారిని స్వాగతిస్తామని, ఇంకా తుపాకీ కొనసాగించాలనుకునే వారు మాత్రం భద్రతాదళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగున్న వారు తమ ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# మావోయిస్టు నేత బండి ప్రకాశ్ లొంగుబాటు

**హైదరాబాద్, అక్టోబరు 16, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులు తున్నాయి. ఇప్పటికే ఛత్తీసగఢ్ మహారాష్ట్ర, తెలంగాణలో మావోయిస్టు పార్టీ అగ్రనేతలు వారి అనుచరులతోపాటు ఆయుధాలతో వరుసగా లొంగిపోతున్న తరుణంలో సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) నేత, మావోయిస్టు పార్టీలో కీలక సభ్యుడుగా వున్న బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. 40 ఏళ్లుగా దండకారణ్యంలో వున్న ప్రకాష్ సికాసలో కీలక నేతగా వుండడంతో పాటు మావోయిస్టు పార్టీలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కూడా. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన అనుచరులతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోవాలని నిర్ణయించుకుని ఆయుధాలతో సరెండర్ అయినట్లు సమాచారం. ప్రకాష్ బెల్లంపల్లి వాసి. ఇటీవల మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగి పోయిన మా వోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావుకు ప్రకాష్ అత్యంత సన్నిహితుడు. ఆయుధాలు వీడాలని వేణుగోపాల్‌రావు చేసిన ప్రకటన మావోయిస్టు పార్టీలో సంచలనం రేపగా దీనిని ప్రకాష్ సమ ర్థించారు. కాగా ప్రకాష్ లొంగుబాటుపై తెలంగాణ పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై మీడియా సమావేశముండే వీలుందని సమాచారం.

# తల్లిదండ్రులపై కత్తితో కొడుకు దాడి

### ఇద్దరి పరిస్థితి విషమం: వైద్యులు

**హైదరాబాద్ (నార్సింగి), అక్టోబరు 16, ప్రభాత వార్త :** కన్నకొడుకే కత్తితో తల్లిదండ్రులిద్దరిపై దాడిచేసి తీవ్రంగా పొడిచాడు. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఇపి ఎల్ అపీలా అపార్టుమెంట్‌లో భారతి, రవీం దర్‌రెడ్డి దంపతులు తమ కుమారుడైన రఘు పాల్‌రెడ్డితో కలిసి నివాసముంటున్నారు. రఘు పాల్‌రెడ్డి నగరంలోని ఓ కళాశాలలో ఎల్ఎల్‌బి చదువుతున్నాడు. కొంతకాలంగా ఇతడు మాన సిక అనారోగ్యంతో బాధపడు తున్నాడు. తనకు మతిస్థిమితం లేదని తల్లిదండ్రులు భావించి వైద్యం చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఎంత చెప్పినా నా మాటవినడం లేదని బుధ వారం అర్ధరాత్రి తల్లి దండ్రులపై కత్తితో విచక్ష ణారహితంగా దాడి చేశాడు. వారి అరుపులు విన్న చుట్టుపక్కల వారు వచ్చి తీవ్ర గాయాలతో రక్తపుమడుగులో పడి ఉన్న భార్యభర్తలిద్దరిని వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని పోలీసులు వివరించారు. ఈ మేరకు రఘుపాల్‌రెడ్డిని అరెస్టుచేసి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

# అమెరికా రక్షణ మంత్రి విమానం అత్యవసర ల్యాండింగ్



**లండన్, అక్టోబరు 16:** అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ విమానం యూకేలో అత్యవ సరంగా ల్యాండ్ అయ్యింది. విమానం విండ్ షీల్డ్‌లో పగుళ్ల ఏర్పడటంతో అత్య వసరంగా ల్యాండ్ చేసినట్లు తెలుస్తోంది. బ్రస్సెల్స్‌లో నాటో రక్షణ మంత్రుల సమా వేశంలో హెగ్సెత్ పాల్గొన్నారు. అక్కడి నుంచి ఆయన తిరిగి అమెరికాకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ విషయాన్ని పెంటగాన్ కూడా ధ్రువీకరిం చింది. హెగ్సెత్‌తో సహ విమానంలోని వారం తా సురక్షితంగా ఉన్నారని పెంటగాన్ ప్రతినిధి సీన్ పార్నెల్ పేర్కొన్నారు. ఇదిలా వుంటే నాటో సమావేశంలో ఉక్రెయిన్‌పై దూకుడుగా వ్యవహరిస్తున్న రష్యాకు హెగ్సెత్ కీలక హెచ్చ రికలు చేశారు. మాస్కో దూకుడు ఇలాగే కొనసాగితే అమెరికా మిత్రదేశాలతో కలిసి రష్యాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుం దని, ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంపై కూటమి దృష్టి సారిస్తుందని హెచ్చరించారు.

# కొండగట్టు అంజన్న ఆలయంలో విద్యుదాఘాతంతో భక్తురాలు మృతి

### ఆలయ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు

**మల్యాల, (జగిత్యాల జిల్లా), అక్టోబరు 16 ప్రభాతవార్తర:** రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగి త్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి, గురువారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. ఆలయ అధికారుల నిరక్ష్యమేనని ఈ ఘటనకు కారణమని మృతురాలి కుటుంబీకులు మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోదావరిఖనికి చెందిన వెనగంటి సత్యనారాయణ(54) తన తల్లి రాజేశ్వరి(84), భార్య సరిత కుటుంబసభ్యులతో కలిసి బుధవారం వేములవాడలో దర్శనం చేసుకుని గురువారం ఉదయం 6:30కు కొండగట్టు అంజన్న ఆలయానికి చేరుకున్నారు. 7 గంటల ప్రాం తంలో రాజేశ్వరి, కోడలు సరిత కలిసి కొండపైన కోనేరు పక్కనే ఉన్న టాయిలెట్స్‌కు దగ్గరికి వెళ్లారు. మరుగుదొడ్ల గోడకు అనుకొని ఉన్న ఇనుపజాలిని ముట్టుకోగానే రాజేశ్వరితోపాటు సరితకు కరెంట్ షాక్ తగిలింది. దాంతో రాజేశ్వరి స్పృహతప్పి పడిపోయింది. అయితే సరితకు కొద్దిగా షాక్ రాగానే వారిని గమనించిన కుటుంబీకులు వారిద్దరిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే రాజేశ్వరి చనిపోయిందని వెల్లడించారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వచ్చే ఆలయంలో భద్రత కరువైందని, ఇటువంటి దుర్ఘటన జరగడం పట్ల ఆలయ అధికారుల నిరక్ష్యమ్లేనని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అక్కడ ప్రమాదకరమని బోర్డులు సైతం అమర్చకపోవడం, అన్నిటికి మించి విద్యుత్ లైన్లపై పర్యవేక్షణ పట్ల నిరక్ష్యంగా వ్యవహరించడం పై స్థానికులతోపాటు భక్తులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొండగట్టులో తన తల్లి రాజేశ్వరి కరెంటుషాక్‌తో చనిపోవడానికి ఆలయ ఇఓతో పాటు సంబంధిత అధికారుల నిరక్ష్యమే కారణమని మృతురాలి పెద్ద కొడుకు సత్యనారాయణ ఫిర్యాదు చేశాడని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు,



# ఇద్దరు పిల్లల నిబంధన కట్

### స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హతపై తెలంగాణ కేబినెట్ నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబరు16 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లలకు మించి సంతానమున్న వారు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులనే నిబంధనను తొలగించేందుకు మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్ నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో జనాభా నియంత్రణ కట్టుదిట్టంగా అమలవుతున్న తరుణంలో ఇద్దరు పిల్లల నిబంధనను అమలు చేయాల్సి న అవసరం లేదనే మంత్రి వర్గ సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయని, ఈ నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ వానా కాలంలో 1.48కోట్ల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. దేశంలోనే ఇది రికార్డు స్థాయి ఉత్ప త్తి. ఇందులో రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని పౌరసరఫరాల విభాగం అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు అంగీకరించింది. మరో 15 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని మంత్రి వర్గం నిర్ణయించింది. వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ధాన్యానికి చెల్లించే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో వెంట వెంటనే జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా మూడు (3) అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. హుజూర్‌నగర్, కొడంగల్, నిజామాబాద్‌లో అగ్రికల్చర్ కాలేజీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తుంది. ఉత్సవాల నిర్వహణ.. సంబంధిత ఏర్పాట్లపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

### సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్‌లో

# భారత్ ఓటమి

### 2-4 తేడాతో ఆస్ట్రేలియా విజయం



**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025లో ఆస్ట్రేలియాపై భారత్ 2-4తేడాతో ఓటమి పాలైంది. మలేషియాలోని జోహోర్‌లో జరుగుతున్న జోహోర్ కప్‌లో భాగంగా గురువారం జరిగిన నాల్గవ పూల్‌స్టేజ్ మ్యాచ్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు వైఫల్యం చెందింది. బ్లూ కోల్ట్స్ తరఫున భారత కెప్టెన్ రోహిత్ (22వ నిముషం), అర్ష్‌దీప్ సింగ్ (60) గోల్స్ చేయగా, ఆస్ట్రేలియా తరఫున ఆస్కార్ స్ర్పోల్ (39, 42), ఆండ్రూ ప్యాట్రిక్ (40), కెప్టెన్ డిలాన్ డౌనీ (51) గోల్స్ చేశారు. మొదటి క్వార్టర్‌లో ఇరు జట్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. రెండవ క్వార్టర్‌లో భారత్ 17వ నిమిషంలో తొలి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, కానీ అన్మోల్ ఎక్కా ఫ్లిక్ గోల్ చేసి పోస్ట్‌ను దాటించాడు. 22వ నిమిషంలో భారత్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకున్నా కెప్టెన్ రోహిత్ (22) తక్కువ స్ట్రైక్‌తో నెట్‌లోకి వెళ్ళేలా విజయవంతంగా దానిని మలిచాడు. 25వ నిమిషంలో అమీర్ అలీ ఎడమ వైపు నుండి బలమైన సోలో పరుగు చేసి దూరం నుండి షాట్ తీయడంతో ఆధిక్యాన్ని పెంచే దశకు చేరుకున్నాడు. మూడో క్వార్టర్‌లో ఆస్ట్రేలియా వరుసగా మూడు గోల్స్ చేసి మ్యాచ్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 39వ నిమిషంలో మొదటిగోల్‌రాగా, ఆస్కార్ స్ర్పోల్ (39) గోల్ చేసి స్కోరును సమం చేశాడు. తర్వాత పెనాల్టీ కార్నర్ సమయంలో ఆండ్రూ ప్యాట్రిక్ (40) గోల్ చేయడంతో ఆధిక్యంలోకి వెళ్లారు. ఆస్కార్ స్ర్పోల్ (42) రెండవ గోల్ చేయగా, బ్యాక్‌హ్యాండ్ స్ట్రైక్‌తో 49వ నిమిషంలో భారత్ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, తర్వాత ఆస్ట్రేలియా ఐదవ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని డిలన్ డౌనీ గోల్‌గా చేసి ఆధిక్యాన్ని మరింత పెంచాడు. పోటీ చివరి నిమిషంలో, అర్ష్‌దీప్ సింగ్ గోల్‌లోకి నైపుణ్యంగా దూసుకెళ్లి భారత్ తరపున సాయంత్రం రెండవ గోల్ సాధించి మ్యాచ్‌ను ముగించాడు.

## డెన్మార్క్ ఓపెన్‌లో దూసుకెళ్లిన సాత్విక్, లక్ష్య



**న్యూఢిల్లీ:** డెన్మార్క్ ఓపెన్ 2025లో భారత్ షట్లర్స్ సాత్విక్ చిరాగ్, లక్ష్య సేన్ రెండో రౌండ్‌కు చేరుకున్నారు. ఒడెన్స్‌లో జరిగిన వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్ అయిన డెన్మార్క్ ఓపెన్ లో భారత పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి బలమైన పునరాగమనం చేసి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఆరో సీడ్ ఆటగాడు ఒక సెట్ పరాజయం నుండి కోలుకుని స్కాట్లాండ్‌కు చెందిన క్రిస్టోఫర్ గ్రిమ్లీ మరియు మాథ్యూ గ్రిమ్లీలను 17-21, 21-11, 21-17 తేడాతో ఓడించి ఒక గంటా నాలుగు నిమిషాల పాటు కొనసాగాడు. తొలి సెట్‌ను 17-21 తేడాతో కోల్పోయిన భారత జంట, రెండో సెట్‌లో 8-4తో నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, 21-11 స్కోరుతో ఆధిక్యాన్ని సంపాదించింది. మూడో సెట్ నిర్ణయాత్మకంగా మారింది. రెండు జట్లు 10 ఆల్‌తో సమానంగా తలపడ్డాయి. తర్వాత సాత్విక్-చిరాగ్ 18-12 ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. స్కాటిష్ జంట ఆలస్యంగా తిరిగి పోరాడినా, భారత ధీటుగా ఎదుర్కొని 21-17తో ముగించింది. కేవలం ఒక గంటలోనే పోటీని ముగించింది.

### ఆసియా పారా ఛాంపియన్‌షిప్..

# భవీనా ఓటమి

### పురుషుల సింగిల్స్‌లో 2 కాంస్యాలు





**న్యూఢిల్లీ:** ఆసియాపారా టిటి ఛాంపియన్‌షిప్-2025లో ఎనిమిది సార్లు పారాలింపిక్ ఛాంపియన్‌షిప్ చేతిలో భవీనా పటేల్ ఓడిపోయింది. చైనాలోని బీజింగ్‌లో గురువారం జరిగిన ఆసియా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్యాడ్లర్ భావినా పటేల్ క్వార్టర్ ఫైనల్‌లో నిష్క్రమించి నిరాశపరిచింది. మహిళల సింగిల్స్ 4-5 విభాగంలో ఆమె 8 సార్లు పారాలింపిక్ ఛాంపియన్ చైనాకు చెందిన జాంగ్ బియాన్‌పై 11-8, 3-11, 8-11, 9-11 తేడాతో నాలుగు గేమ్‌ల పోటీలో ఓటమి పాలైంది. క్లాస్ 4 క్రీడాకారిణి అయిన భావినా, ఈ పోటీలో ఎంట్రీలు లేకపోవడంతో క్లాస్ 5 కేటగిరీతో కలపాల్సి వచ్చింది. ఆమె క్లాస్ 4 విభాగంలో టాప్‌సీడ్ అయినప్పటికీ, 5వ కేటగిరిలో పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ అయిన జాంగ్ అనే కఠినమైన ప్రత్యర్థితో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఎదుర్కొంది. మరోవైపు, జెహాన్ మదన్, సందీప్ డాంగి ఇద్దరూ సెమీఫైనల్‌కు చేరుకోవడంతో, పురుషుల సింగిల్స్ క్లాస్ 1 విభాగంలో భారత్ డబుల్ పోడియంను సాధించింది. వారు తమ గ్రూప్‌లో రెండవ స్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. అయితే, వారు కొరియా ప్రత్యర్థుల చేతిలో సెమీఫైనల్స్‌లో ఓడిపోయారు, కానీ భారత్‌కు రెండు కాంస్య పతకాలను సాధించిపెట్టారు.




### డబ్ల్యుటిసి ఫైనల్స్‌లో పాక్‌తో భారత్

# మరోసారి బిగ్ ఫైట్

### మారుతున్న సమీకరణాలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటిసి) పాయింట్ల పట్టికలో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దీంతో ఫైనల్స్‌కు ఎవరు చేరుతారనేది ఉత్కంఠంగా మారింది. ఈసారి టైటిల్ మ్యాచ్‌లో భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య కీలక పోరుకు దారితీసే ఆసక్తికరమైన సమీకరణాలు చోటు చేసుకున్నాయి. 2025-27 డబ్ల్యూటిసిలో పాక్ దక్షిణాఫ్రికాతో తన తొలి విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా పాయింట్ల పట్టికలో పాకిస్తాన్ టీమ్ ఇండియాను అధిగమించి రెండవ స్థానానికి చేరుకుంది.

పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో, శ్రీలంక మూడవ, భారత్ నాల్గవ స్థానంలో ఉన్నాయి. ఇంగ్లాండ్ ఐదవ స్థానానికి పడిపోయింది. వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో విజయం సాధించిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు స్వదేశంలో దక్షిణాఫ్రికా సవాలును ఎదుర్కోనుంది. భారత్ డబ్ల్యూటిసిలో ఆడటానికి ప్రస్తుతం 11 టెస్ట్ మ్యాచ్‌లు ఉన్నాయి. వీటిలో ఏడు స్వదేశంలో ఆడనుంది. దక్షిణాఫ్రికాతో రెండు టెస్ట్‌ల సిరీస్ నవంబర్ 14న ప్రారంభమవుతుంది. తర్వాత, రెండు టెస్ట్ ల కోసం ఆగస్టు 2026లో శ్రీలంక, అక్టోబర్, నవంబర్‌లో న్యూజిలాండ్‌లో పర్యటిస్తుంది. తదుపరి 2027 జనవరి, ఫిబ్రవరిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడుతుంది. ఇలా టీం ఇండియా స్వదేశంలో ఏడు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతుంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లే టీం ఇండియా ఫైనల్‌కు చేరుకోవడానికి ఒక అవకాశంగా మారనున్నాయి. పాకిస్తాన్‌కు సంబంధించి దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మ్యాచ్ గెలిచిన తర్వాత, 12 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటిలో 5 మ్యాచ్‌లు స్వదేశంలో, 7 విదేశీ గడ్డపై జరుగుతాయి. అక్టోబర్ 20న దక్షిణాఫ్రికాతో రెండవ టెస్ట్ తర్వాత, పాక్ నవంబర్ 2026లో స్వదేశంలో శ్రీలంకతో రెండు టెస్ట్‌లు, మార్చి 2027లో న్యూజిలాండ్‌తోను, ఇక మార్చి 2026లో బంగ్లాదేశ్, జూలై, ఆగస్టులో వెస్టిండీస్‌కు, సెప్టెంబర్ లో మూడు టెస్ట్ కోసం ఇంగ్లాండ్‌లో పర్యటిస్తుంది. బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లతో పాకిస్తాన్ సిరీస్ సులభం కావచ్చు. అయితే, స్వదేశంలో, పాకిస్తాన్ అన్ని ఐదు టెస్ట్ మ్యాచ్‌లను ఎలాగైనా గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంటుంది. ఈ పరిస్థితుల్లో ఈసారి డబ్ల్యూటిసి చివరి మ్యాచ్ భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతుందని భావిస్తున్నారు.

### టెస్ట్ ర్యాంకింగ్స్‌లో

## మెరుగుపడ్డ జైస్వాల్, కుల్దీప్

**న్యూఢిల్లీ:** రెడ్‌బాల్ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యం తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ప్రతిబింబిస్తూనే ఉంది, వెస్టిండీస్‌పై 2-0 టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తర్వాత యశస్వి జైస్వాల్, కుల్దీప్ యాదవ్ గణనీయమైన లాభాలను సాధించారు. టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో జైస్వాల్ రెండు స్థానాలు మెరుగుపడి ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ తర్వాత ఐదవ స్థానానికి చేరుకున్నాడు, కరేబియన్ జట్టుపై బంతితో తన అద్భుత ప్రదర్శన కారణంగా కుల్దీప్ ఏడు స్థానాలు మెరుగుపడి టెస్ట్ బౌలర్లలో 14వ స్థానానికి చేరుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ 34 స్థానాలు దాటి 66కు, సెంచరీ మేకర్ జాన్ కాంప్‌బెల్ టెస్ట్ బ్యాటింగ్ జాబితాలో ఆరు ఎగబాకి 68వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్లలో జోమెల్ వారికన్ రెండు పైకి ఎక్కి 30వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌పై 3-0 సిరీస్‌ను ఆఫ్ఘనిస్తాన్ కైవసం చేసుకున్న తర్వాత రషీద్ ఖాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ ఇద్దరూ తమ తమ విభాగాలలో నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఒమర్జాయ్ ఒక స్థానం మెరుగుపరుచుకుని జింబాబ్వేకు చెందిన సికందర్ రాజాను నంబర్ 1 వన్డే ఆల్ రౌండర్‌గా నిలబెట్టాడు. రషీద్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో రెండు ఎగబాకి నాల్గవ స్థానానికి చేరుకున్నాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికైన ఇబ్రహీం జాద్రాన్, ఆఫ్ఘనిస్తాన్ తరపున బ్యాటింగ్ చార్టులలో ఎనిమిది ఎగబాకి రెండవ స్థానానికి చేరుకున్నాడు. ఇప్పుడు నంబర్ 1 స్థానంలో కొనసాగుతున్న భారత్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ కంటే కేవలం 20 రేటింగ్ పాయింట్లు వెనుకబడి ఉన్నాడు.

## ఇన్ఫోసిస్ నికరలాభం రూ.7364 కోట్లు!

వాణిజ్యం



**బెంగళూరు, అక్టోబరు 16:** ఐటిసేవల దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్ రెండోత్రైమాసికంలో నికరలాభం 13శాతంపెరిగి 7364 కోట్లు నమోదుచేసింది. దీనితో కంపెనీ కూడా ప్రతి షేరుకు రూ.23 డివిడెండ్‌ను ప్రకటించింది. ఈనెల 27వ తేదీ రికార్డు తేదీగాను, చెల్లింపులతేదీ నవంబరు ఏడోతేదీగానుప్రకటించింది. ఈత్రైమాసికంలో రాబడులు 8.6శాతం పెరిగి 44,490 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు త్రైమాసికంలో 40,986 కోట్లనుంచి గణనీయంగా పెంచుకోగలిగింది. కంపెనీనుంచి ఉద్యోగులు వీడిపోవడం మాత్రం కొంతపెరిగింది.

గత ఏడాది ఇదే త్రైమాసికంలో 12.9శాతం ఉంటేఈ ఏడాది రెండోత్రైమాసికంలో 14.3శాతంగా ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. కంపెనీ భారీ డీల్స్ 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రెండో త్రైమాసికంలో భారీ డీల్స్ సాధించామని, 67శాతం కొత్త కాంట్రాక్టులే ఉన్నాయని సిఇఒ సలీల్‌పరేఖ్ అన్నారు. క్లయింట్ల ప్రాధాన్యతలకు అనుగుణంగా కృత్రిమ మేథ వాతావరణంలో గణనీయమైన సేవలు అందించినట్లు చెప్పారు. కంపెనీ ప్రనతి షేరుకు రాబడులు 17.76 రూపాయలుగా ఉంది. స్వేఛ్ఛాయుత నగదు ఈ త్రైమాసికంలో 9677 కోట్లుగా ఉంది. సెప్టెంబరులోనే కంపెనీ 18 వేల కోట్ల షేర్ బైబాక్‌ను కూడా ప్రకటించింది. బిఎస్‌ఇలో ఇన్ఫోసిస్ షేర్లు స్వల్పంగా క్షీణించాయి. 0.08శాతంగా నమోదయి 1472.75గా ట్రేడ్ అయింది.

# ఆకాశాన్ని తాకుతున్న బంగారం, వెండి


**ముంబయి, అక్టోబరు 16:** బంగారం, వెండి ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. గురువారం ట్రేడింగ్‌లో పసిడి, వెండి ధరలు సరికొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో పసిడికి డిమాండ్ అమాంతం పెరిగి ధరలు చుక్కలనంటాయి. దేశీయ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం డిసెంబర్ ఫ్యూచర్స్ ధర ఏకంగా రూ. 1,200 మేర పెరిగి, 10 గ్రాములు రూ. 1,28,395 వద్ద సరికొత్త జీవనకాల గరిష్టాన్ని నమోదు చేసింది. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. ఎంసీఎక్స్ సిల్వర్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కెజికి రూ. 1,900కు పైగా పెరిగి, రూ. 1,64,150 వద్ద కొత్త రికార్డు సృష్టించింది. ఉదయం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర 0.60 శాతం లాభంతో రూ. 1,27,960 వద్ద, కేజీ వెండి ధర 1 శాతం లాభంతో రూ. 1,63,812 వద్ద ట్రేడ్ అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తపరిస్థితులు, అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతాయన్న



అంచనాలు, డాలర్ బలహీనపడటం వంటి అంశాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ముఖ్యంగా, చైనా ఇటీవల రేర్‌ఎర్త్ మెటీరియల్స్ ఎగుమతులపై ఆంక్షలను మరింత కఠినతరం చేసింది. చైనా చర్యలను అమెరికా అధికారులు తీవ్రంగా విమర్శించడమే కాకుండా, ప్రతీకార చర్యలు ఉంటాయని సంకేతాలిచ్చారు. ఈ పరిణామాలు ప్రపంచ సరఫరా వ్యవస్థకు ముప్పుగా మారడంతో పెట్టుబడిదారులు బంగారం కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు. అమెరికా డాలర్ ఇండెక్స్ 0.1 శాతం తగ్గి, వారం రోజుల కనిష్టానికి చేరడం కూడా పసిడికి కలిసొచ్చింది. డాలర్ బలహీనపడటంతో ఇతర కరెన్సీలలో బంగారం ధరలు చౌకగా మారతాయి. దీంతో విదేశీ ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ పెరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర ఏకంగా 61 శాతం పెరగడం గమనార్హం. అమెరికాలో షట్‌డౌన్ కొనసాగితే ఈ వారం విడుదల కావాల్సిన ద్రవ్యోల్బణం, రిటైల్ అమ్మకాల వంటి కీలకమైన ఆర్థిక డేటా వాయిదా పడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# 16వేల మందికి నెస్లే ఉద్వాసన



**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ ఫుడ్ సంస్థ నెస్లే ఊహించని షాక్ ఇచ్చింది. ఈ ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ ఉద్యోగుల తొలగింపులు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఒకేసారి ఏకంగా 16000 మంది ఉద్యోగులను తొలగించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఉద్యోగాల కోతలపై నెస్లే సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ గురువారం స్పందిస్తూ వచ్చే రెండేళ్ల కాలానికి ఈ తొలగింపులు ఉంటాయన్నారు. మొత్తంగా 16 వేల మందికి ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం. ప్రపంచం మారుతోంది. అందుకు తగినట్లుగా నెస్లే కంపెనీ వేగంగా మారాల్సి ఉంది. ఇది కఠినమైన నిర్ణయమే అయినా ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడం అనేది ఆ మార్పులో ఒక భాగమే అని ఒక ప్రకటనలో సిఇఒ ఫిలిప్ నవ్రాటిల్ ప్రకటించారు. ఉత్పత్తి, సరఫరా విభాగాల్లో ఇప్పటికే 4 వేల మందిని తొలగించే ప్రాసెస్ మొదలైనట్లు చెప్పారు. వారితో పాటుగా మరో 12000 మంది వైట్ కాలర్ ఉద్యోగులను ఈలేఆఫ్స్‌లో భాగంగా తొలగిస్తామన్నారు. ఈ లేఆఫ్స్ వల్ల కంపెనీకి ఒక బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ ఆదా అవుతాయని చెప్పారు. 2027 సంవత్సరం నాటికి నెస్లే తమ పొదుపు లక్ష్యాన్ని 3 బిలియన్ స్విస్ ఫ్రాంక్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఎఫ్‌ఎంసీజీ సెక్టార్‌లోని ఈ స్విస్ కంపెనీ 2000 బ్రాండ్లను కలిగి ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో నాయకత్వ అస్థిరత సమస్యను ఎదుర్కొంది. తన సబార్డినేట్‌తో ప్రేమ వ్యవహారం నడిపించిన ఆరోపణలతో లారెంట్ ఫ్రీక్సే సిఇఒ పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. ఇది కంపెనీ రూల్స్‌కి విరుద్ధమని నెస్లే కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఆయన్ను తక్షణం ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపింది. తమ విలువలు కంపెనీకి బలమైన పునాదులుగా ఆ సంస్థ ఛైర్మన్ పాల్ బుల్కే ఈ సందర్భంగా తెలిపారు. తర్వాత పాల్ సైతం తన పదవి నుంచి తప్పుకున్నారు. తన పదవీ కాలం ముగియక ముందే ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది.

# రెండోరోజు లాభాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

### మార్కెట్లకు బ్యాంకింగ్, ఎన్బీఎఫ్‌సిల మద్దతు

**ముంబయి, అక్టోబరు 16:** ఈక్విటీసూచీలు వరుసగా రెండోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. ఎంపిక చేసిన స్టాక్స్‌లో భారీ కొనుగోళ్లకుతోడు రెండోత్రైమాసిక ఫలితాలు కూడా మార్కెట్లకు మద్దతిచ్చాయి. వీటికితోడు విదేశీ ఫండ్‌లరాక మరింతగా పెరిగింది. బ్యాంకింగ్; ఎఫ్ఎంసిజి కౌంటర్లలో కొనుగోళ్లు భారీగా ఉన్నాయి. ముడిచమురుదరలు కూడా కొంతమేర సడలింపులు కనిపించాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మెంట్లలో కూడా వృద్ధినమోదయింది. బిఎస్ఇ స్మాల్‌క్యాప్ 0.47శాతం, మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 2378 కంపెనీలషేర్లు పెరిగితే 1809 కంపెనీల షేర్లు క్షీణించాయి. 151 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. రిలయన్స్ 1.69శాతం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.54శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.34శాతం మేరపెరిగాయి. భారత్ పదేళ్ల బాండ్లపేపర్ 0.17 శాతం పెరిగి 6.495గా నిలిచింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో రూపాయి కొంతమేర పెరిగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 87.85గా నడిచింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు ఐదు నాటికి 0.78శాతంగా ఉంది.



### అమెరికా మార్కెట్‌లో కుప్పకూలిన

# భారత్ ఎగుమతులు!

**న్యూఢిల్లీ, అక్టోబరు 16:** అమెరికా మార్కెట్‌లో భారత ఎగుమతులు పెనుసంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాషింగ్టన్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం మేర భారీ సుంకాలను విధించడంతో కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే అమెరికాకు మన ఎగుమతులు 37.5 శాతం మేర కుప్పకూలాయి. ఈ ఆందోళనకర విషయాన్ని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. జీటీఆర్ఐ గణాంకాల ప్రకారం ఈ ఏడాది మే 2025 నుంచి సెప్టెంబర్ 2025 మధ్య కాలంలో అమెరికాకు భారత ఎగుమతులు తీవ్రంగా పడిపోయాయి. మేనెలలో 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్ నాటికి 5.5 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఈ నాలుగు నెలల్లోనే నెలవారీ ఎగుమతుల విలువలో భారత్ ఏకంగా 3.3 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వరుసగా నాలుగు నెలల పాటు ఎగుమతులు క్షీణించడం ఇదే తొలిసారి. అమెరికా విధించిన 50 శాతం సుంకాలు పూర్తిగాఅమల్లోకి వచ్చిన తర్వాత, సెప్టెంబర్ నెలలో అత్యంత తీవ్రమైన ప్రభావం కనిపించింది. ఆగస్టులో 6.87 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులు, సెప్టెంబర్‌లో ఏకంగా 20.3 శాతంతగ్గి 5.5 బిలియన్ డాలర్లకు చేరాయి. 2025లో ఒకే నెలలో ఇంతటి భారీ పతనం నమోదు కావడం ఇదే మొదటిసారి అని నివేదిక స్పష్టం చేసింది. ఈ సుంకాల ప్రభావం ముఖ్యంగా టెక్స్‌టైల్, జెమ్స్ అండ్ జువెలరీ,ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలవంటి కీలక రంగాలపై పడింది. ఈ రంగాల నుంచి ఎగుమతులు భారీగా పడిపోవడంతో మొత్తంఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అమెరికా వంటి అతిపెద్ద మార్కెట్‌లో భారత తయారీ, ఎగుమతిరంగాల పోటీతత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాషింగ్టన్ విధించినసుంకాలే ఈ పతనానికి ప్రత్యక్ష కారణమని స్పష్టంచేసిన జీటిఆర్ఐ, భారత వాణిజ్య ప్రయోజనాలను కాపాడుకోవడానికి తక్షణమే విధానపరమైన సమీక్ష చేపట్టాలని సూచించింది.

# ధరల పెరుగుదలతో గోల్డ్‌బాండ్లకు భారీ రిటర్నులు!




**ముంబయి,అక్టోబరు 16:** బంగారం ధరలు పెరుగుతున్న కొద్దీ వాటిపై లాభాలు కూడా భారీగానే వస్తున్నాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఇటిఎఫ్, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతున్నారు. తద్వారా మంచి లాభాలు పొందుతున్నారని చెప్పొచ్చు. ఇక బంగారంపై పెట్టుబడులు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గతంలో సావరిన్ గోల్డ్ బాండ్ స్కీమ్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల రుణ భారం నేపథ్యంలో కొత్తగా పలు విడతలను జారీ చేయట్లేదు. గతంలో ఇష్యూ చేసిన వాటికి సంబంధించి టెన్యూర్ ముగిసే వరకు కొనసాగించనుంది. సాధారణంగా గోల్డ్ బాండ్ల పరిమితి 8 సంవత్సరాలుగా ఉంటుంది.

ఇక్కడ ఐదేళ్ల దాటిన తర్వాత ముందుగా విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇక్కడ ఒక్కో యూనిట్‌ను ఒక్కో గ్రాముగా పేర్కొంటారు. కనీసం గ్రాము నుంచి గరిష్టంగా 4 కిలోల వరకు కొనుగోలు చేయొచ్చు. బంగారం ధర పెరుగుతున్న కొద్దీ.. నేరుగా లాభం వస్తుందని చెప్పొచ్చు. ఇంకా వడ్డీ కూడా చెల్లిస్తుంది. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్బీఐ ఈ గోల్డ్ బాండ్లను జారీ చేసింది. ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ ఇష్యూ డేట్, రిడెంప్షన్ డేట్ ముందు 3 రోజుల సగటు ధర ఆధారంగా ఇష్యూ ధర, రిడెంప్షన్ ధర ప్రకటిస్తుంటుంది.ఇప్పుడు 2017-18 సిరీస్ గోల్డ్ బాండ్ స్కీమ్ రిడెంప్షన్ ధరను ఆర్బీఐ ప్రకటించింది. ఈనెల 16 నుంచే రిడీమ్ చేసుకోవచ్చని ఆర్బీఐ ఒక సర్క్యులర్ విడుదల చేసింది. దీనిని 2017, అక్టోబర్ 16న ఇష్యూ చేయగా సరిగ్గా 8 ఏళ్లకు రిడెంప్షన్ డేట్‌గా ప్రకటించింది. ఇక్కడ బంగారం ధర పెరుగుదలకు అదనంగా 2.50 శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లిస్తుంది. ఈ గోల్డ్ బాండ్ల ఇష్యూ ధర గ్రాముకు అప్పట్లో రూ. 2,866 గా ప్రకటించింది. ఇక్కడ ఆన్‌లైన్‌లో అప్లై చేసి డిజిటల్ పేమెంట్ చేస్తే రూ. 50 డిస్కౌంట్ వస్తుంది. అప్పుడు ఇష్యూ ధర రూ. 2,816గానే ఉంటుంది. ఇప్పుడు చూస్తే రిడెంప్షన్ ధర ఏకంగా రూ. 12,567 గా ఉంది. ఇక్కడ చూస్తే గ్రాముకే రూ. 9,751 చొప్పున లాభం వచ్చింది. ఇంకా వడ్డీ అదనం అని చెప్పొచ్చు. దీంతో ఏకంగా 346 శాతం రిటర్న్ రావడం విశేషం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14